www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

పలు జిల్లాలకు పొగమంచు హెచ్చరిక

రాష్ట్రంలో పెరిగిన చలి తీవ్రత



కోనసీమ జిల్లా మడికి వద్ద జాతీయ రహదారిని కమ్మేసిన పొగ మంచు

3

సోమవారం | 19-1-2026 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 313

శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: పాడ్యమి రా.2.14 తదుపరి విదియ, నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ.11.52 తదుపరి శ్రవణం, వర్జ్యం: సా.4:04-5.45, దుర్ముహూర్తం: మ.12.48-1.32, మ.3.01-3.45, అమృతఘడియలు: రా.2.10-3.51, రాహుకాలం:ఉ. 7.30- 9.00, సూర్యోదయం: 6.52, సూర్యాస్తమయం: 5.59

గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

యూనివర్సిటీల్లో కులవివక్ష తీవ్రం!

ఐదేళ్లలో 118 శాతం పెరిగిన ఫిర్యాదులు

2019-20లో 173.. 2023-24లో 378

యూజీసీ గణాంకాలు వెల్లడి

2

'గ్రీన్‌లాండ్ సుంకాల'పై ఈయూ ఫైర్!

అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం

నిలిపివేతకు ఈయూ పార్లమెంటు నిర్ణయం

గ్రీన్‌లాండ్‌పై తమ వైఖరి మారదంటూ

ఏడు దేశాల సంయుక్త ప్రకటన

2

ట్రంప్ ప్రతిపాదనకు వ్యతిరేకంగా డెన్మార్క్‌లో ప్రజల నిరసన ప్రదర్శన



ఇరాన్‌లో నరమేధం

అల్లర్లలో 5 వేల మంది మృతి

వారిలో 500 మంది భద్రతా సిబ్బంది

ప్రోత్సహించి, వెనక్కి తగ్గిన ట్రంప్.. ఉద్యమకారుల ఆగ్రహం

2



ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు. (ఇన్‌సెట్‌లో) ఎన్టీఆర్‌కు చంద్రబాబు, పల్లా, అచ్చెన్నాయుడు తదితరుల నివాళులు

క్రెడిట్ చోరీ ఎవరిదో అందరికీ తెలుసు!

క్రెడిబిలిటీ ఎవరికుందో కూడా తెలుసు: సీఎం

అభివృద్ధి చేయలేని వాళ్లకే క్రెడిట్ పాట్లు

అధికారంలో ఉన్నప్పుడు 3 ముక్కలాట

3 ప్రాంతాల్లోనూ చావుదెబ్బతిన్నారు

పిన్నమ్మ పుస్తెలు తెంచిన నేరస్థులను రాజకీయం ముసుగులో కాపాడుతున్నారు

ముఖ్యమంత్రి ఎక్కడుంటే అదే రాజధానా..?

జగన్.. బెంగళూరు, ఇడుపులపాయలో ఉంటే అవి రాష్ట్రానికి రాజధానులు అవుతాయా?

పల్నాడు జిల్లాలో ఫ్యాక్షనిజం చేయనివ్వం

ఎన్టీఆర్‌ను మరువం.. ఆయన మార్గం విడువం

కార్యకర్తల వల్లే సీఎం సీటులో కూర్చున్నా

ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో చంద్రబాబు

క్రెడిట్ చోరీ అంటూ గింజుకుంటున్న వాళ్లకు కూడా ఓ క్రెడిట్ ఉంది. ఇసుక మాఫియా, మద్యం మాఫియా, గనుల దోపిడీ, డ్రగ్స్, గంజాయి.. ఇదీ వాళ్ల క్రెడిట్. ప్రజల ఆస్తులపై ఫొటోలు వేసుకోవడం వాళ్ల క్రెడిట్. రూ.700 కోట్లు ఖర్చు చేసి సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకోవడం, ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం, టీచర్లను బ్రాందీ షాపుల వద్ద కాపలా పెట్టడం వాళ్ల క్రెడిట్.

- సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో క్రెడిట్ ఎవరిదో.. క్రెడిబిలిటీ ఎవరికుందో.. క్రెడిట్ చోరీ ఎవరిదో.. ప్రజలకు తెలుసు. వారు అన్నీ గమనిస్తూనే ఉన్నారు." అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు అన్నారు. వైసీపీ నేతలు 'క్రెడిట్ చోరీ' అని గింజుకున్నా.. సైబరాబాద్, కియా, గూగుల్, భోగాపురం విమానాశ్రయం, గ్రీన్ ఎనర్జీ వంటివన్నీ టీడీపీ తెచ్చినవేనన్న విషయం ప్రజలందరికీ తెలుసునని ఉద్ఘాటించారు. "అభివృద్ధి ఆలోచనే లేని వారు ఇతరుల ఆలోచనలు.. అభివృద్ధి పనులను తమ ఖాతాలో వేసుకుని.. క్రెడిట్ కోసం

మిగతా 11వ పేజీలో...

రైతు ఓకే అంటేనే ఫైనల్!

భూముల రీ-సర్వేలో నయా రూల్స్

భూముల రీ-సర్వేలో అధికారుల ఇష్టాయిష్టాలు కాదు.. అన్నదాతల అభీష్టమే ఫైనల్. సర్వే ప్రారంభం నుంచి ముగింపు వరకు అన్ని దశల్లోనూ రైతులదే కీలక పాత్ర. హక్కుల నిర్ధారణ నుంచి పాస్ పుస్తకాల మంజూరు వరకు వారిదే భాగస్వామ్యం. ఒక్కమాటలో చెప్పాలంటే.. భూమికి- రైతుకు ఉన్న బంధాన్ని గుర్తించిన ప్రభుత్వం రీ-సర్వేలో వారినే రాజులను చేసింది. వారి అభిప్రాయాలకే పెద్దపీట వేసింది. ఈ మేరకు రీ-సర్వే విధివిధానాల్లో పలు కీలక మార్పులు చేస్తూ అన్నదాతల భాగస్వామ్యాన్ని పెంచుతూ రెవెన్యూ శాఖ మార్గదర్శకాలను జారీ చేసింది.

సర్వే ప్రారంభం, చివరిలోనూ రైతు ఈ-కేవైసీతోనే హక్కుల నిర్ధారణ

పాస్ పుస్తకాల జారీ సహా ప్రతి దశలోనూ భాగస్వామ్యం

వెబ్‌ల్యాండ్ డేటా ఆధారంగా రైతన్నలకు అధికారుల నోటీసు

గ్రామసభలో తీర్మానానికి పెద్దపీట

తర్వాతే ఆర్‌వోఆర్‌కు ఆమోదం

రీ సర్వే విధివిధానాల్లో మార్పులు

రెవెన్యూ శాఖ మార్గదర్శకాలు జారీ



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

భూముల రీ-సర్వేలో రైతులకు కీలక పాత్ర కల్పిస్తూ రెవెన్యూ శాఖ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం.. రైతుల ప్రమేయంతోనే గ్రామంలో భూముల సర్వేను ప్రారంభించి.. ముగిస్తారు. ఈ మేరకు నోటిఫికేషన్ 13 ప్రకారం రీ-సర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయనున్నారు. భూముల సర్వే ప్రారంభం, ముగింపు, రికార్డ్ ఆఫ్ రైట్స్(ఆర్‌వోఆర్-భూమి హక్కుల) నిర్ధారణ, పాస్‌పుస్తకాల జారీ వంటి కీలక అంశాల్లో రైతు భాగస్వామ్యం ఉండాలని రెవెన్యూశాఖ దిశానిర్దేశం చేసింది. ఈ నేపథ్యంలో రీ-సర్వేకు నోటీసులు ఇవ్వడం నుంచి చివరకు భూమి హక్కుల నిర్ధారణ వరకు ప్రతి దశలో రైతుల భాగస్వామ్యం, ఆమోదం ఉండేలా నూతన విధివిధానాలను రూపొందించింది. వచ్చే 223 రోజుల వ్యవధిలో చేపట్టే భూముల సర్వేలో తొలి 143 రోజుల పాటు ఏం చేయాలి?. ఏ దశలో ఏ పని చేపట్టాలి?... వంటి కీలక అంశాలతోపాటు అధికారుల బాధ్యతలను నిర్దేశిస్తూ భూ పరిపాలనా ప్రధాన కమిషనర్(సీసీఎల్‌ఏ) ఇ. జయలక్ష్మి తాజాగా నూతన విధివిధానాలను జారీ చేశారు. సర్వే, సరిహద్దుల చట్టం-1923 ప్రకారం

మిగతా 12వ పేజీలో...

అన్నీ రైతులకు తెలిసేలా..

- రైతులను, పట్టాదారులను గ్రామసభకు పిలుస్తారు
- రీ-సర్వే రికార్డులను ప్రదర్శిస్తారు
- పేరుపేరునా పిలిచి పాస్‌పుస్తకాల పంపిణీ
- అవసరమైతే మరోసారి అభ్యంతరాల స్వీకరణ
- తుది రికార్డును జిల్లా గెజిట్‌లో ప్రచురిస్తారు
- రీ-సర్వే ప్రారంభంలో తొలిసారి ఈ-కేవైసీ
- సర్వే నిర్ధారణ తుదిదశలోనూ ఈ-కేవైసీ
- 2 దశల్లోనూ రైతుల అభిప్రాయమే ఫైనల్

దేనికెంత సమయం?

నోటీసుల జారీ నుంచి అభ్యంతరాల వరకు **90 రోజులు**

రీ-సర్వే డేటా పరిశీలన గ్రామ సభ నిర్వహణకు **12 రోజులు**

గ్రామసభలో చర్చించి ఆమోదించేందుకు **15 రోజులు**

ఒక్క క్లిక్‌తో 'కిసాన్ డ్రోన్' సేవలు

క్యాబ్ తరహాలో బుక్ చేసుకునే విధానం

రైతులకు అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం

12

ప్లే స్టోర్‌లో 'ఉబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్' యాప్

2019 ఎన్నికలకు ముందు 2.3 లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన జగన్.. అధికారం చేపట్టాక మడమ తిప్పారు. ప్రతి సంవత్సరం జనవరి 1న జాబ్ క్యాలెండర్ ఇస్తామని హామీ ఇచ్చి.. ఐదేళ్లలో ఒకే ఒక్కసారి జాబ్ క్యాలెండర్ ప్రకటించారు. అయితే, ఆ ఒక్కటి కూడా అమలుకాలేదు. దీంతో ప్రస్తుత ప్రభుత్వం పైనే నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. జాబ్ క్యాలెండర్ కోసం ఎదురుచూస్తున్నారు.

జాబ్ క్యాలెండర్ ఎప్పుడు?



జనవరిలో ఇస్తామన్న ప్రభుత్వం

మరో 12 రోజుల్లో నెల ముగింపు

లక్షలాది మంది నిరుద్యోగుల ఆశలు

మెగా డీఎస్సీతో టీచర్ పోస్టుల భర్తీ

ఇప్పుడు మళ్లీ డీఎస్సీ జారీకి సిద్ధం

వైసీపీ హయాంలో పట్టించుకోని జగన్

జాబ్ క్యాలెండర్ హామీపైనా, డీఎస్సీపైనా మడమ తిప్పేసిన వైసీపీ నేత

ప్రస్తుత సర్కారుపైనే నిరుద్యోగుల ఆశలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జాబ్ క్యాలెండర్ కోసం రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చినప్పటి నుంచీ జాబ్ క్యాలెండర్ ఇవ్వాలని నిరుద్యోగులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో జనవరిలో జాబ్ క్యాలెండర్ ఇస్తామని ఇటీవల మంత్రి లోకేశ్ ప్రకటించారు. దీంతో నిరుద్యోగుల్లో ఉత్సాహం కలిగింది. అయితే, ఈ నెల ముగియడానికి మరో 12 రోజులే ఉండటంతో ఈ నెలలో క్యాలెండర్ విడుదల చేస్తారా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, జాబ్ క్యాలెండర్ కోసం ఎక్స్, ఇతర సామాజిక మాధ్యమాల వేదికగా నిరుద్యోగుల నుంచి డిమాండ్లు పెరుగుతున్నాయి.

ఎదురుచూపులు ఇప్పటివి కావు

గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు సక్రమంగా జారీ చేసి ఉంటే ప్రస్తుత ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగేది కాదు. 2019 ఎన్నికలకు ముందు 2.3 లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన జగన్.. అధికారం చేపట్టాక

మిగతా 12వ పేజీలో...



'మహా జంగిల్‌రాజ్'ను అంతం చేస్తాం

కేంద్ర పథకాలను అడ్డుకుంటున్న టీఎంసీ సర్కారు

బెంగాల్ పిల్లల భవిష్యత్తునూ నాశనం చేస్తోంది

ఓటు బ్యాంకు కోసం అక్రమ వలసదారులకు మద్దతు

ఇలాంటి వారందరినీ రాష్ట్రం నుంచి తరిమికొడతాం

బెంగాల్ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు: ప్రధాని

రూ. 830 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం

ఐదు అమృత్ భారత్ రైళ్లకు జెండా ఊపిన మోదీ

2

అమ్ముడుపోయిన కోటరీల మధ్య బందీలు!



భవిష్యత్తులో మీ గతేంటో ఇప్పటికైనా గుర్తించండి


'ఎక్స్'లో చేసిన పోస్టులో విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు

వెనెజువెలా అంశాన్ని ముడిపెడుతూ హెచ్చరికలు

ఆ బందీ జగనేనా?.. రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ

12

పట్టు రైతుకు ప్రోత్సాహం



వరంగా మారిన సిల్క్ సమగ్ర పథకం

సాంకేతికత, నాణ్యత, ఉత్పాదకత పెంపు

పెండింగ్‌లో ఉన్న రూ. 14 కోట్లు విడుదల

ఏడాదిలోనే పట్టుగూళ్ల ధరలు రెట్టింపు

తాజాగా క్లస్టర్ విధానం అమలుకు నిర్ణయం

కావాల్సినంత పట్టు ఉత్పత్తే లక్ష్యం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో ప్రోత్సాహం కరువైన పట్టు పరిశ్రమకు కూటమి ప్రభుత్వం ఊతమిస్తోంది. పట్టు రైతులకు కేంద్ర ప్రాయోజిత పథకం 'సిల్క్ సమగ్ర' ద్వారా లబ్ధి చేకూరుస్తోంది. కొత్తగా క్లస్టర్ విధానాన్ని అమలు చేయాలని ప్రతిపాదించింది. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఏడాదిలోనే పట్టుగూళ్ల(కొకూన్) ధరలు రెట్టింపు అయ్యాయి. 'సిల్క్ సమగ్ర' పట్టు పురుగుల పెంపకం

మిగతా 3వ పేజీలో...


ప్రయాగ్‌రాజ్‌లో గంగానదీ తీరంలో భక్త జన కోలాహలం



మౌనీ అమావాస్య సందర్భంగా గంగానదిలో 3 కోట్ల మందికి పైగా స్నానాలు

2

కండలున్నా.. సత్తువ సున్నా



60 ఏళ్లు దాటినవారిలో సగం మందికి 'డైనపీనియా' సమస్య

చూడ్డానికి బాగానే ఉంటారు.. అడుగు తీసి అడుగు వేయలేరు

శారీరక శ్రమ లేమి, పోషకాహార లోపమే ప్రధాన కారణాలు

మహిళల్లో అధికం.. నడక, శారీరక శ్రమతోనే పరిష్కారం

మైసూర్ జేఎస్ఎస్ మెడికల్ కాలేజీ అధ్యయనంలో వెల్లడి

12



మౌనీ అమావాస్య సందర్భంగా గంగానదిలో 3 కోట్ల మందికి పైగా స్నానాలు

ప్రయాగ్‌రాజ్, జనవరి 18: మౌనీ అమావాస్య సందర్భంగా యూపీలోని ప్రయాగ్‌రాజ్ వద్ద గంగా నదిలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల వరకూ 3.15 కోట్ల మందికి పైగా పుణ్యస్నానాలు చేశారు. దట్టమైన పొగ మంచు కురుస్తున్నా శనివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారు జాము వరకూ భక్తులు గంగా, సంఘం ఘాట్లకు రావడం మొదలైంది. యూపీ సీఎం యోగి ఆదేశాల మేరకు హెలీకాప్టర్ ద్వారా పూలరేకులు చల్లారు. భక్తుల సౌకర్యార్థం 25వేల టాయిలెట్లను ఏర్పాటు చేశారు.

క్లయింట్ల కోసం లాయర్లు స.హ.చట్టాన్ని వాడొద్దు

న్యూఢిల్లీ, జనవరి 18: తమ క్లయింట్ల కేసులకు సంబంధించిన వివరాల కోసం న్యాయవాదులు సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోకూడదని కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) స్పష్టం చేసింది. ఇలా చేయడం సమాచార హక్కు చట్టం ఆశయాలకే విరుద్ధమని తెలిపింది. హరియాణాలోని నవోదయ పాఠశాలలకు పళ్లు, కూరగాయల సరఫరాకు సంబంధించిన కాంట్రాక్టును రద్దు చేయడానికి సంబంధించిన సమాచారం ఇవ్వాలంటూ ఓ న్యాయవాది చేసిన వినతిపై స్పష్టత ఇచ్చింది.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..8 మంది జవాన్లకు గాయాలు

శ్రీనగర్, జనవరి 18: జమ్మూకశ్మీర్ కిశ్త్‌వాడ్ జిల్లా సొన్నార్ ప్రాంతంలో ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో 8 మంది జవాన్లు గాయపడ్డారు. జైష్ ఎ మహ్మద్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు నక్కిఉన్నారనే సమాచారం అందుకున్న సైనికులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి సంయుక్త ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. మరోవైపు, పంజాబ్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు పాకిస్థాన్ పన్నిన కుట్రను భద్రతా దళాలు భగ్నం చేశాయి.

గాజా శాంతి బోర్డులో చేరండి

▸▸ భారత్‌కు ట్రంప్ ఆహ్వానం



న్యూఢిల్లీ, జనవరి 18: ఇజ్రాయెల్ దాడులతో అతలాకుతలమైన గాజాలో శాంతి స్థాపన, పరిపాలన, పునర్నిర్మాణాన్ని పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన అంతర్జాతీయ శాంతి బోర్డులో చేరాలని భారత్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆహ్వానించారు. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ కోసం ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల సమగ్ర ప్రణాళికలో ఈ శాంతి బోర్డు కూడా ఒక భాగం. ఈ ప్రణాళికకు ఇజ్రాయెల్, హమాస్ గతంలోనే పలు షరతులతో ఆమోదం తెలిపాయి. కాల్పుల విరమణను ప్రకటించాయి. గాజా శాంతి బోర్డులో చేరాలంటూ పలు దేశాలు, సంస్థలు, ప్రముఖులను అమెరికా ఆహ్వానించింది. ట్రంప్ అధ్యక్షుడిగా ఉండే ఈ బోర్డులో చేరిన, నియమించిన కొందరు సభ్యుల పేర్లను ఇటీవలే ప్రకటించింది. ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు, భారత సంతతికి చెందిన అజయ్ బంగా, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ట్రంప్ అల్లుడు కుష్నర్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ తదితరులు ఈ బోర్డులో ఉన్నారు. శాంతిబోర్డులో చేరాల్సిందిగా అమెరికా ఆహ్వానించిన దేశాల్లో భారత్‌తోపాటు పాకిస్థాన్, బ్రెజిల్, కెనడా, అర్జెంటీనా, కెనడా, ఇటలీ, ఈజిప్ట్, టర్కీ, అల్బేనియా, సైప్రస్, హంగరీ, జోర్డాన్, రొమేనియా తదితర దేశాలు ఉన్నాయి. మరోవైపు గాజా స్థానిక పరిపాలనను, పౌర సంస్థలను పర్యవేక్షించే నేషనల్ కమిటీకి పాలస్తీనా నిపుణుడు డాక్టర్ అలీషాత్‌ను చైర్మన్‌గా నియమించారు. గాజాకు సంబంధించి విదేశీ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన గాజా ఎగ్జిక్యూటివ్ బోర్డులో ఐక్యరాజ్యసమితి, బల్గేరియా, టర్కీ, ఖతార్, ఈజిప్ట్, యూఏఈ, ఇజ్రాయెల్ దౌత్యవేత్తలు, ప్రముఖులను నియమించారు.

లక్కీడ్రా పేరుతో టీటీడీ ఆలయం ఎదుట ప్రచారాలు

▸▸ ఇద్దరు యువకులపై కేసు నమోదు

పంజాగుట్ట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): లక్కీడ్రా ప్రమోషన్ కోసం ఇద్దరు యువకులు ఏకంగా హైదరాబాద్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆలయాన్ని ఎంచుకున్నారు. రూ.399 చెల్లిస్తే లక్కీడ్రా తీసి హ్యుందాయ్ ఐ20 కారు, ఐఫోన్, టీవీ, బైక్ ఇస్తామంటూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. ఈ మేరకు శ్రీఆదిభట్ల శ్రీకళాపీఠం వ్యవస్థాపకురాలు పడాల కల్యాణి అలియాస్ కరాటే కల్యాణి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రవీణ్ క్యాస, సిద్ధమోని నరేందర్ అనే యువకులకు ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షకు పైగా ఫాలోవర్లు ఉండడంతో వారు ఎటువంటి అనుమతులు లేకుండా తమ ఖాతాల్లో ప్రచారాలు నిర్వహిస్తున్నారు. వారు చెప్పిన ఖాతాలకు, ఫోన్ నంబర్లకు రూ. 399 పంపిస్తే లక్కీడ్రా తీస్తామని, అందులో గెలిచిన వారికి ఖరీదైన బహుమతులు ఇస్తామని ప్రచారం చేస్తున్నారు. తమపై నమ్మకం కలగడానికి తిరుమల శ్రీవారి ఆలయం ముందు ప్రమోషన్ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు. ఆలయం వద్ద ఉన్నామని, అబద్ధాలు ఆడబోమని చెబుతుండడంతో, వారి మాటలు నమ్మిన పలువురు భక్తులు ఆ మొత్తాన్ని వారి ఖాతాలకు బదిలీ చేశారు. వారు లక్కీడ్రా పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని, అసత్య ప్రచారాలు నిర్వహిస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని కరాటే కల్యాణి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

ఇరాన్ ఆందోళనల్లో 5వేల మంది మృతి

టెహ్రాన్, జనవరి 18: ఇరాన్‌లో ఆందోళనలు, ప్రభుత్వ పాశవిక అణచివేతలో కనీసం 5వేల మంది మరణించారని, వారిలో 500 మంది వరకు భద్రతా సిబ్బంది ఉన్నారని ఆదివారం అధికారవర్గాలు తెలిపాయి. మరణాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నాయి. మరోవైపు, ఆందోళనలో పాల్గొన్న కొందరికి సామూహిక మరణశిక్షలు అమలు చేస్తామని ఆదివారం ఇరాన్ న్యాయ వ్యవస్థ తెలిపింది. వాస్తవానికి సామూహిక ఉరిశిక్షలు నిలిపివేసినందునే ఇరాన్‌పై దాడిని వాయిదా వేసినట్లు ట్రంప్ శనివారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో, సామూహిక ఉరిశిక్షలు విధిస్తామన్న ఇరాన్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకొంది. ఇదిలా ఉండగా, ఇరాన్‌లో ఆందోళనకారుల ఆగ్రహం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌వైపు మళ్లింది. ట్రంప్ ప్రారంభంలో ఆందోళనలను ప్రోత్సహించి, ఇప్పుడు తమను మోసగించారని వారు మండిపడుతున్నారు. విదేశీ హామీలను నమ్మినందుకు మూల్యం చెల్లించాల్సి వచ్చిందని వాపోతున్నారు.

కొనసాగనున్న సామూహిక ఉరిశిక్షలు

ఆందోళనలో పాల్గొన్న కొందరికి సామూహిక మరణశిక్షలు అమలు చేస్తామని ఆదివారం న్యాయ వ్యవస్థ తెలిపింది. ఇరాన్ సామూహిక మరణశిక్షలను నిలిపివేసిందని, ఇందుకు ఆ దేశ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని శుక్రవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో ప్రకటించగా అందుకు విరుద్ధంగా జరగనుంది. న్యాయ వ్యవస్థ అధికార ప్రతినిధి అస్గర్ జహంగీర్ మాట్లాడుతూ ఇస్లామిక్ చట్టం ప్రకారం ఈ ఆందోళనను 'దేవునిపై యుద్ధం'(మొహరెబ్)గా తెలిపారు.

'గ్రీన్‌లాండ్ సుంకాల'పై ఈయూ ఫైర్!



ట్రంప్ ప్రతిపాదనకు వ్యతిరేకంగా డెన్మార్క్‌లో ప్రజల నిరసన ప్రదర్శన

అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం నిలిపివేతకు ఈయూ పార్లమెంటు నిర్ణయం

▸▸ ప్రతినిధుల అత్యవసర భేటీ

▸▸ గ్రీన్‌లాండ్‌పై తమ వైఖరి మారదంటూ ఏడు దేశాల సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 18: ట్రంప్ 'గ్రీన్‌లాండ్ టారిఫ్'పై యూరోపియన్ యూనియన్(ఈయూ) మండిపడింది. ట్రంప్ ఏకపక్ష నిర్ణయం యూరోపియన్ దేశాల ప్రయోజనాలకు భంగకరమని పేర్కొంది. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టు యూరోపియన్ పార్లమెంటు ప్రకటించింది. ఇక ట్రంప్ గ్రీన్‌లాండ్ టారిఫ్‌లు విధించిన 8యూరప్ దేశాలు ఆదివారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. ట్రంప్ బెదిరింపులు విపరీత పరిణామాలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించాయి. గ్రీన్‌లాండ్ విషయంలో తమ వైఖరి మారదని, డెన్మార్క్‌కు అండగా ఉంటామని ప్రకటించాయి. గ్రీన్‌లాండ్‌ను అమెరికా ఆధీనంలోకి తెచ్చుకునే ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్న డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, యూకే, నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, నెదర్లాండ్స్ దేశాలపై 10% అదనపు సుంకాలను ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. జూన్ నుంచి ఈ అదనపు సుంకాలను 25శాతానికి పెంచుతామని.. గ్రీన్‌లాండ్ అమెరికా ఆధీనంలోకి వచ్చే వరకు సుంకాలు కొనసాగిస్తామని కూడా ట్రంప్ పేర్కొన్నారు. ఈ క్రమంలో అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టు యూరోపియన్ పార్లమెంటు ప్రకటించింది. నిజానికి గత ఏడాది జూలైలోనే ఈ వాణిజ్య ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం.. అమెరికా తమ దేశానికి దిగుమతి అయ్యే యూరోపియన్ వస్తువులపై 15శాతం సుంకాలు వసూలు చేస్తుంది. ఈయూ దేశాలు అమెరికా ఉత్పత్తులపై ఎలాంటి సుంకాలు(జీరో టారిఫ్) విధించవు. దీనిని యూరోపియన్ పార్లమెంటు ఆమోదించాల్సి ఉంది. వచ్చే వారంలోనే అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి ఆమోదం తెలపాల్సి ఉందని.. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో దానిని నిలిపివేసినట్టేనని స్వీడన్‌కు చెందిన ఈయూ పార్లమెంటు సభ్యురాలు కరిన్ కార్ల్స్‌బ్రో తెలిపారు. ప్రస్తుతం ట్రంప్ ప్రకటించిన గ్రీన్‌లాండ్ టారిఫ్‌తో ఈయూ దేశాలపై సుంకాలు ఫిబ్రవరి 1 నుంచి 25శాతానికి, జూన్ తర్వాత 40శాతానికి పెరుగుతాయి. ఇదిలా ఉండగా, ట్రంప్ ఆరోపించినట్టుగా గ్రీన్‌లాండ్‌కు తమ బలగాలను పంపినది అమెరికాను రెచ్చగొట్టేందుకు కాదని.. గ్రీన్‌లాండ్‌పై రష్యా, చైనా కన్నేశాయన్న ట్రంప్ హెచ్చరికలను అనుగుణంగానే పంపామని డెన్మార్క్ విదేశాంగ మంత్రి లార్స్ రాస్ముస్సేన్ వెల్లడించారు. ట్రంప్ గ్రీన్‌లాండ్ టారిఫ్ యూరోపియన్ దేశాల ప్రయోజనాలకు భంగకరమని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా పేర్కొన్నారు.

విపరీత పరిణామాలు!

గ్రీన్‌లాండ్ కోసం ట్రంప్ తెస్తున్న ఒత్తిడి, బెదిరింపులు విపరీత పరిణామాలకు దారితీసే ప్రమాదం ఉందని యూకే, డెన్మార్క్, ఫిన్లాండ్, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, నార్వే, స్వీడన్ ఆదివారం సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. "డెన్మార్క్, గ్రీన్‌లాండ్ ప్రజల తరఫున నిలబడతాం. ఈ విషయంలో మా వైఖరిలో మార్పులేదు. వారం రోజులుగా జరుగుతున్న పరిణామాలపై చర్చలకు సిద్ధంగా ఉన్నాం. నాటో సభ్యులుగా ట్రాన్స్ అట్లాంటిక్, ఆర్కిటిక్ ప్రాంతంలో భద్రతను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నాం" అని పేర్కొన్నాయి. కాగా, ట్రంప్ టారిఫ్‌లు విధించిన దేశాల్లో ఒకటైన జర్మనీ ఈ ప్రకటనలో భాగం కాలేదు. అంతేకాదు గ్రీన్‌లాండ్‌కు పంపిన తమ 15 మంది సైనిక బృందాన్ని కూడా వెనక్కి పిలిచింది.

చైనా, రష్యా నవ్వుకుంటున్నాయి!

నాటో దేశాలపై ట్రంప్ టారిఫ్‌లను చూసి చైనా, రష్యా నవ్వుకుంటున్నాయని.. నాటో మిత్ర దేశాల మధ్య విభేదాలతో లాభపడేది ఆ దేశాలేనని ఈయూ విదేశాంగ విభాగం చీఫ్ కాజా కల్లాస్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. "ఒకవేళ గ్రీన్‌లాండ్ భద్రతకు ఏదైనా ప్రమాదం ఉంటే.. దాన్ని నాటోలో అంతర్గతంగానే చర్చించుకుని, పరిష్కరించుకోవాలి. టారిఫ్‌లు అటు యూరప్‌కు, ఇటు అమెరికాకూ నష్టకరమే" అని ఆమె స్పష్టం చేశారు. అయితే ఆమె అన్నట్టుగానే.. యూరప్ దేశాలను, గ్రీన్‌లాండ్ టారిఫ్‌లను ఎగతాళి చేస్తూ రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రత్యేక రాయబారి కిరిల్ డిమిత్రివ్.. 'మీ నాన్నను రెచ్చగొట్టకండి' అని ట్రంప్, ఈయూ నేతలను ఉద్దేశిస్తూ పోస్టు పెట్టారు. ఎనిమిది దేశాల నుంచి పది, పదిహేను మంది చొప్పున సైనికులను గ్రీన్‌ల్యాండ్‌కు పంపడం, దానిపై ట్రంప్ మండిపడి టారిఫ్‌లు విధించడాన్ని ప్రస్తావిస్తూ.. 'ఒక్కో సైనికుడికి ఒక శాతం టారిఫ్ అన్నమాట' అని ఎద్దేవా చేశారు.


నాన్నా.. నాకు చావాలని లేదు.. వచ్చి కాపాడు!

▸▸ నీళ్లలో మునిగిపోతున్నాను.. ఎవరైనా రక్షించండి

▸▸ 70అడుగుల గోతిలో పడ్డ ఓ యువకుడి ఆర్తనాదాలు

▸▸ పొగమంచు వల్ల నీళ్లున్న గోతిలోకి దూసుకెళ్లిన కారు

▸▸ నోయిడాలో ప్రమాదం..యువకుడి అరుపులు వినిపిస్తున్నా పొగమంచులో కారును కనిపెట్టలేకపోయిన పోలీసులు



నోయిడా, జనవరి 18: ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో 70 అడుగుల లోతున్న ఓ భారీ గోతిలో పడి యువరాజ్ మెహతా(27) అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చనిపోయాడు. గురుగ్రామ్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో డాటా అనలిస్టుగా పనిచేస్తున్న యువరాజ్ శుక్రవారం రాత్రి ఆఫీసు నుంచి ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దట్టమైన పొగమంచు కారణంగా ఏమీ కనిపించక ఆయన కారు రోడ్డు పక్కన ఉన్న గోతిలోకి దూసుకెళ్లింది. అది పూర్తిగా నీళ్లతో నిండి ఉండటంతో మునిగిపోయింది. కారుతో సహా నీళ్లలో పడ్డ యువరాజ్ బయటకు రాలేక సాయం కోసం ఎంతగానో అరిచాడు. వెంటనే తండ్రికి, స్నేహితుడికి ఫోన్ చేశాడు. "నేను మునిగిపోతున్నాను. నాకు చావాలని లేదు. కాపాడండి" అని వేడుకున్నాడు. తండ్రి, పోలీసులు నిమిషాల వ్యవధిలోనే ప్రమాద స్థలానికి చేరుకున్నారు. అయితే, యువరాజ్ అరుపులు వినిపిస్తున్నప్పటికీ చీకటి అందునా పొగమంచు వల్ల ఏమీ కనిపించకపోవడంతో వారు ఆ నీళ్లలో కారు ఎక్కడ ఉందన్నది గుర్తించలేకపోయారు. యువరాజ్‌తో సహా కారు పూర్తిగా మునిగిపోయింది. ఐదు గంటల తర్వాత కారును గుర్తించి వెలికితీశారు. యువరాజ్ మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆరోపించారు. గుంత ఉన్న దగ్గర రోడ్డుపై రిఫ్లెక్టర్లు, సైన్ బోర్డులు పెట్టాలని ఎన్నోసార్లు కోరినప్పటికీ అధికారులు స్పందించలేదన్నారు. కాగా, అధికారులు కారును వెలికితీసిన తర్వాత ఆ గోతిని భవన వ్యర్థాలు, రాళ్లతో పూడ్చేశారు.

లోకం తీరు



భారత్‌లో ఏఐ కోసం..అమెరికన్లు ఎందుకు డబ్బు కట్టాలి?

▸▸ మరోసారి విషం కక్కిన పీటర్ నవారో

వాషింగ్టన్, జనవరి 18: భారత్‌పై తరుచూ విషం చిమ్మే అమెరికా అధ్యక్షుడి వాణిజ్య సలహాదారు పీటర్ నవారో.. మరోసారి అలాంటి వ్యాఖ్యలే చేశారు. చాట్ జీపీటీ వంటి ఏఐ ప్లాట్‌ఫామ్‌లను అమెరికన్ల డబ్బు, వనరులతో అభివృద్ధి చేస్తుండగా.. అవి భారత్, చైనా వంటి దేశాలకు సేవలందిస్తున్నాయన్నారు. "భారత్‌లో ఏఐ సేవల కోసం అమెరికన్లు ఎందుకు డబ్బు చెల్లించాలి" అని ప్రశ్నించారు. వైట్ హౌస్ మాజీ ప్రధాన వ్యూహకర్త స్టీవ్‌బానన్‌తో కలిసి 'రియల్ అమెరికా వాయిస్' అనే కార్యక్రమంలో నవారో మాట్లాడారు. "చాట్ జీపీటీ అమెరికా గడ్డపై నుంచి నడుస్తోంది. అమెరికా విద్యుత్‌ను వాడుకుంటోంది. కానీ భారత్, చైనా సహా అనేక దేశాలకు సేవ చేస్తోంది" అని అన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందూ వ్యాపారి హత్య

ఢాకా, జనవరి 18: అరటి గెలలు చోరీ చేశారనే అనుమానంతో బంగ్లాదేశ్‌లో ఓ హిందూ వ్యాపారిని హత్య చేశారు. ఆ దేశంలోని గాజీపూర్ జిల్లాలో శనివారం ఈ ఘటన చోటు చేసుకున్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. కాళీగంజ్‌లో హోటల్ యజమాని అయిన లిటన్ చంద్ర ఘోష్(55)పై స్వపన్ మియా(55), అతని భార్య మజేదా ఖాతూన్(45), వారి కుమారుడు మాసుమ్ మియా(28) దాడి చేసి కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మాసుమ్‌కున్న అరటి తోటలోని కొన్ని అరటి గెలలు కనిపించకుండా పోయాయి. వాటిని లిటన్ హోటల్‌లో గుర్తించిన అతడు హోటల్ సిబ్బందితో వాదనకు దిగాడు. అనంతరం తన తండ్రి, తల్లితో పాటు వచ్చి లిటన్‌పై దాడి చేసి కొట్టడంతో అతడు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బంగ్లా పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఎవరినీ బాధపెట్టాలని అనుకోలేదు

▸▸ భారత్ నాకు స్ఫూర్తి.. నా గురువు.. నా ఇల్లు

▸▸ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ వివరణ



న్యూఢిల్లీ, జనవరి 18: ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడంతో.. ఆయన వివరణ ఇచ్చుకున్నారు. తాను ఎవరినీ బాధపెట్టాలని అనుకోలేదని, కొన్ని సందర్భాల్లో ఒకరి ఉద్దేశాలను ఇతరులు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉందని తెలుసుకున్నానని అన్నారు. భారత్ తనకు స్ఫూర్తి, ఇల్లు అని, భారతీయుడిగా ఉండడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ మేరకు రెహమాన్ ఆదివారం ఒక వీడియో విడుదల చేశారు. దానికి తాను కంపోజ్ చేసిన 'మా తుఝే సలాం.. వందేమాతరం' గీతాల క్లిప్స్‌ను జతపరిచారు. ఈ వీడియోలో, "సంగీతం అనేది ఎల్లప్పుడూ మన సంస్కృతిని అనుసంధానించేందుకు, వేడుక చేసుకునేందుకు, గౌరవించేందుకు ఒక మార్గంగా ఉంటుందని నేను విశ్వసిస్తాను. భారత్ నాకు స్ఫూర్తి, నా గురువు, నా ఇల్లు. భారతీయుడిగా ఉండడం అదృష్టంగా భావిస్తాను. నా భావాలను స్వేచ్ఛగా ప్రకటించే, భిన్నస్వరాలతో పనిచేసే అవకాశాన్ని ఈ దేశం నాకు కల్పించింది. ఒక్కోసారి మన ఉద్దేశాలను ఇతరులు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని తెలుసుకున్నాను. కానీ, ఎప్పటికీ సంగీతం ద్వారా ఉత్తేజపరచడం, గౌరవించడం, సేవ చేయడమే నా లక్ష్యం. నా నిజాయితీని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను" అని రెహమాన్ అన్నారు.

మహా జంగిల్‌రాజ్‌ను అంతం చేస్తాం

కేంద్ర పథకాలను టీఎంసీ సర్కారు అడ్డుకుంటోంది

▸▸ ఓట్ల కోసం అక్రమ వలసదారులకు మద్దతు

▸▸ బెంగాల్ ర్యాలీలో మోదీ



సింగూరు/కలియాబోర్, జనవరి 18: తృణమూల్ కాంగ్రెస్ పాలనలోని 'మహా జంగిల్ రాజ్'కు వీడ్కోలు పలకడానికి పశ్చిమ బెంగాల్ సిద్ధంగా ఉందని ప్రధాని మోదీ అన్నారు. ఎన్డీయే బిహార్‌లో 'జంగిల్ రాజ్'ను అంతం చేసిందని గుర్తుచేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా సింగూర్‌లో, అస్సాం రాష్ట్రం కలియాబోర్‌లో ఆదివారం నిర్వహించిన ర్యాలీల్లో మోదీ ప్రసంగించారు. "ఇండియా గేట్ ముందు సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ప్రతిష్ఠించింది బీజేపీ ప్రభుత్వమే. మొదటిసారిగా ఆజాద్ హింద్ ఫౌజ్ సేవలకు ఎర్రకోట వద్ద గౌరవం లభించింది. అండమాన్ నికోబార్ దీవుల్లోని ఒక ద్వీపానికి నేతాజీ పేరు పెట్టాం. మీరు ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నప్పుడే బెంగాలీ భాషకు శాస్త్రీయ హోదా దక్కింది. బీజేపీ ప్రభుత్వం చేసిన ప్రయత్నాల వల్లే దుర్గా పూజకు యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా లభించింది. ఒక్క మోదీకి మాత్రమే బెంగాల్‌పై ఇంత ప్రేమ ఉంది' అని ఆయన పేర్కొన్నారు. బెంగాల్‌కు చెందిన రాజారామ్మోహన్ రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, స్వామి వివేకానంద వంటి మహనీయులను జాతీయ స్థాయిలో గౌరవించింది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కేంద్ర పథకాలను బెంగాల్ ప్రజలకు అందకుండా టీఎంసీ ప్రభుత్వం అడ్డుకుంటోందని మోదీ ఆరోపించారు. బెంగాల్ పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని తొలగించాలో, వద్దో చెప్పాలని ప్రజలను మోదీ కోరారు. రాజకీయ ప్రయోజనాలు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం టీఎంసీ ప్రభుత్వం చొరబాటుదారులకు మద్దతు ఇస్తూ దేశ భద్రతను ప్రమాదంలోని నెడుతోందని మోదీ ఆరోపించారు. నకిలీ పత్రాలతో బెంగాల్‌లో నివాసం ఉంటున్న అక్రమ వలసదారులను తరిమికొడతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లో రూ.830 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులతో పాటు ఢిల్లీ, వారాణసీ, చెన్నైలను కోల్‌కతాను అనుసంధానం చేసే మూడు అమృత్ భారత్ రైళ్లను ప్రధాని జెండా ఊపి ప్రారంభించారు. అస్సాంలోని కలియాబోర్‌లో మోదీ ప్రసంగిస్తూ అస్సాంలోకి పెద్దఎత్తున వచ్చిన చొరబాటుదారులకు గత కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడి భూములను అప్పగించిందని మండిపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వారికి దశాబ్దాల తరబడి రాష్ట్రంలో ఆశ్రయం ఇచ్చిందని ఆరోపించారు. 'చొరబాటుదారులు జనాభా సమతుల్యతను దెబ్బతీస్తున్నారు. సంస్కృతిపై దాడి చేస్తున్నారు. యువత ఉద్యోగాలను లాక్కుంటున్నారు. ఇది అస్సాంతో పాటు దేశ భద్రతకు తీవ్రముప్పుగా పరిణమించింది' అని మోదీ పేర్కొన్నారు. చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా బీజేపీ ప్రభుత్వం అస్సాం సంస్కృతిని కాపాడుతోందన్నారు. నాగావ్ జిల్లాలో రూ.6,957 కోట్లతో చేపట్టనున్న కాజీరంగా ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన చేశారు.

పాత తరాలు పక్కకు తప్పుకోవాలి: గడ్కరీ

నాగ్‌పూర్, జనవరి 18: వ్యవస్థలు గాడిలో పడి, పనులు సజావుగా నడవడం ప్రారంభించినప్పుడు పాతతరం వారు పక్కకు తప్పుకోవాలని, కీలక బాధ్యతలు స్వీకరించడానికి తదుపరి తరం వారు సిద్ధంగా కావాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం నాగ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. "కాలానుగుణంగా తరాలు కూడా మారాలని నేను నమ్ముతాను. ఇప్పుడు మనం క్రమంగా పదవీ విరమణ చేసి, కొత్తతరం వారు బాధ్యతలు చేపట్టేలా మార్గం సుగమం చేయాలి. పాత వారు పక్కకు తప్పుకుంటేనే, కొత్తవారికి నేర్చుకునే అవకాశం దక్కుతుంది" అని గడ్కరీ అభిప్రాయపడ్డారు.

అధిక వడ్డీ ఆశచూపి.. నగదు కాజేసి

▸▸ సైబర్ కేటుగాళ్ల వలలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

▸▸ కోటి రూపాయలకు పైగా మోసపోయిన వైనం

శ్రీకాకుళం క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): టెక్నాలజీపై పట్టు, షేర్ మార్కెట్ ట్రేడింగ్‌పై అవగాహన ఉన్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. అధిక వడ్డీ ఆశచూపి నకిలీ యాప్ ద్వారా కోటి రూపాయలకు పైగా కాజేశారు. ఈ భారీ సైబర్ మోసం శ్రీకాకుళం నగరంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం నగరంలోని కర్రా వీధికి చెందిన సిల్లా శ్రీనివాసరావు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సంస్థలో మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం ఆయన 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. శ్రీనివాసరావుకు షేర్ మార్కెట్, ట్రేడింగ్‌పై మంచి అవగాహన ఉంది. ఇటీవల ఆయన యూట్యూబ్ చూస్తుండగా 'క్యాప్సటాయిన్' పేరిట వచ్చిన ఒక ప్రకటన ఆకర్షించింది. ఆ లింక్ ఓపెన్ చేయగా.. 'క్యూఐబీ' అనే యాప్‌కు మళ్లించింది. అందులో పెట్టుబడిదారులు, ధనవంతులు ఉంటారని, ఇది అంతర్జాతీయ స్థాయి ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ అని శ్రీనివాసరావు పొరబడ్డాడు. అది నకిలీ యాప్ అని గుర్తించలేకపోయాడు. మొదట ఆ యాప్‌లో రూ.10 వేలు డిపాజిట్ చేశాడు. అయితే.. ఆ మొత్తం సరిపోదని, కనీసం రూ.50 వేలు డిపాజిట్ చేస్తేనే ట్రేడింగ్‌కు అనుమతిస్తామని.. రోజుకు రూ.2వేలు వడ్డీ ఇస్తామని అవతలి వ్యక్తులు నమ్మబలికారు. వారి మాటలు నమ్మిన శ్రీనివాసరావు రూ. 50 వేలు జమ చేశాడు. వారు చెప్పినట్లే రోజుకు రూ. 2 వేల చొప్పున శ్రీనివాసరావు బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయి. దీంతో ఇది నిజమైన యాప్ అని పూర్తిగా నమ్మాడు. ఈ మేరకు గతేడాది డిసెంబరు 22 నుంచి ఈ నెల 13 వరకు విడతల వారీగా శ్రీనివాసరావు భారీగా పెట్టుబడి పెట్టాడు. ఇలా ఏకంగా రూ. 1 కోటి 3 లక్షల 55 వేలను ఆ యాప్‌లో జమ చేశాడు. చివరికి డబ్బులు డ్రా చేసుకుందామంటే కుదురకపోవడంతో తాను మోసపోయానని గ్రహించాడు. వెంటనే బాధితుడు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. పోలీసులు స్పందించి కేవలం రూ.9 లక్షలను మాత్రమే ఫ్రీజ్ చేయగలిగారు. మిగిలిన మొత్తం అప్పటికే సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోకి మళ్లిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూనివర్సిటీల్లో కులవివక్ష తీవ్రం!

▸▸ ఐదేళ్లలో 118 శాతం పెరిగిన ఫిర్యాదులు..యూజీసీ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 18: విశ్వవిద్యాలయాల్లో కుల రక్కసి బుసలు కొడుతోంది. ఐదేళ్ల వ్యవధిలో యూనివర్సిటీలు, కాలేజీల్లో కుల ఆధారిత వివక్ష ఫిర్యాదులు 118.4% పెరిగాయి. ఈ మేరకు యూజీసీ పార్లమెంటరీ ప్యానెల్ సుప్రీంకోర్టుకు సమర్పించిన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2019-20లో నమోదిత ఘటనలు 173 ఉండగా.. ఆ సంఖ్య 2023-24 నాటికి 378కి పెరిగింది. 2019-20, 2023-24 మధ్య 704 విశ్వవిద్యాలయాలు, 1,553 కాలేజీల్లోని ఈక్వల్ ఆపర్చునిటీ సెల్స్ (ఈవోసీ), ఎస్సీ/ఎస్టీ విభాగాల నుంచి యూజీసీకి 1,160 ఫిర్యాదులు అందగా.. వీటిల్లో 1,052 ఫిర్యాదులను (90.68%) పరిష్కరించినట్లు పేర్కొన్నారు. అయితే ఈ మధ్య కాలంలో పెండింగ్ కేసుల సంఖ్య 18 నుంచి 108కి పెరిగాయని యూజీసీ డేటా వెల్లడించింది. ఎస్సీ/ఎస్టీ, ఈవోసీ విభాగాల పనితీరుపై విద్యార్థుల్లో అవగాహన పెరగడమే ఫిర్యాదుల పెరుగుదలకు కారణమని యూజీసీ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. ఈ విభాగాలు కేసులను చురుగ్గా పరిష్కరిస్తున్నాయన్నారు.

సంవత్సరం	ఫిర్యాదులు
2019-20	173
2020-21	182
2021-22	186
2022-23	241
2023-24	378

తమిళనాడు ఆధ్వర్యంలో జాతీయ సాహిత్య పురస్కారాలు

సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వం 'సెమ్మొళి సాహిత్య అవార్డు' (శాస్త్రీయ భాషా సాహిత్య పురస్కారం) పేరుతో ప్రతియేటా జాతీయ స్థాయి అవార్డులను ప్రదానం చేయనుందని ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ ప్రకటించారు. తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, ఒరియా, బెంగాలీ, మరాఠీ భాషలలో వెలువడే అత్యుత్తమమైన రచనలకు ఈ అవార్డులను ఇవ్వనున్నామని తెలిపారు. ఈ జాబితాలో హిందీ లేకపోవడం గమనార్హం. ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను ఖరారు చేసి ప్రకటించనున్న సమయంలో కేంద్ర సాంస్కృతిక శాఖ జోక్యం కారణంగా అవార్డుల ప్రకటన రద్దు చేశారని, ఈ నేపథ్యంలో సాహిత్య అకాడమీ అవార్డులకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతియేటా ఏడు ప్రాంతీయ భాషలకు సంబంధించిన అత్యుత్తమ రచనలకు 'సెమ్మొళి సాహిత్య అవార్డును అందజేస్తామని తెలిపారు.



నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఏపీ జేఏసీ అమరావతి చొరవతోనే ఉద్యోగుల సమస్యల పరిష్కారం

» బొప్పరాజు వెంకటేశ్వర్లు

విజయవాడ (గాంధీనగర్), జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఏపీ జేఏసీ అమరావతి చొరవతోనే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. గుంటూరులోని శ్రీనివాస భవన్‌లో ఆదివారం జరిగిన ఏపీ గవర్నమెంట్ నాల్గవ తరగతి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.మల్లేశ్వరరావు, టి.చెన్నప్ప ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని బొప్పరాజు అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలుచేస్తున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. సంక్రాంతి కానుకగా సుమారు వెయ్యికోట్ల బకాయిలు చెల్లించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండేళ్లకాలం పోగొట్టుకున్న 12వ పీఆర్సీని తక్షణమే ప్రకటించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బెజవాడలో 23, 24న ఏకాత్మ మానవ దర్శన్

» 1965 నాటి చారిత్రక తీర్మానంపై సమీక్ష: మాధవ్

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సమాజంలోని అన్ని వ్యవస్థలు సక్రమంగా నడవాలంటే వ్యక్తి నుంచి వ్యవస్థ వరకూ సమగ్రంగా ఆలోచించి త్రికరణ శుద్ధితో పనిచేయడమే 'ఏకాత్మ మానవ దర్శన్' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. భవిష్యత్తు భారతావనికి ఏమి అవసరమో 1965 జనవరి 23న విజయవాడలో జరిగిన భారతీయ జన్‌సంఘ్ తీర్మానంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ దిశా నిర్దేశం చేశారని గుర్తుచేశారు. ఆదివారం విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జన్‌సంఘ్ తీసుకున్న నిర్ణయాలు దేశంపై ఎలాంటి ప్రభావం చూపాయనే దానిపై ఈ నెల 23, 24న పునఃసమీక్ష చేస్తున్నామని చెప్పారు. 60 ఏళ్ల క్రితం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన సమగ్ర ఆలోచనా విధానం నేటికీ సమాజానికి దిశా నిర్దేశం చేస్తోందని మాధవ్ తెలిపారు. అప్పటి తీర్మానాలను మననం చేసుకోవడంతో పాటు ప్రధానులుగా అటల్ బిహారీ వాజపేయి, నరేంద్ర మోదీ దేశానికి ఏం చేశారో ఎగ్జిబిషన్ ద్వారా వివరించబోతున్నట్లు చెప్పారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు, బీజేపీ జాతీయ స్థాయి నేతలు, ఆర్ఎస్ఎస్ ముఖ్యులు హాజరవుతారని మాధవ్ వెల్లడించారు.

రథసప్తమికి తిరుమలలో విస్తృత ఏర్పాట్లు

25న ఏడు వాహనాలపై దర్శనమివ్వనున్న మలయప్ప

తిరుమల, జనవరి18(ఆంధ్రజ్యోతి): సూర్యజయంతి సందర్భంగా ఈనెల 25వ తేదీన తిరుమలలో రథసప్తమి వేడుకలు జరుగనున్నాయి. ఒకేరోజు ఏడు వాహనాలపై మలయప్పస్వామి దర్శనమివ్వనున్న నేపథ్యంలో ఈ వేడుకను ఒక్కరోజు బ్రహ్మోత్సవంగా కూడా పిలుస్తారు. ఈఏడాది రథసప్తమి ఆదివారం రావడంతో భారీ సంఖ్యలో భక్తులు తిరుమలకు వస్తారనే అంచనాతో టీటీడీ విస్తృతమైన ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా ఆరోజు శ్రీవారి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. అలాగే సుప్రభాతం, తోమాల, అర్చన ఏకాంతంగా నిర్వహించనున్నారు.



వాహనసేవ వివరాలు

- సూర్యప్రభవాహనం: ఉదయం 5.30 నుంచి 8 గంటల వరకు(సూర్యోదయం 6.45 గంటలు)
- చిన్నశేష వాహనం: 9-10గంటలు
- గరుడ వాహనం: 11-12గంటలు
- హనుమంత వాహనం: 1-2గంటలు
- చక్రస్నానం: 2-3గంటలు
- కల్పవృక్ష వాహనం: 4-5గంటలు
- సర్వభూపాల వాహనం: 6-7గంటలు
- చంద్రప్రభ వాహనం: 8-9గంటలు

పుష్కరాలకు 359 స్నాన ఘట్టాలు

రూ. 445.44 కోట్లతో ప్రతిపాదనలు కొత్తగా 125 ఘాట్ల నిర్మాణం

రాజమహేంద్రవరం, జనవరి18(ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కర పనులపై యంత్రాంగం దృష్టి సారించింది. 2027లో జరగనున్న పుష్కరాలకు సంబంధించి మొత్తం 359 స్నానఘట్టాలు సిద్ధం చేయడానికి రూ.445.44 కోట్లతో ఇప్పటికే ఇరిగేషన్ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు ప్రారంభించనున్నారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు జిల్లాల పరిధిలో స్నాన ఘట్టాలు నిర్మించనున్నారు. ఇప్పటికే పాత ఘాట్లు 234 ఉన్నాయి. వాటిలో 69 ఘాట్ల విస్తరణకు నిర్ణయించారు. కొత్తగా రూ.127.46 కోట్లతో 125 స్నాన ఘట్టాలు నిర్మించనున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో కొత్తగా రూ.29.75 కోట్లతో 29 ఘాట్లు, పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.11.58 కోట్లతో 8 ఘాట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రూ.68.63 కోట్లతో 70 ఘాట్లు, కాకినాడ జిల్లాలో రూ.1.8 కోట్లతో 2 ఘాట్లు , ఏలూరు జిల్లాలో రూ.16.41 కోట్లతో 16 ఘాట్లు నిర్మించనున్నారు. కాగా, పాతఘాట్లు మొత్తం 234 ఉండగా వాటి మరమ్మతులకు రూ.176.88 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు.

షాద్‌నగర్ నుంచి తిరుమలకు కాలినడకన బండ్లగణేష్

» చంద్రబాబుపై అభాండాలు తొలగిపోయినందుకు

మొక్కుతీర్చుకోనున్న నిర్మాత



షాద్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై మోపిన అభాండాలు, కుట్రపూరిత కేసులు తొలగిపోతే కాలి నడకన తిరుమలకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటానని మొక్కుకున్న సినీ నిర్మాత బండ్ల గణేష్... తన మొక్కు తీర్చుకునేందుకు సిద్ధమయ్యారు. సోమవారం ఉదయం 9గంటలకు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ శివారులోని జానంపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన తిరుమలకు కాలినడకన బయల్దేరుతారు. చంద్రబాబుపై ఉన్న కేసులన్నింటినీ కూడా అత్యున్నత న్యాయస్థానాలు కొట్టివేయడంతో తన మొక్కును చెల్లించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నానని బండ్ల గణేష్ వివరించారు.

నకిలీ వైద్యులపై కఠిన చర్యలు

» రాష్ట్ర వైద్య మండలి చైర్మన్ శ్రీహరిరావు



తిరుపతి సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య మండలి చైర్మన్ డాక్టర్ దగ్గుబాటి శ్రీహరిరావు హెచ్చరించారు. సొంత వైద్యంతో ప్రజలను మోసం చేసి వ్యాపారం చేయాలంటే ఇక కుదరదన్నారు. తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తనకు రాష్ట్ర స్థాయి పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో అందరి సహకారంతో విజయవాడలో జాతీయ స్థాయి, విశాఖలో అంతర్జాతీయ స్థాయి వైద్యుల సదస్సు నిర్వహించడానికి కార్యాచరణ తయారు చేస్తామన్నారు. వైద్యులు సందేహాలను నివృత్తి చేసుకునేలా దేశంలోనే మొదటి సారిగా వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభించామని తెలిపారు. రానున్న రోజుల్లో వైద్యులు వైద్య మండలి వద్దకు రాకుండా వారి సంతకం, బొటనవేలు ముద్ర, కంటి ఐరిస్ గుర్తించడం ద్వారా వారు నేరుగా అన్ని సౌకర్యాలు ఆన్‌లైన్‌లో పొందే అవకాశాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు.

పట్టు రైతుకు ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు వరంగా మారింది. పట్టు పరిశ్రమల్లో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి, నాణ్యత పెంపుదల, పెట్టుబడి సామర్థ్యాన్ని మెరుగుపర్చడం, ఉత్పాదకతను పెంచడం ఈ పథకం ఉద్దేశం. ముఖ్యంగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న రైతులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో కేంద్ర పట్టు పరిశ్రమ బోర్డు సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద కిసాన్ నర్సరీల పెంపకం, మల్బరీ తోటల పెంపకం, పట్టు పురుగుల పెంపకం షెడ్ల నిర్మాణం, పెంపకం పరికరాల సరఫరా, నాణ్యమైన క్రిమి సంహారక మందులు, రీలింగ్, ట్విస్టింగ్ యూనిట్ల స్థాపనకు కేంద్ర పట్టు పరిశ్రమ బోర్డు సహాయం చేస్తోంది. రాష్ట్ర అభివృద్ధి పథకం కింద క్రిమి సంహారక మందులు, యాంత్రీకరణ, బైవోల్టిన్ కొకూన్‌లు, టస్సర్ కొకూన్‌ల ఉత్పత్తి, ముడి పట్టు ఉత్పత్తి, టస్సర్ విత్తనాల సేకరణ, గిరిజన రైతులకు వేతనాలకు ప్రభుత్వం సాయం చేస్తోంది. ఈ పథకం కింద చేసే సహాయంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు కేంద్రం 65%, రాష్ట్ర ప్రభుత్వం 25% ఇస్తే.. లబ్ధిదారులు 10% భరించాల్సి ఉంటుంది. ఇతర వర్గాల రైతులకు కేంద్రం 50%, రాష్ట్ర ప్రభుత్వం 25% ఇస్తే.. లబ్ధిదారులు 25% భరించాల్సి ఉంటుంది. ఈ పథకంలో గతంలో పెండింగ్‌లో ఉన్న రూ.14 కోట్లను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. అలాగే పిచికారి మందులకు రూ.2కోట్లు, యాంత్రీకరణకు రూ.4 కోట్లు విడుదల చేసింది. పట్టు నేత్రికలకు కూడా నిధులను విడుదల చేసింది.



రాష్ట్రంలో పట్టు పరిశ్రమ వివరాలు..

మల్బరీ తోటల విస్తీర్ణం	1,52,000 ఎకరాలు
పట్టు రైతుల సంఖ్య	81,495 మంది
వార్షిక కొకూన్ ఉత్పత్తి	78,000 టన్నులు
వార్షిక ముడి పట్టు ఉత్పత్తి	11,000 టన్నులు
ఉపాధి పొందుతున్న వారు	8,28,000 మంది
స్థూల విలువ జోడింపు	రూ.3,373.36 కోట్లు

పట్టు క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు

రాష్ట్రంలో పట్టు పరిశ్రమ అభివృద్ధి కోసం కొత్తగా క్లస్టర్ విధానాన్ని అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. పట్టు పురుగుల పెంపకం ఎక్కువగా ఉన్న రాయలసీమలోని కుప్పం, పలమనేరు, మదనపల్లె, మడకశిర, హిందూపురం, ధర్మవరం, కోస్తాలోని చేబ్రోలు, అరకులో పట్టు క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు పట్టు పరిశ్రమశాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. చేనేత పరిశ్రమకు అవసరమైన పట్టు దారాన్ని రాష్ట్రంలోనే ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో పట్టు పరిశ్రమను క్రియాశీలం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటి వరకు కర్ణాటక నుంచి లేదా రాష్ట్రంలోని ప్రొద్దుటూరు, చేబ్రోలులోని నేషనల్ హ్యాండ్‌ల్యూమ్స్ సెంటర్ల నుంచి పట్టు దారాన్ని చేనేత పరిశ్రమదారులు తీసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సిల్క్ సమగ్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం, పట్టు రైతుల్ని ప్రోత్సహించడం వల్ల రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే పట్టు గూళ్ల (కొకూన్)ల ధర బాగా పెరిగింది. కొవిడ్ సమయంలో కిలో రూ.200-250 ఉండగా, గతేడాది నుంచి రూ.750-800 వరకు చేరింది. సగటు ధర రూ.700 పలుకుతోంది. ప్రతి రెండు నెలలకు ఐదు సార్లు కొకూన్ తీయడం వల్ల పట్టు రైతులకు నికర ఆదాయం వస్తోంది.

ఆర్టీఐ చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు

» కమిషనర్లుగా మరో నలుగురి నియామకం



అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్‌కు కూటమి ప్రభుత్వం కీలక నియామకాలు చేపట్టింది. రాష్ట్ర ఆర్టీఐ చీఫ్ కమిషనర్‌గా న్యాయవాది వజ్జా శ్రీనివాసరావును నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిషనర్లుగా పరవాడ సింహాచలం నాయుడు (విశాఖపట్నం), వొంటేరు రవిబాబు (కడప), గాజుల ఆదెన్న (అనంతపురం), వీఎస్కే చక్రవర్తి (మంగళగిరి)ని సమాచార హక్కు చట్టం- 2005 ప్రకారం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి మూడేళ్ల పాటు లేదా 65 ఏళ్లు నిండే వరకూ వీరు పదవిలో కొనసాగుతారు. చీఫ్ కమిషనర్‌గా నియమితులైన వజ్జా శ్రీనివాసరావు గుంటూరు జిల్లాలో 1968 మే 2న జన్మించారు. 1995లో నాగపూర్‌లో ఎల్ఎల్‌బీ పూర్తిచేసి మూడు దశాబ్దాలుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. హైకోర్టులో సివిల్, క్రిమినల్ కేసులు వాదించడంలో మంచి పేరు గడించారు. ప్రభుత్వం తరపున రెవెన్యూ కేసులు వాదించిన శ్రీనివాసరావు ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

పలు జిల్లాలకు పొగమంచు హెచ్చరిక

రాష్ట్రంలో పెరిగిన చలి తీవ్రత

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కోస్తాలోని పలు జిల్లాల్లో ఆదివారం పొగమంచు దట్టంగా కురిసింది. రెండు, మూడు రోజుల వరకు పొగమంచు తీవ్రత కొనసాగనున్నట్టు విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం హెచ్చరిక జారీచేసింది. పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అనేక ప్రాంతాలు, కోస్తాలో మిగిలిన జిల్లాల్లో పలు ప్రాంతాల్లో పొగమంచు కురిసింది. దీంతో ఆదివారం ఉదయం విజిబిలిటీ 500 మీటర్ల కంటే తక్కువకు పడిపోయింది. కాగా... ఆదివారం రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 3.5 డిగ్రీలు, సముద్రతీర ప్రాంతమైన కళింగపట్నంలో 12.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమ, మంగళవారాల్లో పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పొగమంచు దట్టంగా కురుస్తుందని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు.



జస్టిస్ సుజాతకు శ్రీబగళాముఖి అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో జి.నరసింహామూర్తి

శ్రీబగళాముఖి అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

పిట్టలవానిపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత ఆదివారం దర్శించారు. అమ్మవారికి గుమ్మడికాయ దీపారాధన నిర్వహించి, ప్రత్యేక కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం పండితులు న్యాయమూర్తికి వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ఈవో జి.నరసింహామూర్తి అమ్మవారి చిత్రపటం అందజేశారు.



ఆత్మీయ కలయికలో పాల్గొన్న 1989వ బ్యాచ్ పోలీస్ అధికారులు

1989 బ్యాచ్ ఎస్ఐల ఆత్మీయ కలయిక

» ఉభయ రాష్ట్రాల నుంచి 170 మంది హాజరు

» 37 ఏళ్ల తర్వాత మళ్లీ ఒక్క చోటకు

విజయవాడ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వారంతా 1989లో పోలీసు శాఖలో ఎస్ఐలుగా అడుగుపెట్టారు. ఉద్యోగంలో ఒక్కో మెట్టు ఎక్కి వారిలో కొందరు అదనపు ఎస్పీ స్థాయికి ఎదిగారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వీరంతా 37 ఏళ్ల తర్వాత తిరిగి ఒకచోటకు చేరారు. విజయవాడ గురునానక్ కాలనీలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం వీరి ఆత్మీయ కలయిక ఘనంగా జరిగింది. కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో ఆడిపాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఎస్ఐ ఉద్యోగాలకు పోలీసు శాఖ ప్రకటన ఇచ్చింది. 400 మంది ఎస్ఐలుగా ఎంపికయ్యారు. అప్పటికి అప్పా(ఆంధ్రప్రదేశ్ పోలీసు అకాడమీ) ఏర్పాటు కాలేదు. దీంతో 200 మంది హైదరాబాద్ అంబర్‌పేటలో ఉన్న సీపీఎల్(సెంట్రల్ పోలీసు లైన్)లో, మరో 200 మంది అనంతపురంలో శిక్షణ పొందారు. 1989 జనవరి 16వ తేదీన వీరంతా ఎస్ఐలుగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. వీరిలో చాలామంది అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది ఉద్యోగ విరమణ చేశారు. నలుగురు మాత్రం ఐపీఎస్ పదోన్నతిని అందుకున్నారు. వైజాగ్ రేంజ్‌లో ఉన్న రవిప్రకాశ్, నంద్యాల ఎస్పీగా పనిచేసిన రఘువీర్‌రెడ్డి, తెలంగాణలో ఉన్న నాగరాజు, రాజేంద్రప్రసాద్ ఎస్పీలుగా పనిచేశారు. వారిలో నాగరాజు ఉద్యోగ విరమణ చేసి ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈ ఆత్మీయ కలయికకు మొత్తం 170 మంది వరకు హాజరయ్యారు. వారిలో ముగ్గురు మహిళలు ఉన్నారు. ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ, ఎన్.మురళీకృష్ణ, గుంటూరు అదనపు ఎస్పీ(అడ్మిన్) రమణమూర్తి, పల్నాడు అదనపు ఎస్పీ(క్రైమ్స్) లక్ష్మీపతితోపాటు విజయవాడ పోలీసు కమిషనరేట్‌లో వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారు ఎక్కువగా హాజరయ్యారు.

ఏ స్థాయిలో ఉన్నా మూలాలను మరవొద్దు

» సంస్కృతి, సంప్రదాయాలు, తెలుగు భాషను కాపాడుకోవాలి

» హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్

» విశాఖలో లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాల ప్రదానం

డాబాగార్డెన్స్ (విశాఖ సిటీ), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ఎక్కడ, ఏ స్థాయిలో ఉన్నప్పటికీ మన మూలాలను, జన్మనిచ్చిన తల్లిదండ్రులను, పుట్టి పెరిగిన ఊరును మరిచిపోకూడదని..., భావితరాలకు కూడా ఈ విషయాలను తెలియజేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఎన్టీఆర్, హరివంశరాయ్‌బచ్చన్‌ల పుణ్యతిథి, లోక్‌నాయక్ ఫౌండేషన్ వార్షిక పురస్కార ప్రదానోత్సవాన్ని విశాఖపట్నం దసపల్లా హోటల్లో లోక్‌నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ... మన సంస్కృతి, సంప్రదాయాలను, తెలుగు భాషను కాపాడుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఇంగ్లిష్‌పై ఉన్న మక్కువతో తెలుగు భాషను పక్కన పెట్టేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ...వివిధ రంగాల్లో నిష్ణాతులకు లోక్‌నాయక్ ఫౌండేషన్ ద్వారా 22 సంవత్సరాలుగా పురస్కారాలను అందజేయడం స్ఫూర్తిదాయకమన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ప్రముఖ నటి ప్రభ తదితరులు ప్రసంగించారు. అనంతరం లోక్‌నాయక్ సాహిత్య పురస్కారం కింద ప్రముఖ రచయిత డాక్టర్ వెలమల సిమ్మన్నకు రూ.2 లక్షల నగదు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. తానా ప్రపంచ సాహిత్యవేదిక వ్యవస్థాపకులు తోటకూర ప్రసాద్, సెంట్రల్ లండన్ డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉదయ్ ఆరేటి, డాక్టర్ వేములపల్లి రాఘవేంద్రచౌదరి, క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తరపున డాక్టర్ జి.భాస్కరరావుకు లోక్‌నాయక్ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేశారు. విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, లోక్‌నాయక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



లోక్‌నాయక్ ఫౌండేషన్ వార్షిక పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్. వేదికపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు

జాషువా అడుగుజాడల్లో మధురకవి మల్లవరపు



కవి హృదయానికి అనివార్యంగా అమృతత్వం ఉండాలి. అమ్మ బలవర్ధకమూ జీర్ణయోగ్యమైన ఆహారాన్ని మాత్రమే బిడ్డకు అందించినట్లుగా కవి కూడా సమాజానికి అవసరమైన తాత్త్విక స్ఫూర్తిని పాఠకులకందేయంగా కవిత్వంలో ప్రతిబింబించాలి. వేమన నుండి గద్దర్ వరకూ అనేకమంది మహాకవులు ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించి సాహిత్యానికి సమున్నత విలువనూ విస్తృతినీ సమకూర్చారు. ఇదే వరుసతో జాషువా లాంటి కవులు పద్య కవిత్వాన్ని మరోమలుపు తిప్పారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో జాషువా మార్గంలో మడమ తిప్పకుండా పయనించిన సాహితీమూర్తుల్లో విశిష్టకవి మల్లవరపు జాన్.

జాన్ పేరు ఈ తరం చవర కవులకు పరిచయం లేకపోవచ్చు. దివాకర్ల వెంకటావధాని, విశ్వనాథ సత్యనారాయణ, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, కరుణశ్రీ, సినారె, బోయి భీమన్న, కొలకలూరి ఇనాక్, నాగభైరవ కోటేశ్వరరావు, బేతవోలు రామబ్రహ్మం వంటి సుప్రసిద్ధ కవి పండితులకు మాత్రం సుపరిచితుడైన రాగిముద్ద లాంటి ఆయన పద్యకవిత్వం పరమ ఇష్టం. 'తేనెలూరు తెల్లు తీరు గమించిగా కోర్కి, వాడునువారు' మల్లవరపు జాన్ కావ్యాలను పరిశీలించమని తుమ్మల సీతారామమూర్తి రస హృదయులను పిలుపునిచ్చారు. 'జాన్ పద్యం మాధుర్యగుణ భూయిష్టమైన'దని 'ఆతుకుల బ్రతుకులు' కావ్య పీఠికలో దాశరథి కితాబిచ్చారు.

'మధురకవి'గా ప్రఖ్యాతిగాంచిన మల్లవరపు జాన్ 1927 జనవరి 22న ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఒంగోలు తాలూకా చీమకుర్తిలో దావీదు, రత్నమ్మ దంపతులకు జన్మించారు. 'చెప్పలు కుట్టే జీవనమే వేయి కుటుంబము నందు బుట్టి, చిన్నప్పటి నుండి శారద పదార్చన జేసితి' అని ఈ కవి చెప్పుకున్నట్టుగానే– అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని, కఠోర కృషితో జ్ఞానార్జన చేసి, ఉద్దండ పండితులను దీకొని, ప్రభావశీలమైన పద్యకవిగా జాన్ రాణించారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన జాన్ తర్వాత ప్రభుత్వశ్రేణి తెలుగు పండితుడై వందలాది మంది శిష్యులకు భాషా సాహిత్యాలను బోధించి, ఉత్తమ గురువుగా ప్రకాశంజిల్లాలో పేరు గాంచారు.

ప్రారంభ దశలో ముత్యాల సరాల శైలిలో గేయ కవిత్వం రాశారు. ఒంగోలులోని శఠగోపనాచార్యుని సహకారంతో సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాలను, పంచకావ్యాలను అధ్యయనం చేసి, పద్యకవిత్వం వైపు కలం సారించారు. పౌరాణిక పద్య నాటకాల ప్రభావంతో క్రైస్తవ ఇతివృత్తం నేపథ్యంలో జాన్ రాసిన 'సాంసన్ డెలీల' (1967) పద్యనాటకం ఆయనకు ఎంతగానో పేరు తెచ్చింది. 'విశ్వప్రకాశం' (1973), 'ఆతుకుల బ్రతుకులు' (1981), 'కాంతిరేఖలు' (1987), 'సూక్తిశతకం', 'సరసవినోదిని' (1991), 'విద్యుద్రేఖలు' (1993), 'భావ విపంచి' (1996), 'పుణ్య పురుషుడు' (2005) వంటి ఖండ కావ్యాలతో, కృతులతో మల్లవరపు జాన్ ఆధునిక పద్య కవిత్వంలో సుస్థిరస్థానాన్ని సంపాదించుకున్నారు. మైసూరు తదితర విశ్వవిద్యాలయాల్లో జాన్ రచనలు పాఠ్య గ్రంథాలుగా ఉండటం అరుదైన విషయం. అవిద్య, పేదరికం, మద్యపానం, అధిక జనాభా, కులతత్వం, అవినీతి, లంచగొండితనం, వరకట్నం, మహిళాభ్యుదయం, దళితుల సంక్షేమం, కుల నిర్మూలన, దేశభక్తి లాంటి అనేకానేక అంశాల్ని ప్రజల్లో సదవగాహన కల్పించడానికి కవిత్వం ద్వారా జాన్ కృషి చేశారు. అభ్యుదయ

వస్తురూపాల్లో జాషువా ప్రభావం జాన్ కవిత్వంలో సర్వత్రా కనబడుతుంది. అయితే ఆ ప్రభావం కార్బన్ కాపీలా యథాతథంగా కాక, అన్న పోలికలు తమ్ముడి రూపంలో ప్రతిఫలించినట్టు ఉంటుంది.

కవిత ప్రభంజనం తీరం దాటుతున్న సాహిత్య సందర్భంలో కవిగా రంగప్రవేశం చేసిన మల్లవరపు జాన్, అస్తిత్వ ఉద్యమాల సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్న సందర్భంలో కన్ను మూశారు. (2006 ఆగస్ట్ 12).

ఈ నాలుగు దశాబ్దాల్లో సాగిన సామాజిక ఉద్యమాల మౌలిక ఆశయాలను ప్రతిబింబంతంగా జాన్ అక్షరబద్ధం చేశారు. 'పనులు జేయకుండ పంచభక్ష్యములను/ తేరగా బుజించి తిరుగువారు/ కష్టజీవి సొమ్ము కాజేయు గజదొంగల'ని అభ్యుదయ కవిలా గర్జించారు. 'సామ్రాజ్యవాదుల సాహస ర్యంబును, స్వార్థ జీవుల హస్తములకెక్కి' మాతృదేశం విలవిలలాడుతుందని జాతీయోద్యమ కవిలా ఆవేదన చెందారు. సంప్రదాయ ఛందోబంధోబద్ధుల రహదారుల్లో ప్రయాణం చేస్తూనే, ఆధునిక దృష్టితో నిరాడంబరమైన శిల్పచాతుర్యంతో ప్రజాకవిత్వాన్ని సృజించి, జాన్ సమకాలీన పద్యకవులకు ఆదర్శంగా నిలిచారు.

అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంతో వెలువడే వర్తమాన సాహిత్యానికి జాన్ కవిత్వం సరికొత్త ఉత్తేజాన్ని అందిస్తుంది. అసమ సమాజ దుర్నీతిని, మతరాజకీయాల పెనుప్రమాదాలను మల్లవరపు జాన్ తీవ్రంగా నిరసించారు. 'రామ జన్మభూమి, బాబ్రీ మసీదు గొడవల నెత్తురు మడుగుల్లో బ్రతుకు దుంప తెగుతుందని' బాధపడుతూనే 'ఓమన్న, ఆమెన్ నన్న, రహీమన్న పదాలు సన్నిహిత తుల్యార్థ/ స్తోమము' లని ('భావ విపంచి') మతసామరస్యాన్ని ప్రబోధించారు. 'హరిపదాల బుట్టి అరుగుచుండు గంగ/ పాప జనుల శుద్ధి పరుచుచుండు/ అజుని పాదజులకు అస్పృశ్యులైరి' అని పౌరాణిక దృష్టితోనే కులవ్యవస్థ కుటిలత్వాన్ని ప్రశ్నించారు. విష్ణుపాదాల నుండి పుట్టిన గంగ పవిత్రమైనదైతే, బ్రహ్మ పాదాల నుండి జన్మించి నట్టు చెప్పబడుతున్న అతిశూద్రులైన దళితులు అంటరానివారు ఎందుకయ్యారని తర్కబద్ధంగా జాన్ వాదించారు. 'పురుషులతో సమానంగా సర్వకార్యములు నెరపిడి శక్తియుక్తులు నేర్చిన' ఆధునిక స్త్రీలను అణచివేయడం సభ్యసమాజానికి సిగ్గుచేటు అన్నారు.

పద్యకవుల్లో మృగ్యమైన అంతర్జాతీయ రాజకీయస్పృహ జాన్ కవిత్వంలో దర్శనమిస్తుంది. కువైట్‌ను కబళించిన అమెరికా ఆధిపత్యం, గల్ఫ్ యుద్ధాల దుష్పరిణామం వంటి అంశాలను తన పద్యాల్లో అక్షరబద్ధం చేశారు. అమెరికా యుద్దోన్మాదాన్ని నిరసిస్తూ 'ఒక సద్దాము పట్టగా సకలోర్వీ నాశనమునుల్చుట తగునా? ఐక్య రాజ్యసమితి ప్రపంచ శాంతికై సత్వరయత్నము చేయదేలకో?' అని ఆక్షేపించారు. 'సాకు మోపి గర్వమున 'సిరాకు' ప్రజల/ అసువులను దీయ నమెరికాకద్దగునా/ పరువు దీరులు లేరా ప్రపంచమందు?' ('వైశాలిక ప్రవృత్తి') అంటూ జాన్ 30 ఏళ్ళ కిందట వేసిన సూటి ప్రశ్నలకు నేటికీ ప్రాసంగికత ఉంది. విశ్వమానవాళికి సమతా సందేశాన్నందించిన గౌతమ బుద్ధుని 'లోకపరివర్తన దృక్పథమ్మున గొప్ప సన్యాసి' అని, 'మానవాభ్యుదయప్రస్థ' అని ప్రస్తుతించారు. అంబేడ్కర్ సిద్ధాంతోదాయక ప్రస్థానాన్ని 'భారత రత్న' పద్య ఖండికలో చిత్రించారు. 'జాతి భవిష్యద్దీపకుండు' అని రాజ్యాంగ నిర్మాతను జేజేలు పలికారు.

'అలితకళా విలాస విపులార్థ పరిస్ఫుట భక్తిభావనోజ్వలతర కౌముదీ విభవ సారము'లాంటి సంస్కృత సమాసభూయిష్ట రచనాసందర్భానంతో పద్యాలు రాసినప్పటికీ, ఈ శైలికి భిన్నంగా జాన్ శుద్ధవ్యావహారిక భాషకు పట్టం కట్టారు. అణగారిన వర్గాల నుండి వచ్చిన పద్య కవులు తమనిత్య వ్యవహారంలోని పలుకుబడులను నుడికారాలను ప్రయోగించి తెలుగు పద్యానికి కొత్త ఊపిరిపోశారు. 'పని తెమలదు', 'తేప తేపకు', 'తిమ్మిరెక్కినది', 'మిడిమేలము', 'తుంపులు తుంపులై', 'తాతాటపోయి', 'తిప్పలబడి దుమ్మరెండు', 'మొమాటం'... లాంటి పల్లె పదాలను సముచితంగా ప్రయోగించి జాన్ తెలుగు పద్యానికి అరుదైన డిక్షన్ అందించారు. జాన్ పాఠక సులభుడు. జాన్ కవిత్వం చిటారు కొమ్మన మిఠాయిపొట్లం కాదు. ఆబాలగోపాలానికి దాహం తీర్చే చలివేంద్రం. ఇందువల్లనే మల్లవరపు కవిత్వంలో మధురత్వం అంతకంటే మించిన సజీవత్వం నిలువెల్లా పరిమళిస్తుంది.

వస్తురూపాల్లో జాషువా ప్రభావం జాన్ కవిత్వంలో సర్వత్రా కనబడుతుంది. అయితే ఆ ప్రభావం కార్బన్ కాపీలా యథాతథంగా కాక, అన్న పోలికలు తమ్ముడి రూపంలో ప్రతిఫలించినట్టు ఉంటుంది. జాషువా మార్గం పద్య కవిత్వానికి అసలైన వారసునిగా మల్లవరపు జాన్ కనిపిస్తారు.

(జనవరి 22న మల్లవరపు జాన్ శతజయంతి)

■ కోయి కోటేశ్వరరావు
✆ 94404 80274

గంటేడ కథలపై ప్రసంగం

రాజాం రచయితల వేదిక 132వ సమావేశం జనవరి 25 ఉ.10గంటలకు విజయనగరం జిల్లా, రాజాంలో విద్యానికేతన్ పాఠశాలలో జరుగుతుంది. అధ్యక్షత శాసపు సత్యనారాయణ. సమావేశంలో 'గంటేడ కథల్లో మానవ విలువలు' అంశంపై మాడుగుల శ్రీనివాసరావు ప్రసంగిస్తారు. వివరాలకు: 98857 58123

గార రంగనాథం

వేమన సాహితీ పురస్కారం

వేమన విజ్ఞాన కేంద్రం, తిరుపతి ఇచ్చే 'వేమన సాహితీ పురస్కారం–2025'ను తెలకపల్లి రవి స్వీకరిస్తారు. వేమన జయంతి ఉత్సవాల్లో భాగంగా జనవరి 19న వేమన విజ్ఞానకేంద్రంలో జరిగే పురస్కార ప్రదానంలో రూ.10 వేల నగదు పురస్కారంతో సత్కారం ఉంటుంది. వివరాలకు: 939 8000686.

మల్లారపు నాగార్జున

రాణీ పులోమజాదేవి కథా పురస్కారం

రాణీ పులోమజాదేవి జ్ఞాపకార్థం నగదు పురస్కారం అందజేయాలని వారి కుటుంబం సంకల్పించింది. విజేతకు జూలైలో హైదరాబాద్‌లో జరిగే తెలుగు సాహితీవనం వార్షికోత్సవంలో రూ.5వేల నగదుతో పురస్కారం ఉంటుంది. విజేతలు తప్పనిసరిగా సభకు వచ్చి అవార్డు స్వీకరించాలి. పురస్కారం కోసం కథలను 2024, 2025 సంవత్సరాల్లో ప్రచురించిన కథా సంపుటాలు రెండు కాపీలను ఫిబ్రవరి 10 లోపు చిరునామా: తిక్కా సత్యమూర్తి, ప్లాట్ నెం–డి42, ప్లాట్ నెం–504, సాయి లక్ష్మీ ఎన్‌క్లేవ్, మధురానగర్, హైదరాబాద్ – 500038, ఫోన్: 98493 44109కు పంపాలి.

తెలుగు సాహితీ వనం



పక్షులు వాలని నేల నా మాతృభూమి

నేనెప్పుడూ
నాతోటే ఉన్నప్పటి చింత...
నా నిశ్శబ్దంలో దాక్కుని నేనే మాట్లాడడం లాంటిది,
నా సముద్ర భాషను నేనే వింటున్న దిగులు,
నా ఏకాంత రాత్రులకు మళ్లీమళ్లీ పొమ్మని
నేనెవరినీ పిలవడం లేదు.

నేను వెల్లకిలా పడుకుంటే గుచ్చుకున్న కాలం,
ఉదయాలూ, సాయంత్రాలూ ముక్కలైంది
తెల్లార్లూ కూచున్నా రాత్రి తెల్లారదు.
ఈ నిశ్శబ్దం అతి ప్రాచీనం
రాత్రి కన్న కలలు దిండు కింద నలిగి
పొద్దుటికి వాడిపోతాయి.

నేను సంక్షుభిత మానవుణ్ణి
ఆదరాలు కాలం నా హృదయం
పక్షులు వాలని నేల నా మాతృభూమి
ఈరీతిని దాహాలలో రోజులన్నీ మధ్యాహ్నాలే

జీవితం అర్ధరాత్రి స్వప్నిస్తుంది
కాలికాలి కాంక్షలు పక్కనే నిద్రపోతాయి
మనసు భిక్షాపాత్ర
తరచూ అది ప్రదూర వేదనతో నిండిపోతుంది

కదల లేని యవిత్వం
కాలానికి అడ్డంగా పడుకుంటుంది
ఈ దుఃఖంతో శరీర సాంగత్యం ఎన్నాళ్లు?

అబద్ధాలు శాంతినివ్వవు
సంతోషాలు కాంతినివ్వవు
చినుకుకీ చినుకుకీ మధ్య ఖాళీలోకి
తలుపులు తెరుచుకుంటాను
చూపు తడుస్తుంది..
నా చెవి వెనక సముద్రపు హోరు,
సమస్త మానవాళి దుఃఖగీతిక లాగు.

అప్పుడప్పుడు పాత ముఖాలే కొత్త పరిచయాలుగా
ఎదురౌతాయి

ఎవరివో అడుగు జాడలు,
యింకా పచ్చిగానే ఉన్నాయి
మళ్లీమళ్లీ రానివారెవరో పాదముద్రలు వదిలిపెట్టి వెళ్లారు

ఏ సూర్యోదయానికి ప్రణమిల్లామో,
ఏ సూర్యాస్తమయానికి తెలీదు.
ఏ ప్రయాణంలో కలిసి నడుస్తామో
ఏ రహదారికి తెలీదు.
రేపటి ఆశలకు నేడు నివాళి


■ అరుణ్ బవేరా
✆ 94407 10678

చెక్కుల ప్రదర్శన వెనుక లెక్కలు సరిగా ఉన్నాయా!

ఇటీవలి కాలంలో భారతీయ ప్రాంతీయ సాహిత్య వేడుకల వేదికపై ఒక ఆసక్తికర సన్నివేశం కనబడుతోంది. ప్రచురణకర్త వేదిక మీద తన రచయిత చేతికి రాయల్టీ చెక్కు అందజేయడం. గతంలో రచయిత తనకు రావాల్సింది అడిగినప్పుడు ప్రచురణకర్త తన సిగరెట్ పాకెట్‌లో నుంచి ఒక సిగరెట్టు పైకి తీసి పడేసామో, రచయిత మరీ పట్టుబడితే తన డైరెండు సాయంకాలపు కార్యక్రమంలో అతనిని అతిథిగా ఆహ్వానించి ఒక స్మాల్ లార్జ్ ఇచ్చి పంపడమే జరిగిన సందర్భాలున్నాయి! రాయల్టీ గురించి మాట్లాడితే చికాకు, 'సాహిత్యాన్ని డబ్బుతో తూకం వేస్తావా?' అన్న నైతిక బోధ. నేటి ప్రస్తుతం వేదిక మీద చెక్కులు అందజేసే ట్రెండ్‌తోసూ కొంత ఆశాజ్యోతి ఉంది. ఈ ట్రెండ్‌ను చూసి, 'అంతకాలం రచయితలను గౌరవించని ప్రచురణకర్తలు, ఇప్పుడు మారుతున్నారు' అని చాలామంది అంటున్నారు. కానీ ఈ వాక్యంలో సగం నిజం ఉంది. మిగిలిన 'అర్ధ'ని ప్రశ్నించాల్సిన తరుణం ఇది!

ఆ మధ్య హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లాకు ఆయన ప్రచురణకర్త రాయ్‌పూర్‌లో ఒక సభ నిర్వహించి రూ.30లక్షల రాయల్టీ చెక్కు అందజేశారు. ఈ వార్త దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. ది ప్రింట్, ది టెలిగ్రాఫ్ వంటి పత్రికలు దీనిని 'పబ్లిషింగ్‌లో నిజాయితీకి నిదర్శనం'గా చూశాయి. ప్రచురణకర్తలు కూడా స్పష్టంగా చెప్పారు. 'మమ్మల్ని ఎవ్వరూ నమ్మలేదు. కాబట్టి వేదిక మీద చూపించాం' అని. ఇక్కడే అసలు సమస్య ఉంది. నమ్మకం రావాలంటే చెక్కు చూపించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇంతకాలం రచయితలకు చూపించకుండా నడిపిన వ్యవస్థలో ఇది నిజంగా మార్పా లేక నమ్మకాన్ని కొనే కొత్త పద్ధతా?

రాయల్టీ అనేది రంగస్థల ప్రదర్శన కాదు. అది ఒక వ్యవస్థ. స్పష్టమైన ఒప్పందాలు, అర్థమయ్యే స్టేట్మెంట్లు, ప్రశ్నించే హక్కు– ఇవే రాయల్టీ నైతికతలు. వేదిక మీద రచయిత చేతిలో మెరిసే బ్యాంక్ చెక్ ఆ వ్యవస్థకు ప్రత్యామ్నాయం కాలేదు. అది ఎప్పటిలో ఎక్కువ ఒక సంకేతం మాత్రమే. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే. రాయల్టీ చెక్కు చూపించడం పారదర్శకత కాదు. అది పారదర్శకతను నటించడం అనుకోవచ్చు! ఎందుకంటే ఆ చెక్కు వెనుక లెక్కలు ఎవరికీ కనిపించవు గనుక. అదే ప్రచురణ సంస్థలో మిగిలిన రచయితలతోపాటు ఎవరికీ ఏమీ జరుగుతుందో తెలియదు. ఒకరి చేతిలో చెక్కు కనిపిస్తున్నప్పుడు వందమంది చేతులు ఖాళీగా ఉన్న నిజం మరుగున పడుతుంది. ఇక్కడ గౌరవాన్ని మార్కెట్ విలువతో కొలుస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. భారీ అమ్మకాలు సాధించినవారికే వేదిక, వెలుగు. మిగిలినవారికి నిశబ్ద ఘోష! ఇది పాత అన్యాయానికి కొత్త అలంకారం కాదూ?



రాయల్టీ అనేది రంగస్థల ప్రదర్శన కాదు. అది ఒక వ్యవస్థ. స్పష్టమైన ఒప్పందాలు, అర్థమయ్యే స్టేట్మెంట్లు, ప్రశ్నించే హక్కు– ఇవే రాయల్టీ నైతికతలు. వేదిక మీద రచయిత చేతిలో మెరిసే బ్యాంక్ చెక్ ఆ వ్యవస్థకు ప్రత్యామ్నాయం కాదు. ఒక సంకేతం మాత్రమే!

రచయిత చేతిలో మెరిసే చెక్కు నిజానికి దేన్ని సూచిస్తోంది– గౌరవాన్నా? లేక వ్యవస్థలోని అసమానతనా? ప్రచురణకర్తలు, పుస్తక విక్రేతల తరువాత రచయిత ఆ అమ్మకాల ఫలితాలను అందుకుంటున్నాడన్నది నిజం కాదా? రచయితల పట్ల గౌరవం మాటలకు మాత్రమే పరిమితం, ఆర్థికంగా ఏమీ ఉండదు.

పురస్కారాలు, సాహిత్యోత్సవాలు, ప్రజాస్వామ్యం రచయితలకు గుర్తింపు, ప్రశంసలు కూడా ఉండేవి ఉన్నాయి గానీ అవి ఆ రచయిత జీవన విధానాన్ని కాని గతిని కాని మార్చడం లేదు. ఇక్కడ మరో ప్రమాదం– సాహిత్యం నెమ్మదిగా 'సక్సెస్ స్టోరీ'లతో కొలవబడే రంగంగా మారడం. సాహిత్యం సమాజాన్ని ఒక్క రోజులో మార్చదు. నిజమే. కానీ సమాజం అందని ఉన్న గొంతులు తమ ఆక్రందనలను, ఆకాంక్షలను గొంతెత్తి నినదిస్తాయి. అవి సాహిత్యంలోనే నిలుస్తాయి. నేగానికి అలవాటుపడిన సంస్థల్లో సాహిత్యం ఆలోచన రేకెత్తిస్తుంది. పంచుకున్న భావం సామాజికమవుతుంది. పురోగతికి బాటలు వేస్తుంది. మరి అమ్మకాలే గౌరవానికి ప్రమాణమైతే, కాలానికి ఎదురీది నిలిచే రచనలు ఎక్కడ నిలుస్తాయి?

యూరప్, అమెరికా లాంటి దేశాల్లో రాయల్టీలు బహిరంగంగా ప్రకటించరు. అక్కడ రచయితకి ఇచ్చే గౌరవం ఒక ప్రదర్శన కాదు. అది ఒక ప్రక్రియ. రచయితకు సక్రమ సమాచారం ఇవ్వడం, లెక్కలు స్పష్టంగా ఉంచడం– ఇవే అక్కడ మార్కెట్ కేంద్రబిందువు. చెక్కు చేతిలో కనిపించకపోయినా, వ్యవస్థలో రచయితకు గౌరవం ఉంటుంది. కాబట్టి ప్రస్తుతం వేదిక మీద మెరిసే రాయల్టీ చెక్కు, నిజానికి, మార్పు కాదు; మార్పు మొదలవుతున్నట్టు కనిపించే దృశ్యం మాత్రమే. నమ్మకం వ్యవస్థల ద్వారా నిర్మించబడుతుంది, కెమెరా ముందు కాదు. పారదర్శకత అనేది చూపించేది కాదు, పాటించేది. ఒక రచయిత చేతిలో చెక్కు కనిపించడం కంటే, వందలమంది రచయితలకు లెక్కలు అర్థమయ్యేలా రావడం ఎక్కువ విలువైనది. వేదిక మీద చెక్కులు అందుకుంటున్న రచయితల ఆశయాలు ఎక్కువ. కానీ వాటిని గౌరవించే పరిణామాన్ని చూపించాల్సిన అవసరము లేదు.

■ అట్లూరి అనిల్
✆ 81426 42638

'ఘోస్ట్ రైటర్ ఉన్నాడా?' అన్నారు సినారె!

నా మొదటి పుస్తకం

అమ్మంగి వేణుగోపాల్



అది 1979. 'పుస్తకాలు చదువుతూ పెరిగినవాణ్ణి. నా పుస్తకం వేసుకోకుంటే ఎట్లా?' అన్న ప్రశ్న అంతరంగంలో గోల చేయసాగింది. వేసి తీరాలనే నిర్ణయం తీసుకున్నాను. ఒక రోజు సి. నారాయణ రెడ్డి గారిని కలిసి నా కవితా సంపుటిని వారికి అంకితం ఇస్తున్నానని చెప్పాను. వారు వెంటనే ఒప్పుకున్నారు. 'సృజన'వారి రాష్ట్ర స్థాయి కవితా రచన పోటీలో మొదటి బహుమతి వచ్చి అప్పటికి 13 సంవత్సరాలు. 'ఇప్పటికే ఆలస్యం చేశారు' అన్నారు నా సహాధ్యాయి కన్నసామి (కె.వి.ఎన్. ఆచార్య) గారు. కవితలు వెతికే పనిలో పడ్డాను. కొన్ని చెన్నకేశవరెడ్డి దగ్గర, కొన్ని లక్ష్మీనారాయణ దగ్గర దొరికాయి. నా దగ్గర ఉన్న వాటిలో కలిపితే 38 అయ్యాయి. అంధుల మీద 1967లో రాసిన 'చీకటిలో బతుకు నీడ' మంచి పేరు అవుతుందని ఒకరిద్దరు మిత్రులు అంటున్నా, 'మిణుగురు' పేరు బాగుందనిపించింది. అది– చిన్నది, స్వయం ప్రకాశం కలిగింది, చీకటిని వెలిగించేది!

ఒక 'ముందుమాట' నా అభిమాన విమర్శకులు రాచమల్లు రామచంద్రారెడ్డి గారితో రాయించాలని ముందే నిర్ణయించుకున్నాను. కారణం 'సృజన'లో బహుమతి పొందిన నా కవితను చదివి "అనుభూతి తీవ్రతలో వేణుగోపాల్ కవిత ఉత్తమంగా ఉంది" అని 1968లోనే తమ 'సంవేదన' పత్రికలో సమీక్షలో అని ఉన్నారు. 1979 నాటికి వారు రష్యా నుంచి తిరిగివచ్చి సీనియర్ పాత్రికేయులుగా ఒక పత్రికలో పని చేస్తున్నారు. ఆఫీసుకు వెళ్ళి కలిసాను. వారి ప్రశంసను వారికే గుర్తు చేసి 'ముందుమాట' రాయమని కోరాను. 'నాకే పరీక్ష పెట్టారు' అని నవ్వుతూ లిఖిత ప్రతిని తీసుకున్నారు.

నాకు ఇంగ్లీషు లెక్చరర్లన్నా, ఇంగ్లీషు సాహిత్యాన్ని చదువుకున్న రచయితలన్నా అభిమానం. వాళ్ళు షేక్స్పియర్, కీట్సుల వారసులనిపిస్తుంది. వేగుంట మోహన ప్రసాద్ కవిత్వమన్నా ఇష్టమే. అందుకే వారికి 'ముందుమాట' రాయమని ఉత్తరం రాశాను. ఒప్పుకున్నారు. నెలలోపు ఇద్దరి ముందుమాటలూ వచ్చాయి. కన్నసామి తన పాత్రికేయ మిత్రుడు, చిత్రకారుడు 'అంజన్'తో ముఖచిత్రం వేయించారు.

అప్పుడు నేను మెదక్ జిల్లా సదాశివపేటలో పని చేస్తున్నారు. హైస్కూల్‌లో పని చేస్తున్న ఆత్మీయ మిత్రుడు బి. నరసింహారావు శ్రీసంగమేశ్వర ప్రెస్ పర్యవేక్షకుడు. అది చాలావరకు పెండ్లి పత్రికలు అచ్చు వేసే ప్రెస్. నా పుస్తకం అచ్చు వేయటానికి వెంటనే ఒప్పుకున్నాడు. ఆ ప్రెస్‌లో నరసింగరావు అనే మంచి ప్రెస్ కార్మికుడు ఉండేవాడు. అచ్చు తప్పులు ఎక్కువ రాకుండా పని కానిచ్చాడు.

1980 ఏప్రిల్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్తులో 'మిణుగురు' ఆవిష్కరణ జరిగింది. ఆవిష్కర్త దేవులపల్లి రామానుజరావు గారు. విశిష్ట అతిథి ఇరివెంటి కృష్ణమూర్తి గారు. తిరుమల శ్రీనివాసాచార్య, చెన్నకేశవరెడ్డి వక్తలు. సభానిర్వహణ పరిషత్తు కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న కె.కె. రంగనాథాచార్యులు. జనం యాభైమంది దాకా వచ్చారు. రా.రా. కూడా సభకు రావటం విశేషం. శ్రీనివాసాచార్య నా కవితల్ని ఆశువుగా వినిపిస్తూ ప్రసంగించటం ఆకట్టుకుంది. "నేను 'మిణుగురు'ను అంకితం తీసుకుంటున్నాను. ఎక్కువగా మాట్లాడటం సముచితం కాదు. వేణుగోపాల్ కవితల్ని చదివినప్పుడు వీటిని ఈయనే రాశాడా? వెనక ఎవరైనా ఘోస్ట్ రైటర్ ఉన్నాడా? అన్న అనుమానం కలుగుతుంది" అన్నారు సినారె. అంతా నవ్వారు. కన్నసామి వందన సమర్పణలో సభ ముగిసింది. టి.ఎల్. కాంతారావు, కడియాల రామ్మోహన్ రావు, తెలిదేవర భానుమూర్తి, రామహనుమాన్ (కళా సౌరభం) మొదలైనవారు వివరంగా సమీక్షించారు. ఆరుద్ర, సోమసుందర్ ఉత్తరాలు రాశారు. 'మిణుగురు'లో ఉన్న ఆరేడు మినీ కవితలను బెంగుళూరు యూనివర్సిటీ వారు ఎం.ఏ. తెలుగు విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టారు ('90 దశకంలో). 'బిచ్చగాడు' కవితను ఎలనాగ ఆంగ్లంలోకి 'ది బెగ్గర్'గా అనువదించగా, దాన్ని తెలంగాణ ఇంటర్మీడియెట్ బోర్డు వారు ఇంటర్ ఫస్ట్ యియర్ పాఠ్యాంశంగా పెట్టారు.



చాలామంది మిత్రులు "నీవు తప్ప నాకు మాత్రం యింకెవరున్నారు చెప్పు" అని మొదలయ్యే 'పొలమారిన హృదయం' కవితను గుర్తు చేస్తుంటారు. కె.వి.రమణాచారి గారు 'మేధావి' కవితను ఇష్టంగా వినిపిస్తారు. నవీన్ గారికి 'ఓ మాట' ఇష్టం. అందెశ్రీగారిని ఏలె లక్ష్మణ్ గారి ఆఫీసులో తొలిసారి కలిసినప్పుడు "అన్నా! నీ 'మిణుగురు'ను ఎన్నిసార్లు చదివానో" అంటూ ఆశువుగా రెండు మూడు కవితలు వినిపించారు. వేణు సంకోజ్, నోముల 'చీకట్లో సైతం కళ్లు తెరిచి' కవిత ఇష్టపడ్డారు. నాకు మాత్రం 'ఎడారిలో – ఎండా కాలం' బాగా ఇష్టం. ఆవిష్కరణ అప్పుడు డిగ్రీ ఫస్ట్ యియర్‌లో ఉన్న ఎండ్లూరి సుధాకర్ నా కవిత్వాన్ని తిలక్ కవిత్వంతో పోలుస్తూ పెద్ద ఉత్తరం రాశాడు. మూడు నాలుగేండ్లలో 700 కాపీలు అమ్ముడుపోయినై. అన్నట్టు 'మిణుగురు' రెండో ముద్రణ (2015) కాపీలు కూడా ఎప్పుడో అయిపోయాయి.

✆ 94410 54637



నెనరు లేని నెమరు

ఒక్కడినే
నీడలు అనేకం
వెంట ఉండేవి తక్కువ
వెంటాడేవి ఎక్కువ
వెనక ముందు నీడల మధ్య
నలిగిపోతున్న
తల నిండా నీడలు
బుస కొడుతున్నాయి
పొదల తల పొంచి ఉంది

జ్ఞాపకం తొంగి చూడగానే
ఓ నీడ వికటాట్టహాసం
వెన్నెల చుట్టుకొని ఉన్న జాబిల్లి.
పడగ విప్పినట్టుంది
కాలం తోక మీద నడుస్తున్న

ఎప్పుడు తల దగ్గరికి వస్తానో ఏమో
భయం భయం
నమ్మకం కుబుసం విడిచిన సత్యం
కాలం మెలికలలో పొద్దు
పడమరకు పాకుతుంది
ఇంతకాలం బతికి చచ్చిన
క్షణమైన చచ్చి బతుకుతే బాగుండు
దేహం గిలిగింతల స్పర్శ కోల్పోయింది
మొద్దుబారిన మొండి రాగిచెట్టు
ఏ తేదీ ఏ తిథీ నాది కాదు
జెంత్రీ నుంచి కాలాన్ని ఎప్పుడో జప్తు చేసుకున్నరు
ఎద్దు పోయిన గంగెద్దన్నీ
దండం పెట్టుకున్న, బొట్టు పెట్టుకున్న ముట్టుకోనసల్లే
నిచ్చెన ఎక్కుదామంటే పండబెట్టి పాడెను చేస్తున్రు
ఇట్లా వచ్చి అట్లా ఎక్కి పోతున్నారు

దేశం నాకు మారుతల్లి
రగతం కారింది లేదు గాయం కనిపించింది లేదు
బాధ కళ్ళని పలకరించిపోతుంది
ఏకాంతం అవుదామంటే
ఒంటరితనం వదలట్లేదు
ఎదకు అంటని రంగులు
మొఖానికి ఎంత పూసుకుంటే ఏంది
ఇగురు తొడగని ఇంట్లో
సెగలు కమ్మి
అగ్గిధారలు కురుస్తుంటే తడుస్తున్న
అటుకులు ఇస్తే ఆ లింగనం చేసుకునేటోడేడి
ఆవుసిస్తే మట్టి ఒక్కటే ఆలింగనం చేసుకుంటుంది.

■ మునాసు వెంకట్
✆ 99481 58163

- రైతుల సమక్షంలోనే ప్రక్రియ పూర్తి
- రబీ సీజన్ నుంచే సరికొత్త మార్గదర్శకాల అమలు
- మూడు జిల్లాల్లో 30 శాతం ల్యాండ్ పార్శిల్స్ నమోదు


బాపట్ల మండల పరిధిలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

పక్కాగా..

ఈ-పంట నమోదు

● అన్నదాతలకు ముందుగా మొబైల్‌లో సందేశం

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

ఈ-క్రాప్.. ఇది రైతులకు అందే వ్యవసాయ ప్రయోజనాల విషయంలో అత్యంత కీలకమైంది. విత్తు నుంచి పంట మద్దతు ధరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునే వరకు ప్రతి దశలోనూ ఈ-పంట నమోదే ప్రామాణికం. కానీ, వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లూ.. ఈ పంట నమోదు పూర్తిగా గాడితప్పింది. సాధారణ సాగు విస్తీర్ణంలో 50 శాతం కూడా నమోదుకు నోచుకోకపోవడంతో రైతుల అగచాట్లు అన్నీఇన్నీ కాదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఈ-పంట నమోదుపై ప్రత్యేక దృష్టి సారించినా.. గతేడాది రెండు సీజన్లలో సాంకేతిక తప్పులతో పాటు అనేక చిక్కులు వెలుగుచూశాయి. సిబ్బంది నిర్లక్ష్యం, గత ప్రభుత్వ తప్పిదాలు వెంటాడుతుండడంతో ఈ ప్రక్రియ లోపభూయిష్టంగానే తయారైంది. ఇన్‌పుట్ సబ్సిడీ మొదలుకుని, మద్దతు ధర లాంటి అనేక ప్రయోజనాలకు కేవలం ఈ-క్రాప్ తప్పుల వల్లే కొందరు దూరంగా ఉంటున్నట్లు గతంలోనే ప్రభుత్వం దృష్టికి వచ్చింది. వీటన్నింటికి విరుగుడుగా ఈ రబీ సీజన్ నుంచే ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను విడుదల చేసింది. దీంతో ఈ-పంట నమోదు అనేది పక్కాగా జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. లాగిన్లకు కొన్ని సాంకేతిక దోషాలు ఎదురవుతున్నాయని.. వాటిని కూడా పరిష్కరించి పూర్తి పారదర్శకంగా ఈ-క్రాప్ ప్రక్రియ పూర్తయ్యేలా చూస్తామని వ్యవసాయశాఖ చెబుతోంది.

రెండుసార్లు అవకాశం

మారిన మార్గదర్శకాల ప్రకారం ఈ-పంట నమోదు రైతు సమక్షంలోనే చేయడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అన్నదాత, సిబ్బంది ఏకకాలంలో పొలం వద్దకు చేరుకున్నాకనే ఈ-క్రాప్ నమోదు మొదలవుతుంది. రైతు సెల్‌ఫోన్‌కు

(మిగతా 7లో)

గతంలో ఈ-పంట నమోదును సిబ్బంది తమ కార్యాలయంలో కూర్చుని ఇష్టారీతిన చేసేవారు. కేవలం గణాంకాల కోసమే అన్నట్లుగా ఈ ప్రక్రియ నడిచేది. దీని వల్ల వాస్తవంగా సాగైన పంటకు, రికార్డుల గణాంకాలకు పొంతన లేకపోవడంతో అనేక చిక్కులు ఉత్పన్నమయ్యేవి. దీనికి తోడు రైతును నామమాత్రం చేస్తూ ఇది నడిచేది. కానీ, మారిన మార్గదర్శకాల ప్రకారం ఈ-పంట నమోదు అనేది రైతు సమక్షంలోనే చేయడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఏ రోజు నమోదు చేస్తామనే సందేశాన్ని ముందుగా అన్నదాతల సెల్‌ఫోన్‌కు సిబ్బంది పంపుతున్నారు. మళ్లీ నమోదు రోజు కూడా రైతుకు కబురు వెళుతుంది. అన్నదాత, సిబ్బంది ఏకకాలంలో పొలం వద్దకు చేరుకున్నాకనే ఈ-క్రాప్ నమోదు మొదలవుతుంది. రైతు సెల్‌ఫోన్‌కు ఓటీపీ పంపడం ద్వారా నమోదును సిబ్బంది నిర్ధారించుకోనున్నారు. దీని వల్ల క్షేత్రస్థాయిలో సాగవుతున్న పంటలతో పాటు, విస్తీర్ణం నమోదులో కూడా తప్పులు దొర్లకుండా ఉండే అవకాశం ఉంది.

డిజిటల్ క్రాప్ సర్వే.. ల్యాండ్ పార్శిల్

కేంద్రం డీసీఎస్(డిజిటల్ క్రాప్ సర్వే)చేపడుతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు అనేది ఆ రికార్డులకు సరిపోలే విధంగా ఉండాలి. సాగు భూమితో పాటు ఖాళీగా ఉన్న భూములను కూడా విధిగా నమోదు చేయడమే ల్యాండ్ పార్శిల్ విధానం. దీనినే కేంద్రం తప్పనిసరిచేసింది. ఒక సెంటు భూమి ఖాళీగా ఉన్నా సరే దానిని ల్యాండ్ పార్శిల్ కిందకు తెచ్చి ఆన్‌లైన్ చేయాల్సిందే. మూడు జిల్లాల పరిధిలో దాదాపు 21 లక్షల వరకు ల్యాండ్ పార్శిల్ చేయాల్సి రావడం ఒక ఎత్తయితే.. సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఆశించినంత వేగంగా ఈ ప్రక్రియ సాగడం లేదన్న విమర్శలున్నాయి.


తెనాలి మార్కెట్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి, జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టీనా


గుంటూరు : టీడీపీ తూర్పు కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు మాణిక్యరావు, ఎమ్మెల్యే నసీర్, డేగల ప్రభాకర్, పోతినేని, మన్నవ తదితరులు

తెలుగువారి గుండెచప్పుడు ఎన్టీఆర్

- జిల్లాలో ఎన్టీఆర్ 30వ వర్ధంతి కార్యక్రమాలు
- ఘన నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, టీడీపీ శ్రేణులు

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 30వ వర్ధంతి కార్యక్రమాలు ఆదివారం గుంటూరు జిల్లా వ్యాప్తంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ స్థాపనే చరిత్ర అని, టీడీపీ ప్రారంభించిన అనతికాలంలోనే ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ పగ్గాలు చేపట్టారని కొనియాడారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. తెలుగు వారి గుండె చప్పుడు ఎన్టీఆర్‌కు జోహార్లు అర్పించారు.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి

చర్లపల్లి - నాగర్‌కోయిల్ అమృత్ భారత్ రైలు

- గుంటూరు మీదగా నడిపేందుకు ప్రతిపాదన
- నెలాఖరున మంజూరయ్యే అవకాశం

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే దక్షిణాది ప్రాంతాలను ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలతో కలుపుతూ పలు అమృత్ భారత్ వీక్లీ రైళ్లను మంజూరు చేసిన రైల్వే శాఖ మరో రైలుని కూడా ప్రకటించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. దీర్ఘకాలంగా ప్రయాణికుల నుంచి డిమాండ్ ఉన్న నాగర్‌కోయిల్(కన్యాకుమారి సమీపంలోని రైల్వేస్టేషన్)కు చర్లపల్లి నుంచి ఒక అమృత్ భారత్ రైలుని నడపాలని భావిస్తున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఈ రైలుని నడికుడి మార్గంలో గుంటూరు మీదగా తొలుత వారానికి ఒక రోజు నడుపుతారు. ఆ తర్వాత ప్రయాణికుల ఆదరణని బట్టి ఫ్రీక్వెన్సీని పెంచుతారు. ఈ రైలు పట్టాలెక్కితే ఇటు చర్లపల్లికి, అటు చెన్నై ఎగ్మోర్‌తో పాటు తమిళనాడు రాష్ట్రంలోని కొన్ని పుణ్య, పర్యాటక క్షేత్రాలకు గుంటూరు ప్రజలకు నేరుగా రైలు కనెక్టివిటీ లభిస్తుంది. 800 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉండే ప్రాంతాలకు కేంద్రం అమృత్ భారత్ స్లీపర్ రైళ్లను నడుపుతోంది. ఇటీవలే న్యూ గుంటూరు మీదగా ఒక అమృత్ భారత్, చీరాల, బాపట్ల, తెనాలి మీదగా మరో నాలుగు రైళ్లను ప్రకటించిన విషయం తెలిసిందే. వాటికి కొనసాగింపుగా చర్లపల్లి - నాగర్‌కోయిల్ అమృత్ భారత్ స్లీపర్ రైలుని కేంద్రం ప్రకటించనుంది. దీనికి సంబంధించిన సమాచారం ఇప్పటికే రైల్వేవర్గాలకు అందింది. ప్రస్తుతం గుంటూరు మీదగా చెన్నై, పుదుచ్చేరి, చెంగల్‌పట్టు, కాట్పాడి, సేలం, కోయంబత్తూరుకు రెగ్యులర్ రైళ్ల కనెక్టివిటీ ఉంది. తిరువణ్ణామలై వంటి ప్రాంతాలకు ప్రత్యేక రైలు సేవలు అందుబాటులో ఉన్నాయి. కన్యాకుమారికి రైలు సర్వీసు లేదు. దీంతో చెన్నైకి వెళ్లి అక్కడి నుంచి వేరే రైలులో ప్రయాణికులు వెళ్తుంటారు. ఈ రైలు నాన్ ఏసీ, కాస్ట్ స్లీపర్, అనరిజర్వ్‌డ్ సర్వీసు.. మొత్తం 22 బోగీలతో పరుగులు పెడుతుంది. ఇందులో రెండు పార్శిల్ వ్యాన్‌లుంటాయి. వేగం విషయానికి వస్తే 110 కిలోమీటర్ల స్పీడుతో ప్రయాణిస్తుంది.

రేటి నుంచి ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ

గుంటూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ సంస్థల 2026-27 వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఈ నెల 20, 22, 23, 27 తేదీల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు సర్కిల్ పరిధిలోని సంగడిగుంట విద్యుత్ భవన్, నల్లచెరువు, తెనాలిలోని చెంచుపేట ఈఈ కార్యాలయాల్లో ఇందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని, అభ్యంతరాలు, అభిప్రాయాలు తెలియజేసేందుకు వినియోగదారులు సంబంధిత వెబ్‌సైట్ లేదా ఆయా కార్యాలయాల్లో ముందుగానే తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

తండ్రిని కొట్టి చంపిన కసాయి

- మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తల్లిదండ్రులపై దాడి
- పక్కింట్లో తలదాచుకున్నా దక్కని ప్రాణం

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని ఓ కసాయి తల్లిదండ్రులపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. కన్నతండ్రిని కిరాతకంగా కొట్టి చంపాడు. రెడ్డిపాలెం మదర్ థెరిస్సా కాలనీలో చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. శేషు బాబు(63)కు, అన్నపూర్ణకు ఇద్దరు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు. వీరి మూడో సంతానం సాయి నాగగణేష్‌కు పల్నాడు జిల్లా జంగమహేశ్వరపురానికి చెందిన లక్ష్మీ తిరుపతమ్మకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. మద్యానికి బానిసైన సాయి నాగగణేష్ నిత్యం డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధించేవాడు. గత శనివారం భార్య లక్ష్మీతిరుపతమ్మను డబ్బుల కోసం వేధించడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో రాత్రి 10 గంటలకు ఇంటికొచ్చిన గణేష్ డబ్బులు ఇవ్వాలని తల్లి అన్నపూర్ణను కొట్టడంతో ఆమె పన్ను విరిగి పోయింది. దీంతో భయపడిన ఆమె పక్కనే ఉన్న కమాల్ బీ ఇంటికెళ్లింది. ఆమె భర్త శేషుబాబు అక్కడికొచ్చి.. తలదాచుకున్నాడు. అనంతరం అర్ధరాత్రి 12 గంటలకు మళ్లీ గణేష్ కమాల్ బీ ఇంటిలోకి వెళ్లి డబ్బులు అడిగాడు. తన దగ్గర లేవని చెప్పడంతో ఆమెను కొట్టాడు. దీంతో తండ్రి శేషుబాబు అడ్డు రాగా.. అతనిని చేతులు, కాళ్లతో కొట్టడంతో కింద పడిపోయాడు. ఆ తర్వాత తండ్రి గుండెల మీద, ముఖంపైన విచక్షణారహితంగా కొట్టి గణేష్ హతమార్చాడు. దీంతో భయపడిన అన్నపూర్ణ పెద్దగా కేకలు వేయడంతో.. స్థానికులు వచ్చేసరికి నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు హత్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు



గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వజ్జా శ్రీనివాసరావును రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ నుంచి ఆదివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. శ్రీనివాసరావు మూడేళ్ల పదవీ కాలంలో కొనసాగనున్నారు. వజ్జా శ్రీనివాసరావు నగరంలోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆర్వీవీఎన్ కళాశాల నుంచి బీకాం డిగ్రీ పూర్తి చేసిన ఆయన.. నాగ్‌పూర్ విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. 1995లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో నమోదయ్యారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో న్యాయవృత్తిని ప్రారంభించిన ఆయన 2001 నుంచి ఏపీ హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. సివిల్, క్రిమినల్, రెవెన్యూ, సర్వీస్, రిట్ జ్యూరిస్డిక్షన్, ఒరిజినల్ జ్యూరిస్డిక్షన్ కేసుల్లో విశేష అనుభవం కలిగి ఉన్నారు. స్పెషల్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పని చేశారు.

సమాచార కమిషనర్‌గా కల్యాణ చక్రవర్తి

గుంటూరు జిల్లా మంగళగిరి ప్రాంతానికి చెందిన వట్టికూటి శరత్‌చంద్ర కల్యాణ చక్రవర్తికి సమాచార కమిషనర్ పదవి లభించింది. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు.

పీపీపీకి ఎన్టీఆర్ బస్టాండ్

- గుంటూరు సమీకృత బస్ టెర్మినల్‌గా పునరాభివృద్ధి
- రూ. 60 కోట్లకు కేంద్రానికి ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆమోదం లభిస్తే డీఎఫ్-బీవోటీ కింద ఏజెన్సీకి కేటాయింపు

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల క్రితం నిర్మించిన గుంటూరు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్‌ని పీపీపీ(పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్) విధానంలో సమీకృత బస్ టెర్మినల్‌గా పునరాభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనని కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖకు నివేదించింది. కేంద్రం నుంచి ఆమోదం లభిస్తే రూ. 60 కోట్లతో డిజైన్ ఫైనాన్స్ - బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ కింద ఏజెన్సీని ఖరారు చేస్తుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్రీ-డీపీఆర్ దశలో ఉంది. ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టు అంశంపై రవాణ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొద్ది రోజుల్లోనే ఇది టెండర్ దశకు చేరుకొంటుందని అధికార వర్గాలు భావిస్తు న్నాయి. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌ని నిర్మించారు. 1990లోనే దీనిని ఆపరేషన్‌లోకి తీసుకొచ్చారు. దాదా పుగా 60 ప్లాట్‌ఫాంల వరకు ఉన్నాయి. నిత్యం 2 వేల వరకు బస్సు సర్వీసులు ఆపరేట్ చేస్తారని అంచనా. గత టీడీపీ ప్రభుత్వంలో విజయవాడ బస్సు సర్వీసుల కోసం ప్రత్యేకంగా నూతన టెర్మినల్‌ని నిర్మించి ఆపరేట్ చేస్తున్నారు. కాగా ఎన్టీఆర్ బస్టాండ్ సరైన ఆలనపాలన లేకుండా పోయింది. డ్రైవర్ల విశ్రాంతి గదుల్లో తగిన సదుపాయాలు లేవు. ఫ్లోరింగ్ దెబ్బతింటోంది. సీసీ టీవీలు వారాల పాటు మొరాయిస్తుంటాయి. అమరావతి రాజధాని నగరం ఉన్న గుంటూరు జిల్లాలోని బస్టాండ్‌లో తగిన సదుపాయాలు లేకపోవడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తోన్నారు. రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బస్టాండ్‌ని పెరిగిన ప్రయాణికుల సంఖ్యకి అనుగుణంగా విస్తరించాల్సి ఉంది. గతంలో బస్టాండ్ ఉన్న ప్రదేశాన్ని కూడా కలిపి అభివృద్ధి చేస్తే వరల్డ్ క్లాస్ బస్టాండ్‌గా మారుతుంది. ఇందుకు రూ. 60 కోట్లకు పైగా ఖర్చు అవుతాయని అంచనా. ఈ నేపథ్యంలో డీఎఫ్-బీవోటీ విధానంలో సమీకృత బస్ టెర్మినల్‌గా పునరాభివృద్ధి చేస్తే నిర్ణీత వ్యవధిలో ఏజెన్సీనే మెయింటెనెన్స్ చూసుకొంటుంది. ఆ తర్వాత ప్రభుత్వానికి బదలాయింపు జరుగుతుంది. కొద్ది రోజుల్లోనే దీనిపై కేంద్రం స్పష్టత ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

శివయ్యను అరగదీసేశారు

- కెమికల్ పూజా ద్రవ్యాలతో పర పరమని రుద్దేశారు
- 2005లో నేను చూసిన శివలింగం వేరు
- కోటప్పకొండలో లోపాలు ఎత్తి చూపిన దేవదాయశాఖ ఆర్జేసీ

నరసరావుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ దేవస్థానంలోని శివలింగాన్ని కెమికల్ పూజా ద్రవ్యాలతో అరగదీసేశారని దేవదాయ శాఖ ఆర్జేసీ చంద్రశేఖర ఆజాద్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 2005లో తాను చూసిన శివయ్య వేరు అంటూ ఆయన చెప్పుకొచ్చారు. కోటప్పకొండ శ్రీ త్రికో టేశ్వర స్వామిని శనివారం ఆజాద్ దర్శించుకొన్నారు. అక్కడ తాను ప్రత్య క్షంగా ఎదుర్కొన్న నిర్వహణ లోపాలను ఎత్తి చూపారు. దేవస్థాన ప్రాంగ ణంలో పర్యటించి, తను గుర్తించిన లోపాలను దేవదాయశాఖ అధికారుల వాట్సాప్ గ్రూప్‌లో ఆయన పోస్టు చేయడం చర్చనీయంశమైంది. దేవస్థానం ఈవో, సహాయ కమిషనర్‌కు తెలియజేసిన సమయం కన్నా.. రెండు గంటలు ముందుగా ఉదయం 9.30 గంటలకి కోటప్పకొండ దేవస్థానానికి వెళ్లానని రాసుకొచ్చారు. ఉచిత ప్రసాదం పంపిణీ అంతంత మాత్రంగానే ఉందని, ప్లాస్టిక్ నిషేధం అమలు కావడం లేదని, అన్న ప్రసాదం పంపిణీలో జాప్యం జరుగుతుందని చెప్పుకొచ్చారు.

నిర్వహణ అస్తవ్యస్తం

ఉదయం 10.30 గంటలకే ఉచిత ప్రసాదం లేదని, గెస్ట్‌హౌస్ వెనక బోలెడంత ప్లాస్టిక్ వ్యర్థాలు పోగుపడినట్లు ఆర్జేసీ తెలిపారు. 11.30 గంటలకి అన్నదానం వద్ద భక్తులు నిరీక్షిస్తున్నా.. 12.30గంటలకు ప్రారంభిస్తామని ఈవో చెప్పినట్లు పేర్కొన్నారు. ఏకవార రుద్రాభిషేకం కోసం తనతో పాటు 15 మంది టికెట్లు తీసుకుంటే.. ఒక అర్చకుడే ఆల్ ఇన్ వన్‌గా అభిషేకాలు చేయడం వల్ల.. బాగా ఆలస్యమైందని దీంతో.. భక్తులు బారు తీరారని తెలిపారు. ముఖ్యంగా భక్తులు తెచ్చిన పాలప్యాకెట్ల కవర్లు, అగరవత్తుల అట్టపెట్టెలు, నెయ్యి సాచెట్లు ఇలా ప్లాస్టిక్ కవర్ల గుట్ట గర్భాలయంలో పోగయ్యిందన్నారు. ముందుగానే కవర్లను తొలగించి..గర్భాలయంలోకి తీసుకెళ్లే పరిస్థితి అక్కడ లేదన్నారు. మరీ ముఖ్యంగా అర్చకుడు శివలింగాన్ని అభిషేకం పేరుతో అన్ని కెమికల్ పూజా ద్రవ్యాలతో పరపరమని రుద్దేశారని, తాను 2005లో చూసిన శివయ్య వేరు.. 2026లో ఇప్పుడు చూసిన శివయ్య వేరు అంటూ ఆజాద్ రాసుకొచ్చారు. భక్తుల


కోటప్పకొండ దేవస్థానం

సంతృప్తి పేరుతో స్వామిని అరగదీసేశారని పేర్కొన్నారు. సర్కారీ సేవలప్పుడే తగు మాత్రంగా దేవస్థానం స్వచ్ఛమైన వస్తువులు వాడాలని, మిగిలిన అన్ని అభిషేకాలకు శుద్ధ జలం మాత్రమే వాడాలని ఎన్నిసార్లు కమిషనర్ ఆదేశించిన ఈవో తనకు తెలియదంటు న్నారని తెలిపారు. మార్కాపురంలో ఉంటున్న ఈవో ఉదయం 10.30 గంటలకు ఆలయానికి వచ్చారని, తను వద్దని వారిస్తున్నా ఆశీర్వచనం పేరుతో.. స్వామి వారి మెడలోని పూలమాల తనకు వేశారన్నారు. ఆ దండకు అంటుకుని ఉన్న తడి పసుపు, విభూతి, కుంకుమ అన్ని తన తెల్ల చొక్కాకు అంటుకున్నాయని ఆర్జేసీ చెప్పుకొచ్చారు. ప్రతి దానికీ ఏదో ఒక దాటవేత సమాధానానికి ఈఓ అలవాటు పడ్డారన్నారు. ప్రధాన కార్యాలయం తనను ఒక్క అడుగు కూడా ముందుకు వేయనివ్వడం లేదనే భావనలో ఈవో బతికేస్తున్నారని వాట్సాప్ గ్రూపులో తన అనుభవాన్ని రాసుకొచ్చారు. అయితే ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్ ఏ దేవస్థానానికి వెళ్లినా అక్కడి లోపాలను గుర్తించి, వాటిని ప్రస్తావిస్తారని దేవదాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఘనంగా ముగిసిన సరస్ మేళా

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- స్వరాష్ట్రాలకు డ్వాక్రా, హస్త కళాకారులు

గుంటూరులోని నల్లపాడు రోడ్డులో ఉన్న రెడ్డి కళాశాల ఎదుట ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సరస్ మేళా ఆదివారంతో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మేళా ముగింపుతో.. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన హస్తకళాకారులు, చేనేత వృత్తిదారులు, డ్వాక్రా మహిళలు తిరుగు పయనమయ్యారు. వారిని జిల్లా అధికారులు క్షేమంగా సాగనంపారు. సరస్ మేళా వేదికపై కేరళ కథక్, పరివాడ, కశ్మీరి, అరకు థీంసా నృత్యాలు, షణ్ముఖ బృందం అగ్ని ఘటాల కోలాటం, రేష్మా బృందం రాక్ ఫోక్ డాన్స్, విజయనగరం జిల్లా కళాకారులు చెక్కభజన, కోలాట ప్రదర్శనలు ఇతర నృత్యాలు అద్భుతంగా ప్రదర్శించారు.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి





దిక్సూచి

ఇంటర్‌లో ఎంఈసీ తీసుకుంటాం, ఆపై సీఏ చేస్తాం అంటున్నారు ఇప్పటి యువతలో కొందరు. తరవాత కొద్ది రోజులకు అడిగితే సీఎంఏ(కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్) ఫౌండేషన్ కూడా రాశామని చెబుతుంటారు మళ్లీ వారిలో కొందరు. అసలు ఈ సీఎంఏ అంటే ఏమిటి, దీని ప్రాధాన్యం ఏమిటో ఈ కోర్సును ఆఫర్ చేసే ఐసీఎంఏఐ(ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా) సదరన్ రీజియన్ ట్రెజరర్ కేవీఎన్ లావణ్య వివరించారు. ఎలక్ట్రానిక్స్‌లో బీటెక్ చేసిన ఈమె కొంత కాలం ఐటీ కంపెనీలో చేశారు. ఇంకో విషయం, బీటెక్ చేస్తూనే మరో వైపు సీఎంఏ కూడా పూర్తి చేసిన ఘనత ఈమె సొంతం. బ్రిటన్‌కు చెందిన ఏసీసీఏ కూడా చేసిన ఈమె ఐసీఎంఏఐకి హైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం అదే సంస్థ సదరన్ రీజియన్ కమిటీలో ట్రెజరర్‌గా ఉన్నారు. ఇంతకీ సీఎంఏ గురించి ఆమె ఏమి చెబుతున్నారో చూద్దాం.



ఒక వస్తువు ఉత్పత్తికి ఎంత ఖర్చయిందో కచ్చితంగా తెలిస్తే, ఆపై ఎంత లాభం పొందాలి, కలకాలం ఆ వస్తూత్పత్తికి ఆటంకం కలుగకుండా ఉండేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన కలుగుతుంది. ఒక ఉత్పత్తి సంస్థకు సంబంధించి మొత్తం వ్యయం ఒక ఎత్తు. ప్రత్యేకించి ఒక వస్తువు ఉత్పత్తికి చేస్తున్న ఖర్చు మరో ఎత్తు. ముడి సరుకు నుంచి వస్తురూపం సంతరించుకునే వరకు ఎక్కడెక్కడ ఎంత మొత్తం అవుతుందో కచ్చితంగా తెలిస్తే, వాటిలోనుంచి ఏ స్థాయిలో ఖర్చులను తగ్గించుకోవడం లేదంటే అవసరాన్ని బట్టి పెంచుకోవడాన్ని నిర్ణయించుకోవచ్చు. ఇప్పుడు కొన్ని ఉదాహరణలతో సీఎంఏ పని తీరుతెలియజేస్తాను. అప్పుడు ఈ కోర్సుకు ఉన్న ప్రాముఖ్యం అర్థమవుతుంది.

విలువను లెక్కకట్టే సీఎంఏ కీలకం

ఎక్స్‌పర్ట్ వాయిస్

● వ్యయాల లెక్కలు - ఆడిట్‌లో సీఎంఏది వ్యూహాత్మక పాత్ర. దీని ద్వారా లాభాలు, ధరలకు తోడు ప్రజాప్రయోజనాన్ని సీఎంఏ పరిరక్షించగలుగుతారు. మార్కెట్లో వివిధ బ్రాండ్లు పోటీపడతుంటాయి. కేవలం ఆదాయం పెంపు మాత్రమే కాదు, ఖర్చు తగ్గించినా అది ఒక కంపెనీకి లాభాలు తెచ్చిపెట్టడమే కాదు, ఉద్యోగులకు, వాటాదారులకు, ప్రభుత్వానికి కూడా ఉపయోగపడుతుంది.

● ఖర్చుల వ్యవస్థ రూపకల్పన. ఉదాహరణకు ఒక ఆటోమోబైల్ సంస్థలో 120 వేరియంట్లు ఉత్పత్తి అవుతున్నాయని అనుకుందాం. సంప్రదాయ అబ్జార్షన్ కాస్టింగ్‌కు బదులు యాక్టివిటీ ఆధారిత ఖర్చుల విధానాన్ని సీఎంఏ ప్రవేశపెడతారు. మెషీన్ సెటప్, క్వాలిటీ ఇన్‌స్పెక్షన్, మెటీరియల్ హ్యాండ్లింగ్‌ను విశ్లేస్తారు. అప్పుడు మొత్తం ఉత్పత్తుల్లో వేటితో నష్టం కలుగుతోందో కూడా తెలుస్తుంది. వాటిని నిలిపివేయడానికి అవకాశం కలుగుతుంది. తద్వారా మొత్తం ప్రక్రియను ఆపివేయాల్సిన అవసరం ఉండదు. వ్యయాలను తగ్గించుకునే వెసులుబాటుకు తోడు లాభార్జనకు అవకాశం కలుగుతుంది.

● ఉత్పత్తిలో భాగంగా వివిధ ప్రక్రియల మధ్య ఖర్చుల విశ్లేషణ, దిగుబడి నియంత్రణ మరొకటి. ఉదాహరణకు రిఫైనరీలో ప్రాసెస్ ప్రక్రియల్లో ఎక్కడెక్కడ నష్టం వస్తుందన్నది తేలుస్తారు. ఔట్‌డేటెడ్ టెంపరేచర్ కంట్రోల్‌తో చార్జీలను తగ్గించుకోవచ్చు. వ్యయాలను నియంత్రించుకుని లాభాల బాట పట్టవచ్చు.

● సామర్థ్య మార్పుల సమయంలో ఖర్చుల ప్రవర్త విశ్లేషణ మరొకటి. ఇక్కడ స్థిర, అస్థిర వ్యయాలను వేరు చేస్తారు. ఉదాహరణకు ఒక స్టీల్‌ప్లాంట్ 65 శాతం కెపాసిటీతో పని చేస్తే ఖర్చు ఎక్కువగా ఉంటుంది. అదే కెపాసిటీని 85 శాతానికి పెంచితే ఖర్చు తగ్గుతుంది. అంటే ఖర్చు తగ్గింపుదారుడే కాదు, ఒక సీఎంఏ విలువల పరిరక్షకుడు కూడా.

● టెలికాం కంపెనీల నుంచి పలు సంస్థల్లో వృథా ఖర్చులను తగ్గించడంలో సీఎంఏలు కీలకపాత్ర పోషిస్తున్నారు. సంక్లిష్ట సరఫరా గొలుసులతో మొదలుకుని తరచూ మారే ఇంధన ధరల వరకు కఠిన నియంత్రణలు పాటించి వాటికి స్థిర లాభదాయికతను సమకూర్చడంలో సీఎంఏ మౌనశిల్పిలా వ్యవహరిస్తారు. వనరులను గరిష్ఠంగా వినియోగించడమే కాకుండా అదే స్థాయిలో లాభాలు తద్వారా వ్యాపార సముదాయాలు పది కాలాల పాటు నిలదొక్కుకేందుకు సీఎంఏ తనదైన పాత్ర పోషిస్తారు.

● సీఎంఏ పాత్రను ఎంత బాగా అర్థం చేసుకుంటే అంత ఆసక్తికరంగా ఈ ప్రొఫెషన్ ఉంటుంది. కంపెనీ లేదంటే ఒక వ్యవస్థ అప్పజెప్పిన పనిని సమర్థంగా పూర్తి చేసి, ప్రయోజనాలను వారికి చూపించడమే కాదు, ఆత్మసంతృప్తికి వీలు కల్పించే ప్రొఫెషన్ ఇది అని చెప్పగలను. కామర్స్ రంగంవైపు ఆసక్తిని కనబరిచే యువతకు ఇది మంచి ఆప్షన్. దీనిపై ఎంత అవగాహన పెంచుకుంటే అంతే స్థాయిలో ఈ కోర్సు వైపు మొగ్గు చూపవచ్చు.



సత్యజిత్ రే లో పీజీ

సినిమాలో విద్యకు సంబంధించి దేశంలోనే రెండో ప్రముఖ విద్యాసంస్థ సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్(ఎస్ఆర్ఎఫ్‌టీఐ). 1995 ఏర్పాటైన ఈ సంస్థకు స్వతంత్రప్రతిపత్తి ఉంది. ప్రస్తుతం ఈ సంస్థ పీజీ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

● మూడేళ్ల కాలవ్యవధి(ఒక ఏడాది బ్రిడ్జ్ ప్రోగ్రామ్‌తో కలిసి) కలిగిన మాస్టర్స్ సినిమా కోర్సుల్లో ఆరు స్పెషలైజేషన్లు - డైరెక్షన్ అండ్ స్క్రీన్‌ప్లే రైటింగ్, ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ, సౌండ్ రికార్డింగ్ అండ్ డిజైన్, ప్రొడ్యూసింగ్ ఫర్ ఫిల్మ్ అండ్ టెలివిజన్, యానిమేషన్ సినిమా ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్‌లో 12 సీట్లు ఉన్నాయి.

● రెండేళ్ల కాలవ్యవధి కలిగిన ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా(ఈడీఎం) మాస్టర్స్ కోర్సులు కూడా ఆరు స్పెషైజేషన్లు- మేనేజ్‌మెంట్, రైటింగ్, డైరక్షన్ అండ్ ప్రొడ్యూసింగ్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, సౌండ్‌లో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్‌లో 7 సీట్లు ఉన్నాయి.

ఇటానగర్ క్యాంపస్‌లో కోర్సులు: దీని ప్రాస్పెక్టస్ వేరుగా విడుదలైంది. ఇక్కడ అందించే రెండేళ్ల పీజీ డిప్లొమా కోర్సులు - స్క్రీన్ యాక్టింగ్(20 సీట్లు), స్క్రీన్‌రైటింగ్(20 సీట్లు), డాక్యుమెంటరీ సినిమా(10 సీట్లు) ఉన్నాయి.

ఎంపిక: మొదటి దశలో 100 మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. జనరల్ అప్టిట్యూడ్, కామన్ సబ్జెక్ట్ ఏరియా నుంచి చెరి 50 మార్కులకు మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. రెండో దశలో 100 మార్కులకు అసెస్‌మెంట్ - రాత/ ప్రాక్టికల్/ ఇంటరాక్షన్ టెస్ట్ ఉంటుంది. రాత, ప్రాక్టికల్ రెండూ కూడా ఉండొచ్చు.


అర్హత: ఏదైనా డిసిప్లిన్‌లో డిగ్రీ ఉత్తీర్ణత

రాత పరీక్ష: ఫిబ్రవరి 22(హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో జరుగుతుంది)

దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 4

వెబ్‌సైట్: https://srfti.ac.in/, https://srfti.ac.in/postgraduateprogramme-satftiar/#

జాబ్ కార్నర్



ఇండియన్ ఆర్మీలో షార్ట్ సర్వీస్ కమిషన్(టెక్) కోర్సు

ఇండియన్ ఆర్మీ - షార్ట్ సర్వీస్ కమిషన్(టెక్) కోర్సులో చేరేందుకు అర్హులైన ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: 350(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకానికల్, ప్లాస్టిక్ తదితర ఇంజనీరింగ్ విభాగాలు

అర్హత: బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులు. ఇంజనీరింగ్ డిగ్రీ ఆఖరు ఏడాది చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులే.

ఎంపిక: షార్ట్‌లిస్టింగ్, డిగ్రీలో మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 5

వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

ఇండియన్ నేవీలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్స్

ఇండియన్ నేవల్ అకాడమీ(కేరళ రాష్ట్రం ఎజిమల) 260 షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ఆఫీసర్ ఉద్యోగాలకు దరఖాస్తులు కోరుతోంది. అవివాహితులైన మహిళలు, పురుషులు అర్హులు. ఎంపికైన వారికి 2027 జనవరి నుంచి శిక్షణ ఆరంభమవుతుంది.

పోస్టులు: ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్(జీఎస్(ఎక్స్)/ హైడ్రో కేడర్) - 76, పైలట్ -25, నేవల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్(అబ్జర్వర్స్) -20, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ - 18, లాజిస్టిక్స్ - 10, ఎడ్యుకేషన్ - 15, ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్) - 42, సబ్‌మెరైన్ టెక్ ఇంజనీరింగ్ - 08, ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్) - 38, సబ్‌మెరైన్ టెక్ ఎలక్ట్రికల్ - 08

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్‌లో డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణత **ఎంపిక:** అర్హత పరీక్షలో సాధించిన మార్కులు, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 24

వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in/

రైల్వేలో స్పోర్ట్స్ కోటా

రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ - సౌత్ ఈస్ట్రన్ రైల్వే - స్పోర్ట్స్ కోటాలో పోస్టుల భర్తీకి అర్హులైన మహిళ, పురుష క్రీడాకారుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: గ్రూప్-సి(లెవెల్ 4, లెవెల్ 5) 5, గ్రూప్-సి(లెవెల్ 2, లెవెల్ 4) 16, గ్రూప్-డి(లెవెల్ 1) 33

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, ఇంటర్, పది, ఐటీఐ ఉత్తీర్ణులు

క్రీడాంశాలు: అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, క్రికెట్, వాలీబాల్ తదితరాలు

ఎంపిక: విద్యార్హత, క్రీడల్లో సాధించిన విజయాలు, సంబంధిత డాక్యుమెంట్ వెరిఫికేషన్ అధారంగా

దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 9

వెబ్‌సైట్: www.rrcser.co.in

నాల్కోలో ఇంజనీర్ ట్రైనీ

ఒడిషా రాష్ట్రం, భువనేశ్వర్‌లోని నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(నాల్కో) 110 గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

వివరాలు: మెకానికల్ ఇంజనీరింగ్ 59, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 27, కెమికల్ ఇంజనీరింగ్ 24

అర్హత: కనీసం 65 శాతం మార్కులతో సంబంధిత డిసిప్లెయిన్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత

ఎంపిక: గేట్ 2025 స్కోర్, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాలు

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 22

వెబ్‌సైట్: www.nalcaindia.com

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మోహన్‌లాల్ కొత్త చిత్రం



మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ ప్రముఖ దర్శకుడు దిలీష్ పోతన్ కాంబినేషన్‌లో తొలిసారిగా ఓ చిత్రం రూపుదిద్దుకోబోతోంది. ఈ కొత్త సినిమా ఈ ఏడాది లోనే ప్రారంభం కానుంది. ఆశిర్వాద్ సినిమాస్ పతాకంపై ఆంటోని పెరంబవూర్ నిర్మించనున్నారు. 'మహేషింటే ప్రతీకారం', 'తొండిముతలం ద్రిక్సాక్షియుం' వంటి చిత్రాలతో తనదైన శైలిలో వాస్తవికాంశాలను తెరకెక్కించిన దిలీష్ పోతన్‌కి ఈ ప్రాజెక్టు ప్రతిష్ఠాత్మకం కానుంది. మోహన్ లాల్ ఇటీవలె 'కథనార్', 'ఖలీఫా' చిత్రాల షూటింగ్‌ను పూర్తి చేసుకొని సిడ్నీ వెళ్లారు. సిడ్నీ నుంచి రాగానే తరుణ్ మూర్తి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఇందులో మోహన్‌లాల్, మీరా జాస్మిన్ జంటగా నటిస్తున్నారు. యాక్షన్ ఫాంటసీ డ్రామాగా తెరకెక్కనున్న ఈ చిత్రం పూర్తి వివరాలను చిత్రబృందం త్వరలోనే వెల్లడించనుంది.

'పార్వతి పాల్ రావు' పరిచయం



బాలీవుడ్ నటులు రాజ్‌కుమార్ రావు, పత్రలేఖ దంపతులు గతేడాది తల్లిదండ్రులైన విషయం తెలిసిందే. 2025 నవంబరు 15న పత్రలేఖ పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చారు. తాజాగా ఆ చిన్నారికి 'పార్వతి పాల్ రావు' అని నామకరణం చేశారు. ఈ మేరకు వారు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు పెట్టారు. చిన్నారి చేతులను ఆ జంట తమ రెండు హస్తాలతో పదిలంగా పట్టుకున్న ఫొటోను పంచుకున్నారు. 'ముకుళిత హస్తాలతో, నిండిన హృదయాలతో మా అతిపెద్ద ఆశీర్వాదం పార్వతి పాల్ రావుని మీకు పరిచయం చేస్తున్నాం' అని క్యాప్షన్ పెట్టారు. అభిమానులు, శ్రేయోభిలాషులు తమ కుమార్తెను ఆశీర్వదించాలని కోరారు. పార్వతి హిందువుల ఆరాధ్య దైవం శివుడి భార్య పేరు కాగా, పత్రలేఖ, రాజ్‌కుమార్ రావు కుటుంబాల ఇంటి పేర్లను పాల్, రావు అనే పదాలు సూచిస్తున్నాయి.



పెళ్లి ప్రసక్తే లేదు

ధనుష్‌తో పెళ్లి వార్తలపై మృణాళ్ వివరణ



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్‌తో మృణాళ్ ఠాకూర్ పెళ్లి ఖరారు అయిందని, ఫిబ్రవరి 14 వీరిద్దరూ పెళ్లి పీటలు ఎక్కబోతున్నారనే ఊహాగానాలు సామాజిక మాధ్యమాల్లో కొంత కాలంగా వైరల్ అవుతోన్న విషయం తెలిసిందే. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే వార్తలు ఏడాది క్రితమే ప్రచారంలోకి వచ్చినా, వారు ఈ వార్తలను ధృవీకరించడం గానీ, ఖండించడం గానీ చేయలేదు. అప్పటి నుంచి వీరి రిలేషన్‌షిప్‌పై వార్తలు రావడం పరిపాటిగా మారింది. గతంలో ధనుష్ హాజరైన కొన్ని బాలీవుడ్ పార్టీలలో మృణాళ్ కనిపించడం, అలాగే ఆమె నటించిన 'సన్నాఫ్ సర్దార్ 2' సినిమా వేడుకకు ధనుష్ హాజరవడం వంటి సంఘటనలు ఈ ఊహాగానాలకు తెర తీశాయి. అయితే తాజాగా తన పెళ్లి వార్తలపై స్పష్టత నిచ్చారు మృణాళ్ ఠాకూర్. 'వచ్చే నెలలో మృణాళ్ ధనుష్‌ను వివాహం చేసుకుంటున్నారన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ఆమె ప్రస్తుతం సినిమాలపై పూర్తి శ్రద్ధ పెట్టారు. ఫిబ్రవరి 20న మృణాళ్ నటించిన బాలీవుడ్ సినిమా 'దో దివానే షెహర్ మే' విడుదలవుతోంది. మార్చిలో అడివి శేష్‌తో కలసి నటిస్తున్న తెలుగు చిత్రం 'డెకాయిట్' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇంత బిజీ షెడ్యూల్ మధ్య ఆమె పెళ్లి ప్రసక్తే లేదు. అవన్నీ కేవలం ఊహాగానాలే' అని ఆమె పీఆర్ బృందం స్పష్టం చేసింది.

'మైలే... వినండి, మీకు నచ్చిందో లేదో చెప్పండి'



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్ ఇటీవల హిందీ చిత్రపరిశ్రమపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఈ వివాదాల నడుమ ఆయన ప్రభుదేవా నటిస్తున్న 'మూన్‌వాక్' చిత్రం నుంచి 'మైలే' అనే కొత్త పాటను విడుదల చేశారు. మనోజ్ నిర్మల శ్రీధరన్ దర్శకత్వంలో సంగీతం, డ్యాన్స్, కామెడీ కలగలసిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమా నుంచి రెండో సింగిల్ అయిన 'మైలే' పాటను రెహమాన్ విడుదల చేశారు. 'మైలే... వినండి, మీకు నచ్చిందో లేదోచెప్పండి' అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. విష్ణు ఎడవన్ సాహిత్యం అందించిన ఈ పాటను జోయల్ జో ఆలపించారు. కష్టాలను మర్చిపోయి, ధైర్యంగా చిరునవ్వుతో ముందుకు సాగాలని చెప్పే హుషారైన గీతం ఇదని చిత్రబృందం పేర్కొంది.

25 ఏళ్ల తర్వాత క్రేజీ కాంబినేషన్

'ఊర్వశి ఊర్వశి', 'ముకాబ్లా' లాంటి సూపర్‌హిట్ గీతాలతో అలరించిన ప్రభుదేవా-రెహమాన్ కాంబినేషన్ 25 ఏళ్ల తర్వాత ఈ సినిమాతో మళ్లీ ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఇందులో ప్రభుదేవా గొప్ప డ్యాన్సర్‌గా కనిపించనుండగా, రెహమాన్ కూడా ఒక ప్రత్యేక పాత్రలో (ఓ కోపిష్టి దర్శకుడిగా) సందడి చేయనున్నారు. గతంలో 'వందేమాతరం' వంటి ఆల్బమ్స్‌లోనూ, కొన్ని సినిమాల్లోని పాటల్లోనూ ఆయన కనిపించినప్పటికీ ఒక సినిమాలో పాత్రను పోషించడం, నటించడం మాత్రం రెహమాన్ కెరీర్‌లో ఇదే తొలిసారి కావడం విశేషం. మేలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఎన్టీఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

● 30వ వర్ధంతి సందర్భంగా చిత్ర పరిశ్రమ నివాళి



నందమూరి తారకరామారావు 30వ వర్ధంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ దైవ సన్నిధానం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు నివాళులర్పించారు. తెలుగు సినిమా చరిత్రలో ఎన్టీఆర్‌ది ఎప్పటికీ నంబర్ వన్ స్థానం అని సీనియర్ నిర్మాత కాజా సూర్యనారాయణ కొనియాడారు. తెలుగు జాతి ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపజేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని మాదాల రవి అన్నారు. సినిమాల్లోనూ, రాజకీయాల్లోనూ ఎన్టీఆర్ చూపిన తెగువ, ధైర్యాన్ని ఈ తరం ఆదర్శంగా తీసుకోవాలని నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ సూచించారు. ఎన్టీఆర్ మనల్ని విడిచి 3 దశాబ్దాలు అవుతున్నా ఇప్పటికీ ఆయన సజీవంగా మన మధ్యే ఉన్నట్లు అనిపిస్తుందని రచయిత పరుచూరి గోపాలకృష్ణ చెప్పారు. తెలుగు జాతి ఉనికిని ప్రపంచవ్యాప్తంగా చాటిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని దర్శకుడు వైవీఎస్ చౌదరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నందమూరి జానకీరామ్ సతీమణి దీపిక పాల్గొని ఎన్టీఆర్‌తో అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

రూ. 84 కోట్లు పరిహారంగా ఇప్పించండి

హీరో ధనుష్, దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'తేరే ఇష్క్ మే' సినిమా న్యాయపరమైన చిక్కుల్లో పడింది. ప్రముఖ నిర్మాణసంస్థ ఈరోస్ ఇంటర్నేషనల్ ఆనంద్ ఎల్.రాయ్‌కి చెందిన కలర్ ఎల్లో ప్రొడక్షన్స్‌పై బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తమ అనుమతి లేకుండా, తమకు చెందిన 'రాంఝానా' చిత్రంలోని పాత్రలు, కథా నేపథ్యాన్ని 'తేరే ఇష్క్ మే' చిత్రంలో ఉపయోగించడం ద్వారా ఆనంద్ ఎల్ రాయ్ కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘించారని ఈరోస్ ఆరోపించింది. కాపీరైట్ ఒప్పందాల ఉల్లంఘన కింద తమకు రూ. 84 కోట్ల నష్టపరిహారం ఇప్పించాలని న్యాయస్థానాన్ని కోరింది. ధనుష్, ఆనంద్ ఎల్. రాయ్ కాంబినేషన్‌లో వచ్చిన 'తేరే ఇష్క్ మే' చిత్రం 'రాంఝానా' చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కించినట్లు ప్రచార కార్యక్రమాల్లో ఆనంద్ ఎల్ రాయ్ చెప్పారు. దీంతో 'రాంఝానా' చిత్రాన్ని నిర్మించిన ఈరోస్ ఈ వ్యాఖ్యలపై అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది.

ఇది పల్నాడు యాక్షన్



క్రేజీ కింగ్స్ స్టూడియోస్ ఎల్ఎల్‌పి పతాకంపై రోహిత్ వర్మ హీరోగా గోవింద రెడ్డి చందా దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రానికి 'పల్నాడు' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా చిత్రబృందం టైటిల్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఎగిరే నిప్పురవ్వల నేపథ్యంలో చేతిలో మండుతున్న కర్రను పట్టుకొన్న రోహిత్‌వర్మ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఈ పోస్టర్‌ను బట్టి భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోన్నట్లు తెలుస్తోంది. రోహిత్‌వర్మకు జోడీగా రియా సుమన్ నటిస్తున్నారు. వినోద్‌కుమార్, దేవి ప్రసాద్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. మణిశర్మ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రవికుమార్ వి. ఎడిటర్: చోటా కే ప్రసాద్.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

గుంటూరు సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్)కు భారతరత్న ప్రదానం చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా ఆదివారం గుంటూరు అమరావతి రోడ్డులోని చిల్లీస్ డాబా సెంటర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎన్టీఆర్ దార్శనిక నాయకత్వం, కళా ప్రతిభ, తెలుగు ప్రజల పట్ల చూపిన అంకితభావానికి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆయనకు భారతరత్న ప్రకటించాలని వీరాంజనేయులు కోరారు.

ప్రశాంతంగా టైపు రైటింగ్ పరీక్షలు

● 200 మందికి పైగా విద్యార్థుల హాజరు


టైప్ రైటింగ్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

గుంటూరు (విద్య), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యాశాఖ త్వరలో నిర్వహించే హైస్పైటింగ్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ముందస్తు (ప్రీ టెక్నికల్) పరీక్షలు ఆదివారం నిర్వహించారు. స్థానిక ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఈ పరీక్షలు జరిగాయి. గుంటూరు సెంటర్ టైప్, షార్ట్ హ్యాండ్ అండ్ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలకు మొత్తం 202 మంది విద్యార్థులు హాజరయినట్లు సంఘ గౌరవ అధ్యక్షుడు సాంబశివరావు, అధ్యక్షుడు శ్రీనివాస్ సింగ్, కార్యదర్శి శ్రీనివాసరావు, కృష్ణ, ప్రకాష్ బాబు వెల్లడించారు. టైపు రైటింగ్ ఇన్‌స్టిట్యూట్ల ప్రిన్సిపాళ్లు పరీక్షల్ని పరివేక్షించారు.

పొగ మంచు తెచ్చిన తంటా

● దారి కనబడక గోడకు ఢీకొన్న సీఐ కారు

● గాయాలతో చికిత్స పొందుతున్న వేమూరు సీఐ


సీఐ వీరాంజనేయులు

వేమూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పొగ మంచుతో దారి కనబడక వేమూరు సీఐ వీరాంజనేయులు కారు గోడకు ఢీకొంది. ఈ ప్రమాదంలో సీఐ గాయపడగా ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. చుండూరు మండలం కేఎన్‌పల్లిలో జరిగిన గొడవల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం సీఐ కారులో స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ బయలుదేరారు. ఈ క్రమంలో వేమూరు మండలం పెరవలిపాలెం గ్రామంలో పూర్తిగా పొగమంచు కమ్ముకోవడం వల్ల దారి కనబడక జగజ్జీవన్‌రామ్ విగ్రహం సమీపంలోని ఇంటి గోడకు కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సీఐ తీవ్రంగా గాయపడ్డాడు. సీఐను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. సీఐ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబుకు సమాచారం తెలియడంతో ఆదివారం ఆయన సీఐతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం ఆదివారం 552.70 అడుగులు ఉంది. ఇది 215.76 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7,528 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7,110 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 7,347 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,200 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 24,485 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లోగా 24,485 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

అట్టహాసంగా ఎడ్ల పందేలు ప్రారంభం

● జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

● చిలకలూరిపేటలో ఆరు రోజుల పాటు జరగనున్న పోటీలు


ఎడ్ల పందేలు ప్రారంభం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గొట్టిపాటి, లావు, ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో ఆరు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి ఎడ్ల పందేలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక గోల్కొండ గార్డెన్స్‌లో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఎడ్ల పందేలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, ఎడ్ల పెంపకం అనేది చాలా ఖర్చుతో కూడుకున్నదని, ఎన్ని ఇబ్బందులున్నా తెలుగుజాతి సంస్కృతి సంప్రదాయాల్లో భాగమైన పశుపోషణ, ఎడ్ల పందేలను కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోనే ఎక్కువగా నిర్వహిస్తుంటారని అన్నారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక ప్రజోపయోగ కార్యక్రమాలు చేపడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు రైతాంగం కోసం ఎడ్ల పందేలు నిర్వహించడం తనకెంతో సంతోషాన్నిచ్చిందని ఆయన చెప్పారు. అనంతరం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ, ఎడ్ల పందేలకు మరింత ప్రాచుర్యం, ప్రాధాన్యం దక్కేలా తనవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఒంగోలు జాతి ఎద్దు అంతరించిపోకుండా కాపాడుతున్న ప్రతి ఒక్కరికీ ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ, ఎడ్ల పందేల నిర్వహణలో చిలకలూరిపేటకు రాష్ట్రస్థాయిలో మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని అన్నారు. పశువుల పెంపకం, ముఖ్యంగా ఎడ్ల పోషణ, వాటి బలప్రదర్శన పోటీలంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఎంతో మక్కువన్నారు. గతంలో ఎడ్ల పందేలపై నిషేధం కోరుతూ కొందరు కోర్టులను ఆశ్రయించి, వాటిని నిలిపివేయించారన్నారు. రైతులు అమితంగా ఇష్టపడే పోటీల నిలుపుదలను సవాల్ చేస్తూ, తాను వ్యవసాయమంత్రిగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు, సహకారంతో ఎడ్ల పందేలను తిరిగి కొనసాగించేలా కృషి చేసినట్టు తెలిపారు.

ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్ల సందర్శన

ఎడ్ల పందేలు జరుగుతున్న ప్రాంగణంలో వివిధ సంస్థల వారు ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి గొట్టిపాటి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి సందర్శించారు. సుగాలీకాలనీ అర్బన్ పీహెచ్‌సీ వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని, సంచార పశు వైద్యశాలను వారు ప్రారంభించారు. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే ఎన్టీఆర్ విగ్రహంతో ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌పై ఎక్కి సభాప్రాంగణమంతా కలియ తిరిగి ప్రజలకు అభివాదం చేశారు. ప్రాంగణంలో నిర్మించిన భారీ విద్యుత్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాలపళ్ల సైజు విభాగంలో ఎడ్ల పందేలు ప్రారంభం అయ్యాయి. కార్యక్రమంలో పందేల ప్రధాన పర్యవేక్షకుడు యలం సాంబశివరావు, జీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, నిర్వాహక కమిటీ సభ్యులు తెలప్రోలు వీరయ్య చౌదరి, పేర్ని వీర నారాయణ, తేళ్ళ సుబ్బారావు, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, జిల్లా టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు మద్దూరి వీరారెడ్డి, జవ్వాజి మదన్ మోహన్, ముద్దన నాగేశ్వరరావు, తుబాటి శ్రీహరి, ఇనగంటి జగదీష్, కందిమళ్ళ అంజిబాబు పాల్గొన్నారు.

సరస్ మేళా గొప్ప స్ఫూర్తి నింపింది

● ముగింపు వేడుకల్లో కలెక్టర్ అన్సారియా


సరస్ మేళాలో ప్రసంగిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా చిత్రంలో జేసీ అశుతోష్ ముఖర్జీ తదితరులు

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సరస్ మేళా గొప్ప స్ఫూర్తిని నింపిందని గుంటూరు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. సరస్ మేళా ముగింపు కార్యక్రమం ఆదివారం నల్లపాడు రోడ్డులోని రెడ్డి కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, మాట్లాడుతూ.. గుంటూరులో సరస్ మినీ ఇండియాగా కొనసాగిందన్నారు. ఎంత పెద్ద కార్యక్రమమైన టీమ్ స్పిరిట్‌తో విజయవంతం చేయగలమనే విశ్వాసం, నమ్మకం అందరిలో కలిగిందన్నారు. 343 ప్రదర్శన శాలలు ఏర్పాటు చేసి రూ. 25 కోట్లు పైగా విక్రయాలు చేశారని వెల్లడించారు. కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కృషి ఫలితంగా గుంటూరులో సరస్ జరిగిందని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, జాతీయ పేదరిక నిర్మూలన విభాగం అధికారులు మంచి సహకారాన్ని అందించారన్నారు. విమెన్ ఫ్రెండ్లీగా ఉండాలని అనుకున్నామని.. అందుకు తగిన విధంగా పోలీసు శాఖ చర్యలు చేపట్టిందన్నారు. పారిశుధ్య కార్మికుల పనితీరు అద్భుతమని ప్రశంసించారు. మేళాని గుంటూరు ప్రజలు విజయవంతం చేయడంలో గొప్ప భాగస్వామ్యం వహించారని కృతజ్ఞతలు తెలిపారు. మీడియా సహకారం మరువలేనిదన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ సరస్ మేళ విజయవంతమైందని, ఆత్మ విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఇది ప్రారంభం మాత్రమేనని, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కృషితో 2047 నాటికి ప్రతి మహిళా లక్షాధికారి అవుతుందన్నారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, జీఎంసీ కమిషనర్ కె.మయూర్ అశోక్, డీఆర్‌డీఏ పీడీ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ సరస్ మేళా భవిష్యత్తులో మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు దోహదం చేస్తుందని, దాదాపు 14 లక్షల మంది సందర్శించారని తెలిపారు. ఒడిశా సమన్వయకర్త అంజలి, జార్ఖండ్ నుంచి షీలా దేవి, ఏపీ నుంచి విజయలక్ష్మి, లడఖ్ సమన్వయకర్త రజియా బాటిల్, కార్గిల్ సమన్వయకర్త అర్ఫో, సిద్ధికా బోసు తదితరులు మేళా నిర్వహణ అద్భుతంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులకు జ్ఞాపికలను కలెక్టర్ అన్సారియా అందించారు. డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డీఎంఅండ్‌హెచ్‌ఓ కే విజయలక్ష్మి, నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి శరత్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధికారులు, సిబ్బందికి పెమ్మసాని ధన్యవాదాలు

సరస్‌ను ఇంతటి ఘన విజయం సాధించే దిశగా సహకరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్, నగర మాజీ కమిషనర్ పులి శ్రీనివాసులు, ప్రస్తుత కమిషనర్ మయూర్ అశోక్, జేసీ అశుతోష్ శ్రీ వాస్తవ, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ విజయలక్ష్మి, జిల్లా యంత్రాంగం, అధికారులు, సిబ్బందికి పెమ్మసాని ధన్యవాదాలు తెలియజేశారు. మహిళా పారిశ్రామికవేత్తలకు మార్కెట్ అవకాశాలు కల్పించాలనే దూరదృష్టితో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చేసిన ప్రయత్నాలు సరస్ మేళా రూపంలో ఫలించాయి. లక్షలాదిమంది ప్రజలు పాల్గొన్న ఈ మేళాలో ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా పెమ్మసాని ప్రారంభం నుంచి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ మేళాకు సీఎం చంద్రబాబుని తీసుకురావడంలోనూ పెమ్మసాని క్రియాశీలక పాత్ర పోషించారు.

కేఎల్‌యూలో హోరాహోరీగా బాడ్మింటన్ పోటీలు


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

తాడేపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో జరుగుతున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఆదివారం రెండో రోజు క్వార్టర్ ఫైనల్స్ పూర్తి చేసుకొని సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. మొదటి రెండు రోజులు మొత్తం 16 జట్లు పోటీపడగా వీటిలో 8 జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నట్టు సౌత్ జోన్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.హరికిషోర్ తెలిపారు. సోమవారం సెమిఫైనల్ పోటీలు జరగనున్నాయని వెల్లడించారు. మంగళవారం ఫైనల్ పోటీలు పూర్తవుతాయని హరికిషోర్ చెప్పారు.

నేడు దూరవిద్య పరీక్షల పరిశీలకులతో సమావేశం

ఏఎన్‌యూ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా కేంద్రం భవనంలో సోమవారం దూరవిద్య పరీక్షల పరిశీలకులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు పరీక్షల సమన్వయకర్త ఆచార్య రామచంద్రన్ తెలిపారు. నిబంధనల ప్రకారం పరీక్షల నిర్వహణ, షెడ్యూల్ ప్రకారం పరీక్షల విధుల కేటాయింపుతోపాటు పరీక్షల నిర్వహణలో తలెత్తే సమస్యలపై సమావేశంలో చర్చిస్తామని ఆయన చెప్పారు. గత ఉపకులపతి అనుచరులుగా ముద్రపడి అధికారం చలాయించడంతో పాటు ఆనాడు దూరవిద్య పరీక్షల విధుల్లో అక్రమాలకు పాల్పడిన కొందరిని నేడు పరిశీలకులుగా అవకాశం కల్పించడం విశ్వవిద్యాలయంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతిచెందిన దండా శ్రీనివాసరావు

చిలకలూరిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడి గుంటూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దండా శ్రీనివాసరావు (46) ఆదివారం మృతి చెందాడు. చిలకలూరిపేట వాడరేవు కొత్త హైవేపై పసుమర్రు అన్నంబొట్లవారిపాలెం గ్రామాల మధ్య శుక్రవారం ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీ కొన్న ప్రమాదంలో పెదనందిపాడు మండలం జరుగులవారిపాలెం గ్రామానికి చెందిన దండా శ్రీనివాసరావు గాయపడగా, నాదెండ్ల మండలం అప్పాపురం గ్రామానికి చెందిన గంద్రు వేణుగోపాలకృష్ణ (46)గా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

కాజ గ్రామం వద్ద రోడ్డు ప్రమాదం

● భార్య మృతి.. భర్తకు గాయాలు

మంగళగిరి సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కాజ గ్రామ పరిధిలోని పశ్చిమ బైపాస్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్తకు గాయాలయ్యాయి. మంగళగిరి బాపనయ్య నగర్‌కు చెందిన భార్యాభర్తలు ఖాజాబాబా (బుడ్డు), సాధిక (31) గుంటూరు సమీపంలోని లాం వద్ద మసీదులో జరిగిన ప్రార్థనలకు హాజరయ్యారు. గుంటూరు నుంచి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్న క్రమంలో కాజ పశ్చిమ బైపాస్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిపోయారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం సాధికపై నుంచి వెళ్లడంతో శరీరం నుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన భర్త ఖాజాబాబాను ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి యువకుడి మృతి


కోలా రాజేశ్‌కుమార్ (ఫైల్)

మంగళగిరి సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నిడమర్రు రైల్వే గేటు వద్ద ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళగిరి పట్టణంలోని ఇందిరా నగర్‌కు చెందిన కోలా రాజేశ్‌కుమార్ (21) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. ఇటీవల కాలంలో చెడు వ్యసనాలకు అలవాటు పడి మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం నిడమర్రు వద్ద రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

హత్యకేసులో ఐదుగురు నిందితులు అరెస్టు

తెనాలి క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నందులపేటకు చెందిన ఏసీ మెకానిక్ ఫయాజ్ అహ్మద్‌ను యడ్లలింగయ్య కాలనీ వద్ద హత్య చేసిన కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను ఆదివారం డీఎస్పీ జనార్ధనరావు విలేకరులకు వివరించారు. హతుడు పల్లప్రోలు హిమబిందు అలియాస్ మాధవితో సహజీవనం చేస్తున్నాడు. గుంటూరుకు చెందిన జొన్నకూటి క్రాంతికిరణ్‌తో హిమబిందు మాట్లాడటం నచ్చకపోవడంతో ఫయాజ్ ఆమెను దూషించి కొట్టేవాడు. ఈ క్రమంలో క్రాంతికిరణ్‌కు దగ్గరై ఫయాజ్‌ను దూరం పెట్టింది. ఫయాజ్‌ను చంపితే రూ.10 వేలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నెల 9న ఇంటికొచ్చిన ఫయాజ్‌ను క్రాంతికిరణ్, మరో నలుగురు కలిసి కర్రలు, సిమెంట్ రాయితో కొట్టి హత్య చేసి ఆటోలో పారిపోయాడు. త్రీ టౌన్ సీఐ సాంబశివరావు కేసు నమోదు చేసి విచారిస్తుండగా నిందితులు కోర్టులో న్యాయవాది ద్వారా లొంగిపోతామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో అందిన సమాచారంతో పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, ఆటో స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరచగా 15 రోజులు రిమాండ్ విధించారు. ఈ కేసులో మరో నిందితుడు చందుని అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

పక్కాగా.. ఈ-పంట నమోదు

(5వ పేజీ తరువాయి)

ఓటీపీ పంపడం ద్వారా నమోదును సిబ్బంది నిర్ధారించుకోనున్నారు. ఈ-క్రాప్ నమోదుకు అన్నదాతలకు రెండు సార్లు వరకు అవకాశం ఇవ్వనున్నారు. రైతు సెల్‌కు మెసేజ్ పంపినట్లు సాంకేతిక రుజువులు ఉండడం వల్ల తమ పంట నమోదు చేయలేదనే ఫిర్యాదులు కూడా తగ్గే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే ఈ నూతన మార్గదర్శకాల వల్ల నమోదులో జవాబుదారీతనం పెంచడంతో పాటు ఫీల్డ్ విజిట్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది.

ఇప్పటి వరకు నమోదు ఇలా...

రబీ సీజన్‌లో ఈ సమయానికే దాదాపు 50 శాతం పైబడే ఈ-క్రాప్ నమోదు జరగాల్సి ఉంది. అయితే ప్రతి రైతు సమక్షంలోనే పంట నమోదు జరపాలన్న నిబంధనకు తోడు.. గతానికి భిన్నంగా మొత్తం ల్యాండ్ పార్శిల్స్‌ను రికార్డుల్లో నిక్షిప్తం చేయాల్సి రావడంతో కొంతమేర నిదానంగానే ఈ ప్రక్రియ నడుస్తోంది. ఫిబ్రవరి 20 వరకు నమోదుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చినందున ఆలోగానే వందశాతం లక్ష్యాలను చేరుకోవడానికి యంత్రాంగం కృషి చేస్తోంది.

● బాపట్ల జిల్లాలో రబీ సీజన్ సాధారణ విస్తీర్ణం 2.28 లక్షల ఎకరాలుగా ఉండగా, సాగులోకి వచ్చింది 1,36,663 ఎకరాలుగా వ్యవసాయశాఖ తేల్చింది. వీటితో సహా ల్యాండ్ పార్శిల్స్‌ను కూడా కలుపుకుంటే మొత్తం 7లక్షల వరకు ఈ-క్రాప్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు లక్ష ఎకరాలు మాత్రమే రికార్డుల్లోకి ఎక్కినట్లు అధికారులు చెబుతున్నారు.

● పల్నాడు జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 1,30,000 ఎకరాలుగా ఉండగా, సాగు పరిధిలోకి వచ్చింది లక్ష ఎకరాలుగా ఉంది. ల్యాండ్ పార్శిల్స్‌తో కూడా కలుపుకుంటే మొత్తం 6,50,000 వరకు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 20 శాతం నమోదైంది.

● గుంటూరు జిల్లాలో దాదాపు 1,50,000 ఎకరాల వరకు సాధారణ సాగు విస్తీర్ణం కాగా ల్యాండ్ పార్శిల్స్‌తో కలుపుకుంటే ఈ సంఖ్య 7 లక్షల వరకు ఉంది. ఇప్పటి వరకు 25 శాతం మాత్రమే ఈ-క్రాప్ రికార్డుల్లోకి ఎక్కినట్లు సమాచారం.

రూ.1750 కోట్ల ప్రజాధనంతో విగ్రహమా..!

● ఆ ధనాన్ని వైద్య కళాశాలలకు వినియోగించండి

● డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు


ప్రసంగిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, లక్ష్మణ రెడ్డి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహ నిర్మాణం కోసం రూ.1750 కోట్ల ప్రజాధనాన్ని వినియోగించే బదులు ఆ డబ్బును వైద్య కళాశాలల నిర్మాణానికి వినియోగించాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు కోరారు. గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ కోకన్వీనర్లు కేఎస్ లక్ష్మణరావు, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, కొరివి వినయ్ కుమార్‌తో కలిసి ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడారు. చంద్రబాబు నాయుడు రూ. 1750 కోట్లతో ప్రపంచంలోకెల్లా ఎత్తైన ఎన్టీఆర్ విగ్రహ నిర్మాణానికి పూనుకున్నారని, ఈ నిధులతో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 7 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పూర్తి చేసి రామారావుకు ఘన నివాళులు అర్పించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ, రూ.1750 కోట్లతో రాష్ట్రంలోని వేలాది ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు, రక్షిత తాగునీరు, మరుగుదొడ్లు లాంటి సౌకర్యాలు కల్పించవచ్చని, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్లో వసతులను మెరుగు పరచవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్ కుమార్, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయ రెడ్డి, స్టూడెంట్స్ యూనియన్ ఫర్ నేషన్ నేత కె.యశ్వంత్ పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి పండగ సెలవులు

● తిరుగు ప్రయాణికులతో రైళ్లు, బస్సుల రద్దీ


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ఇంటర్సిటీ రైలు


గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సెలవులు ఆదివారంతో ముగిశాయి. దీంతో స్వస్థలాలకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణమయ్యారు. ఈ నేపథ్యంలో గుంటూరు రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో ఆదివారం ప్రయాణికుల రద్దీ నెలకొంది. విశాఖపట్టణం-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో వద్ద ప్రయాణికులు పోటెత్తడంతో ఆర్పీఎఫ్ పోలీసులు రోప్‌పార్టీ ద్వారా భద్రత కల్పించారు. దగ్గరుండి అందరిని సురక్షితంగా రైలు బోగీలలోకి ఎక్కించారు. గుంటూరు-హైదరాబాద్ ఇంటర్‌సిటీ, విజయవాడ-లింగంపల్లి ఇంటర్‌సిటీ, వందేభారత్, నర్సాపూర్, చెన్నై, నారాయణాద్రి, డెల్టా, విశాఖ, దురంతో, విశాఖ-సికింద్రాబాద్ ఏసీ ఎక్స్‌ప్రెస్‌లన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. అలానే బెంగళూరు వైపు వెళ్లే హబ్లీ (అమరావతి), ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైళ్లలోనూ రద్దీ ఏర్పడింది. దీంతో రైల్వే శాఖ కొన్ని ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదుగా చర్లపల్లికి నడిపింది.

● **బస్టాండ్‌లలో తిరుగు ప్రయాణికుల కోలాహలం**

తిరుగు ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి. ఆదివారం ఎన్టీఆర్ బస్టాండ్‌లో తిరుగు ప్రయాణికులతో కోలాహల వాతావరణం నెలకొంది. స్త్రీ శక్తి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణం కావటంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. గుంటూరు-1, 2 డిపోలతో పాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు బస్టాండ్‌లలోనూ రద్దీ కనిపించింది. గుంటూరు నుంచి బాపట్ల, తెనాలి, పర్చూరు, విజయవాడ, పల్నాడు ప్రాంతాల వైపునకు వెళ్ళే బస్సులు ప్రయాణికులతో నిండిపోయాయి. రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులను ఏర్పాటు చేశారు. గుంటూరు నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నైతో పాటు ఇతర దూర ప్రాంతాలకు రద్దీకి అనుగుణంగా అధికారులు అదనపు బస్సులు ఏర్పాటు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	180, 189, 200
చికెన్ విత్ స్కిన్(కిలో)	350.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	360.00

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు

గుంటూరు(తూర్పు), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ, మండల స్థాయిలో పార్టీని మరింతగా బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. స్థానిక లాలాపురంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. తొలుత సమావేశంలో మండల, మోర్చా అధ్యక్షులను ప్రకటించారు. అనంతరం గ్రామ, బూత్ స్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఈనెల 23, 24 తేదీల్లో విజయవాడలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వ్యక్తిత్వం, పార్టీకి చేసిన సేవలపై జరిగే వర్క్‌షాప్‌లో అందరూ పాల్గొనాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్రా శివన్నారాయణ మాట్లాడుతూ కార్యకర్తలు, స్థానిక నాయకులను కలుపుకొని, పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాతీయ స్పైసెస్ బోర్డ్ సభ్యుడు కొత్తూరు వెంకట సుబ్బారావు, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, ఈదర శ్రీనివాసరెడ్డి, కొక్కెర శ్రీనివాస్, బీవీనేని చంద్రశేఖర్, వై వి సుబ్బారావు, ఫైరోజ్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెరుకూరి తిరుపతిరావు, పాల్గొన్న బీజేపీ నాయకులు

మతోన్మాద విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి

గుంటూరు(తూర్పు), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, మతోన్మాద విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పాతగుంటూరు, సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం సీపీఎం జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్ అమలు, మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దు వంటి ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని మండిపడ్డారు. జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి నాలుగు రోజుల పాటు గుంటూరులో జరిగే అఖిల భారత కిసాన్‌సభ జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని, విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12న జరిగే జాతీయ సమ్మెలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని కోరారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఈమని అప్పారావు, ఎంఏ.చిన్న, వెంకటేశ్వర్లు, నళినీకాంత్, ఎల్ అరుణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.ప్రభాకరరెడ్డి, పాల్గొన్న సీపీఎం నాయకులు

రెవెన్యూ క్లినిక్‌లో నాలుగు కౌంటర్ల ఏర్పాటు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్‌లను సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో ఇవి జరుగుతాయని అన్నారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రెవెన్యూ సమస్యలకు త్వరగా పరిష్కారం అందించేందుకు జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తు న్నట్లు కలెక్టర్ చెప్పారు. రెవెన్యూ క్లినిక్‌లలో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, గుంటూరు, తెనాలి రెవెన్యూ డివిజనల్ అధికారులు గ్రామ స్థాయి రికార్డులతో హాజరవు తారని తెలిపారు. మండలాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రెవెన్యూ క్లినిక్‌కు నాలుగు కౌంటర్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఖమ్మం తరలిన జిల్లా సీపీఐ శ్రేణులు

గుంటూరు(తూర్పు), జనవరి 18(ఆంధ్రజ్యోతి): సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా ఖమ్మంలో జరిగే ముగింపు బహిరంగ సభకు జిల్లా నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా, నగర కార్యదర్శులు కోట మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ సీపీఐ వందేళ్ల పోరాట చరిత్ర ప్రజల హక్కుల సాధనకు, కార్మికులు, రైతుల సంక్షేమానికి అంకితమైందని తెలిపారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రజాస్వామ్య హక్కులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా సీపీఐ మరింత బలంగా ఉద్యమిస్తుందని తెలిపారు. శతాబ్ద కాలంగా ప్రజల పక్షాన నిలిచిన కమ్యూనిస్టు పార్టీని మరింత శక్తివంతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని వారు పిలుపునిచ్చారు.



సీపీఐ శత వార్షికోత్సవాల సభకు తరలివెళ్తున్న నాయకులు

నేత్రానందం నృత్యాభినయనం

గుంటూరు(తూర్పు), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో అన్నమయ్య కళావేదికపై కేఆర్ కే ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ 21వ నాటకోత్స వాలు ఘనంగా జరుగుతున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ప్రద ర్శించిన కూచిపూడి నృత్యం, ఇది ప్రమాదానికి సంకేతం నాటకం ప్రేక్షకుల ను ఆకట్టుకున్నాయి. తొలుత ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు లంకా విజయ బాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కందుల చేతన శ్రావన్య, యర్రం సింధుజ, క్రొవ్విడి శ్రీలక్ష్మి తన్వీలు పలు కీర్తనలకు కూచి పూడి నృత్యాన్ని ప్రదర్శించి ఆహుతుల ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ నిర్వాహకులు కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాదు, బొప్పన నరసింహారావు (బుజ్జి), జి.మల్లికార్జునరావు తదితరులు పర్యవేక్షించారు.



కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు



తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నసీర్ తదితరులు



పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి తదితరులు

తెలుగువారికి ప్రపంచ వ్యాప్త గుర్తింపు తెచ్చిన ఎన్టీఆర్

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారికి గుర్తింపు తెచ్చిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఎన్టీఆర్ 30వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాస్, ఏపీ ఇండ్రస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ తదితరులు హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా తెలుగుయువత ఆధ్వర్యంలో భారీగా యువత తరలివచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మాణిక్యరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని స్థాపించి, 9 నెలలలోనే అధికారంలోకి తీసుకురావడమే కాకుండా అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసిన మహానుభావుడు ఎన్టీఆర్ అని అన్నారు. నేడు అన్ని రంగాల్లో అభివృద్ధిని చుస్తున్నామంటే దానికి మూల కారణం అన్న ఎన్టీఆర్ అన్నారు. కార్యక్రమంలో చిట్టాబత్తిన శ్రీనివాసరావు, కంచర్ల శివరామయ్య, వేములకొండ శ్రీనివాస్, లక్ష్మి శైలజ, నిమ్మల శేషయ్య, లామ్ నవమి, కొనకళ్ల సత్యనారాయణ, పప్పుల దేవదాస్, కొల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తాం

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నంద మూరి తారక రామారావు ఆశయాలను కొనసాగిస్తామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆమె ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. అనంతరం మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యం లో నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు పశ్చిమ నియోజకవర్గం నుంచి ఆమె వందలాది కార్లతో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అన్న నినాదంతో పేదల ఆకలి తీర్చిన మహానుభావుడు ఎన్టీఆర్‌కు భారత రత్న ప్రకటించాలని కోరారు. ఎన్టీఆర్ ఆశయాలను, స్ఫూర్తిని ప్రతి తెలుగువాడు పునికిపుచ్చు కుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

ప్రజల హృదయాలను గెలిచిన మహర్షి ఎన్టీఆర్

● గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగువారి గుండెల్లో కొలువైన నేతగా ఎన్టీఆర్ ప్రస్థానం చిరస్మరణీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఎన్టీఆర్ వర్ధం తి సందర్భంగా ఆదివారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్ర మాలకు ఎమ్మెల్యే నసీర్ హాజరై నివాళులర్పించారు. స్థానిక తూర్పు కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించి బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిన మహనీయుడు నందమూరి తారక రామారావు, ప్రజల హృదయాలను గెలిచిన మహర్షి అని కొనియాడారు. అనంతరం శారదాకాలనీ, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో....



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తదితరులు

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల్లో సహకార రంగాన్ని, సహకార బ్యాంకులను మరింత బలోపేతం చేయటంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పాలన అనిర్వచనీయమని జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలతో ఆయన ఘన నివాళులర్పించారు. అనంతరం ఛైర్మన్ మాట్లాడుతూ సహకార రంగంలో ఏకగవాక్ష (సింగిల్ విండో సిస్టం) అమల్లోకి తీసుకొచ్చిన ఘనత ఎన్‌టీఆర్‌దేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈవో వీవీఎస్ ఫణికుమార్, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

అనంతరం జీడీసీసీ బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ మహాజన సభను పురస్కరించుకొని బ్యాంకు ఆవరణలో ఉచితంగా మెడికల్ క్యాంప్‌ను ఛైర్మన్ లాంఛనంగా ప్రారంభించారు. రిటైర్డ్ ఎంప్లాయిస్‌తో ముచ్చటించారు. కాగా రిటైర్డ్ ఉద్యోగులు వారి సమస్యలు ఛైర్మన్‌కు విన్నవించారు. ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ.15 వేలు ఉండేలా చూడాలని, మెడి క్లెయిమ్ అమౌంట్ ను రూ. 15 వేలకు పెంచాలని ఛైర్మన్‌కు విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన ఉన్నతాధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామి ఇచ్చారు.

వాడవాడల ఎన్టీఆర్‌కు నివాళులు

గుంటూరు(తూర్పు), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నగరంలో వాడవాడల నిర్వహించారు.

● కలెక్టరేట్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లాం వర్ధన్‌రావు, 171 బూత్ కన్వీనర్ పఠాన్ ముక్తుమ్, షేక్ మస్తాన్‌వలీ, సయ్యద్ సుభాని, కోటా మాల్యాద్రి పాల్గొన్నారు.



ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న 23వ డివిజన్ టీడీపీ నాయకులు

● స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆయన విగ్రహానికి లాఫింగ్‌క్లబ్ సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి లాల్‌వజీర్, క్లబ్ సభ్యులు, వాకర్స్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు వద్ద...

గుంటూరు లీగల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కోర్టు వద్ద టీడీపీ గుంటూరు జిల్లా లీగల్‌సెల్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. రామారావు విగ్రహానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు, లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం 400 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు చుక్కపల్లి రమేష్, శ్రీరామ్ రాజీవ్ ఆనంద్, గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల అధ్యక్షులు కట్టా కాళిదాసు, కాలే దేవదాసు, న్యాయవాదులు వేమూరి శ్రీనివాసరావు, చిగురుపాటి రవీంద్రబాబు, ఎం.చౌదరిరావు, గురజాల అనురాధ, బాబురావు, మహతి శంకర్, వల్లభనేని శ్రీనివాసరావు, జమ్మిగుంపుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కోర్టు వద్ద జరిగిన ఎన్‌టీఆర్ వర్ధంతిలో పాల్గొన్న లీగల్ సెల్ నాయకులు

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : శివరామ్ నగర్ ఐదో లైన్‌కు చెందిన విజయానంద్ అదృశ్యమయ్యాడు. ఆయన భార్య శారా సుహాసిని సచివాలయంలో సెక్రటరీగా విధులు నిర్వహిస్తోంది. విజయానంద్ సుమారు 10 సంవత్సరాలుగా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 17న సాయంత్రం 4 గంటల నుంచి కనిపించకుండా వెళ్లిపోయాడు. దీంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో, చుట్టుపక్కల ప్రదేశాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య సుహాసిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంటి నుంచి కనిపించకుండా వెళ్లిన వ్యక్తికి మతిస్థిమితం లేనందున ఆచూకీ తెలిసిన వారు 8688831336, 8179156108 నెంబర్లకు తెలియజేయాలని పోలీసులు కోరారు.



విజయానంద్(ఫైల్)

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

పెద కాకాని, జనవరి 18 (ఆంధ్ర జ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయం శ్రీ దశావతార వెంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో ఆదివారం అమావాస్య సందర్భంగా శ్రీ ధనలక్ష్మి పూజ లో కనకాభిషేకం లో, దీపాల అలంకరణ లో దర్శనమిస్తున్న శ్రీ మహాలక్ష్మి దేవి అమ్మవారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కర్‌రావు దంపతులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక పూజ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు

మంగళగిరి సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ క్లాసిక్ మెన్ అండ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు ఆదివారం మంగళగిరి ఫిట్‌జోన్‌లో జరిగాయి. ఎంపిక పోటీలకు జిల్లా వ్యాప్తంగా 30 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పురుషుల జట్టుకు ప్రదీప్‌కుమార్, జస్వంత్, రాజు, దినేష్, మొహిద్దీన్, కౌశిక్, పృథ్వీ కుమార్, మహిళలకు జట్టుకు చంద్రిక, హర్షిత, చాతర్య ఎంపికయ్యారని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. వీరు ఫిబ్రవరి 14, 15 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగే 13వ ఏపీ స్టేట్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన లిఫ్టర్లను అసోసియేషన్ జిల్లా కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు చంద్రిక, పీ.భాస్కరరావు, సంయుక్త కార్యదర్శి మస్తాన్‌వలి, కోచ్‌లు సలోమి, రాజు, రమేష్ శర్మ అభినందించారు



ఎంపికైన పవర్ లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు

పశ్చిమ డెల్టాకు 2258 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 2258 క్యూసెక్కు నీరు ఆదివారం విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటి మట్టం ఉంది.

దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 196 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 267 క్యూసెక్కుల నీరు, పశ్చిమ కాల్వకు 138 క్యూసెక్కుల నీరు, నిజాంపట్నంకాల్వకు 60 క్యూసె క్కుల నీరు, కొమ్మమూరు కాల్వకు 1198 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

ప్రజలకు భరోసా కల్పించేందుకు విజిబుల్ పోలీసింగ్

● ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు భద్రత, భరోసా కోసం విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా పగలు, రాత్రి విస్తృత పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా సంఘవిద్రోహ శక్తుల ఆగడాలపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షిస్తూ సామాన్య ప్రజలకు భద్రతా, భరోసా కల్పించడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌ను పటిష్టంగా అమలు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, ఆసుపత్రులు, బ్యాంకులు ఇతర సున్నిత ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యాసంస్థల పరిసరాల్లో ఈవ్‌టీజింగ్, ఆకతాయిల వేధింపులను నివారించేందుకు, మానవ అక్రమ రవాణా వంటి నేరాలను అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనుమానిత వ్యక్తులను గుర్తించి వారి వేలిముద్రలను సేకరించి పోలీస్ శాఖ డేటాబేస్ ద్వారా పూర్వ నేర చరిత్ర ఉందేమోనని పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలోని పలువురు రౌడీషీటర్లు, గంజాయి కేసుల నిందితుల కదలికలపై నిఘా కొనసాగుతోందని, భవిష్యత్తులో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ఆవోపా ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ

గుంటూరు(విద్య), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేటలోని ఆవోపా కార్యాలయంలో ఆదివారం ఆర్యవైశ్య ప్రొఫెషనల్ అండ్ అఫీషియల్స్ (ఆవోపా) ఆధ్వర్యం లో ఆదివారం పేదలకు పింఛన్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం ఆధ్వ ర్యంలో 108 మంది పేదలకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పింఛన్లు, నిత్యావసర వస్తు వుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పైసెస్ బోర్డు మెంబర్ కొత్తూరు వెంకట సుబ్బారా వు, శ్వాసకోశ వ్యాధి నిపుణుడు డాక్టర్ తేజ, కొత్తూరి శంకరరావు, ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఆవోపా అధ్యక్షుడు కేవీ బ్రహ్మం తదితరులు

సృజన మనిషిని నిలబెడుతుంది

● అమరావతి సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షుడు రావి రంగారావు

గుంటూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సృజన మనిషిని నిలబెడుతుందని, మనిషిని మనిషిగా తీర్చిదిద్ది మహోపకారం చేస్తుందని అమరావతి సాహితీ మిత్రులు సంస్థ అధ్య క్షుడు రావి రంగారావు అన్నారు. బాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మంది రంలో ఆదివారం అమరావతి సాహితీ మిత్రులు నిర్వహించిన మూడో ఆదివారం సాహి త్య సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి సాహిత్య విశ్లేషణ చేశారు. పుట్టుకతో అంద రికీ సృజనాత్మక నైపుణ్యా శక్తి అబ్బుతుందని, ఆసక్తి లేకుంటే అది మరుగున పడిపోతుం దని ఆయన చెప్పారు. సృజన మనిషికి సుకుమార భావాలను పెంచుతుందని, ఉత్తమ మూర్తిమత్వ అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కవితలు, కథాని కల పఠనం, రీల్స్ ప్రదర్శన సభ్యులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అమరావతి సాహితీ మిత్రులు సంస్థ పక్షాన రావి రంగారావు, శాంతశ్రీ ట్రస్ట్ అధ్యక్షులు టి.శ్రీమన్నారాయణ, పీవీ రెడ్డి, ఉత్తమ కథా రచయితగా ఎంపికైన సంబరాజు రమణిని, ఉత్తమ కవిగా ఎంపి కైన కారంచేటి విజయకుమార్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. రాష్ట్రం నలు మూలల నుంచి కవులు రచయితలు కళాకారులు హాజరయ్యారు.



ఉత్తమ కథా రచయితలను సత్కరిస్తున్న రావి రంగారావు, శ్రీమన్నారాయణ తదితరులు

వేడుకగా తిరువీధి ఉత్సవం

గుంటూరు(తూర్పు), జనవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, శ్రీ త్యాగరాజ కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీత్యాగబ్రహ్మ ఆరాధన సంగీత మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం జరిగిన కార్యక్రమాల్ని విశ్రాంత హిందూ కాలే జీ ప్రిన్సిపాల్, వీ జయమూర్తి, డాక్టర్ జె.నరేష్‌బాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత బెజవాడ లక్ష్మీకాంత్ బృందం నాదస్వరం, త్యాగరాజస్వామికి విశేష పూజ నిర్వహించారు. అనంతరం శ్రీత్యాగరాజ స్వామి వేషధారణలో నాట్యాచార్య ఖాజా సుబ్రహ్మణ్యం పాల్గొని తిరువీధి ఉత్సవా న్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ప్రధాన కచేరీలో సంగీత సుధా నిధి కొల్లూరు వందనవే గాత్ర సంగీత కచేరి వీనులవిందుగా సాగింది. ఈ కార్యక్రమాల్ని ప్రధాన కార్యదర్శి వై శేషరాణి, ఉపాధ్యక్షురాలు ఎం రాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి తదితరులు పర్యవేక్షించారు.



తిరువీధి ఉత్సవాన్ని నిర్వహిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న లఘు అఖండం

గుంటూరు(తూర్పు), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట, శ్రీ మోహన రంగనాయక స్వామి దేవస్థానంలో, శ్రీసరస్వతి సంగీత విద్వత్ సభ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన లఘు అఖండం ప్రేక్షకులను అలరించింది. మాడభూషి వేదాంత నరసింహాచార్యులు శిష్యబృందం త్యాగరాజ కీర్తనలను ఆలపిస్తూ నిర్విఘ్నంగా 12 గంటల పాటు లఘు అఖండం నిర్వహించి కళాభిమానులను మెప్పించారు. వీరికి వయోలిన్‌పైన పెరవలి నందకుమా ర్, మృదంగంపై బీరక సురేష్‌బాబు చక్కటి వాయిద్య సహకారాన్ని అందిం చారు. కచేరీ అనంతరం చిన్నారులను నిర్వాహకులు సత్కరించారు.



శ్రీ త్యాగరాజ కీర్తనలను ఆలపిస్తున్న చిన్నారులు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం
19 జనవరి 2026





స్ఫూర్తి

తెల్లారితే అంతర్జాతీయ మ్యాచ్. దేశం తరపున ప్రాతినిధ్యం వహించాల్సిన తరుణంలో విధి ఆడిన వింత నాటకం ఆమెను ఆసుపత్రి పాలు చేసింది. కానీ, శస్త్రచికిత్సల తాలూకు నొప్పుల కంటే... దేశం కోసం ఆడాలన్న తపనే ఆమెను మైదానంలోకి మళ్లీ నడిపించింది. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో సత్తా చాటి ఇప్పుడు ఆంధ్ర సీనియర్ జట్టుకు సారథిగా ఎంపికైన కర్నూలు జిల్లా ఆదోని ముద్దుబిడ్డ, ఆంధ్ర సీనియర్ మహిళల జట్టు కెప్టెన్ అంజలి శర్వాణి ప్రయాణం ప్రతి ఒక్కరికి ఒక పాఠం. ఆ అద్భుత ప్రస్థానం ఆమె మాటల్లోనే..

చిరుత వేగం చెదరని సంకల్పం

మా నాన్న కె.రమణారావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ అనురాధ. నా ప్రయాణం క్రికెట్‌తో కాదు.. పరుగుతో మొదలైంది. 8వ తరగతి వరకు నేను ట్రాక్ మీదే ఉన్నాను. 100, 200 మీటర్ల పరుగులో పతకం రాకుండా ఇంటికి వెళ్లేదాన్ని కాదు. మిల్టన్ గ్రామర్ స్కూల్ పీఈటీ వెంకటేశ్ సార్ శిక్షణలో నేషనల్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని హరిద్వార్‌లో మెరిశాను. భారత్‌కు స్వర్ణం తేవాలన్నదే అప్పటి నా సంకల్పం.

మలుపు తిప్పిన సమ్మర్ క్యాంప్

2008లో జరిగిన ఒక సమ్మర్ క్యాంప్ నా జీవితాన్ని మలుపు తిప్పింది. అక్కడ నేను పరిగెడుతుంటే చూసిన క్రికెట్ కోచ్ నాలోని ప్రతిభను గుర్తించి నాన్నతో మాట్లాడారు. అలా పరుగుల బాట నుంచి క్రికెట్ వైపు అడుగులు పడ్డాయి. నేను లెఫ్ట్‌హ్యాండర్ కావడంతో బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలోనూ నాకు మేలు జరిగింది. ఏ రంగమైనా కఠోర సాధన ఉంటే విజయం తథ్యమన్న నాన్న మాటలు నాకు స్ఫూర్తినిచ్చాయి.

60 ఏళ్ల నిరీక్షణకు దక్కిన కప్పు

అండర్-16, 19 విభాగాల్లో ఆంధ్ర జట్టుకు ఆడుతూ నా ప్రయాణం మొదలైంది. 2018లో సౌత్ జోన్ జట్టుకు ఎంపికయ్యాను. 2019లో ముంబైలో జరిగిన అండర్-19 సూపర్ లీగ్‌లో నాకు కెప్టెన్సీ బాధ్యతలు ఇచ్చారు. సౌత్‌జోన్ 60 ఏళ్ల చరిత్రలో ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేదు. కానీ, నా సారథ్యంలోని మా జట్టు వరుస విజయాలతో చాంపియన్‌గా నిలిచింది. ఆ కప్పు చేతపట్టుకున్నప్పుడు కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆ ప్రతిభే నాకు ఇండియన్ రైల్వేస్‌లో ఉద్యోగం తెచ్చి పెట్టింది.

భారత్ జెర్సీ

2022లో ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ ఆడేందుకు భారత జట్టుకు ఎంపికయ్యాను. మొదటిసారి 'ఇండియా' అని రాసి ఉన్న జెర్సీ వేసుకున్నప్పుడు కలిగిన అనుభూతి మాటలకు అందదు. ఆ ఏడాది 37 వికెట్లు తీసి అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నిలవడం నా క్రికెట్ జీవితంలో మరువలేనిది. ఆ తర్వాత 2023లో టీ20 ప్రపంచకప్‌లోనూ భారత జట్టు తరపున ఆడాను.

గాయం వెంటాడినా..

బంగ్లాదేశ్ పర్యటనలో తగిలిన గాయం తర్వాత కోలుకోవడం అంత సులభం కాలేదు. బీసీసీఐ సహకారంతో బెంగళూరులో శస్త్రచికిత్స చేయించుకుని నెలల తరబడి విశ్రాంతి తీసుకున్నాను. 'మళ్లీ క్రికెట్ ఆడగలనా' అన్న భయం నన్ను నిద్రపోనివ్వలేదు. కానీ అమ్మానాన్నలు నా వెన్నంటి నిలిచారు. రెండోసారి ముంబైలోని అంబానీ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని కాలిలోని చిన్న ఎముక ముక్కను తొలగించాక మళ్లీ మైదానంలో అడుగుపెట్టాను. డబ్ల్యూపీఎల్‌లో యూపీ వారియర్స్ నన్ను రూ. 53 లక్షలకు కొనుగోలు చేసి నాపై నమ్మకం ఉంచింది. ఆ మూడేళ్లు నా సెకండ్ ఇన్నింగ్స్‌కు పునాది వేసింది.

లక్ష్యం మళ్లీ భారత్ జెర్సీనే



ప్రస్తుతం నేను రైల్వేస్ తరపున ఆడుతున్నా. నా మాతృభూమి అయిన ఆంధ్ర జట్టుకు ఆడాలనే కోరికతో రైల్వేస్ అనుమతి తీసుకుని ఇక్కడకు వచ్చాను. ఇప్పుడు ఆంధ్ర సీనియర్ మహిళల జట్టుకు కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించడం నా అదృష్టం. ప్రస్తుతం కడప క్యాంపులో తీవ్రంగా శ్రమిస్తున్నాం. త్వరలో జరగబోయే సీనియర్ ఉమెన్స్ టోర్నమెంటులో నా సారథ్యంలో ఆంధ్ర జట్టు విజయకేతం ఎగురవేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను.

వందకు పైగా మ్యాచ్‌లు

వందకుపైగా మ్యాచ్‌లు ఆడాను. వందకుపైగా వికెట్లు తీశాను. కానీ, నా దృష్టి భారత్ జెర్సీ మీదే ఉంది. ఏ రంగంలోనైనా ఆడపిల్లలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం, స్వేచ్ఛ ఉంటే వారు చరిత్ర సృష్టిస్తారు. నా ప్రయాణమే అందుకు నిదర్శనం.

• గోరంట్ల కొండప్ప, కర్నూలు



చర్మం మెరిసేందుకు

శీతాకాలంలో చర్మం పగిలి గరుకుగా మారుతుంటుంది. అలాంటప్పుడు చర్మం మృదువుగా మెరిసేందుకు పాటించాల్సిన చిట్కాలు...

- చలిగా ఉందంటూ వేడివేడి నీళ్లతో స్నానం చేయకూడదు. అలా చేస్తే చర్మం తేమను కోల్పోతుంది. గోరువెచ్చటి నీటిని మాత్రమే స్నానానికి వినియోగించాలి. దాహం అనిపించకపోయినా తరచూ మంచినీళ్లు తాగుతూ ఉండాలి.
- రాత్రి పూట బాదం, వాల్‌నట్స్‌ను నీళ్లలో నానబెట్టి ఉదయాన్నే తినాలి. వాటిలో ఉండే ఇ విటమిన్, ఆరోగ్యకరమైన కొవ్వులు చర్మానికి పోషణను అందిస్తాయి.
- రాత్రి పడుకునేముందు పాలలో దూది ఉండను ముంచి దానితో ముఖాన్ని సున్నితంగా రుద్దాలి. పాలలో ఉండే లాక్టోస్ చర్మానికి మంచి ఛాయను, మెరుపును అందిస్తుంది. చలి గాలి వల్ల పగిలిన చర్మం మృదువుగా మారుతుంది.
- స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక గ్లాసు నీళ్లు, ఒక చెంచా గ్రీన్ టీ పొడి వేసి బాగా మరిగించాలి. తరువాత మరో గిన్నెలోకి వడబోయాలి. ఇది చల్లారిన తరువాత అందులో నాలుగు చెంచాల రోజ్ వాటర్ వేసి కలపాలి. రాత్రి పడుకునేముందు ఈ నీటిని ముఖం మీద చిలకరించుకుని వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. ఉదయాన్నే చల్లటి నీళ్లతో శుభ్రం చేసుకుంటే ముఖం తాజాగా ప్రకాశవంతంగా ఉంటుంది. వాతావరణ కాలుష్యం, ఎండ, దుమ్ము వల్ల ఏర్పడిన నలుపుదనం తొలగిపోతుంది.
- చిన్న గిన్నెలో నాలుగు చెంచాల బాదం నూనెను తీసుకుని కొద్దిగా వేడి చేయాలి. దీన్ని వేలితో కొద్ది కొద్దిగా తీసుకుంటూ ముఖానికి మర్దన చేయాలి. అరగంట తరువాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేసుకుంటే రక్త ప్రసరణ మెరుగుపడి చర్మం తేమతో నిండుతుంది. ముఖం మృదువుగా ప్రకాశిస్తుంది.

వాడేసిన టీ పొడితో ఇలా...

రోజూ టీ తయారుచేసుకున్న తరువాత వడకట్టి టీ పొడిని పడేయకుండా ఇలా చేస్తే సరి...

- ఈ టీ పొడిలో కొన్ని నీళ్లు పోసి వడకట్టేస్తే అందులో పాలు, చక్కెరల అవశేషాలు తొలగిపోతాయి. తరువాత దీన్ని పూల మొక్కల కుండీల్లో వేస్తే మంచి ఎరువుగా పనిచేస్తుంది.
- వాడేసిన టీ పొడిలో కొద్దిగా వెనిగర్‌ను కలిపి పేస్టులా చేయాలి. దీనితో వంటపాత్రలను తోమితే వాటికి పట్టిన మసాల వాసనలు, జిడ్డు పూర్తిగా తొలగిపోతాయి.



- చిన్న ప్లాస్టిక్ గిన్నెలో వాడేసిన టీ పొడిని వేసి ఫ్రిజ్‌లో ఒక మూల పెట్టాలి. ఇది ఫ్రిజ్‌లో దుర్వాసనను తొలగిస్తుంది.
- వాడేసిన టీ పొడిని ఆరబెట్టి అందులో కొద్దిగా తేనె, పెరుగు వేసి ప్యాక్‌లా చేసి ముఖానికి పట్టించాలి. పావుగంట తరువాత మంచినీళ్లతో కడిగేసుకుంటే చర్మరంధ్రాలు పూర్తిగా శుభ్రపడతాయి. మొటిమలు రావు. ఒక టబ్‌లో వేడినీళ్లు తీసుకుని అందులో ఈ టీ పొడిని వేసి 5 నిమిషాల తరువాత పాదాలు ముంచితే పగుళ్ల నుంచి ఉపశమనం కలుగుతుంది.
- వాడేసిన టీ పొడిని మంచి నీళ్లతో శుభ్రం చేసిన తరువాత అందులో మరికొన్ని నీళ్లు పోసి బాగా మరిగించి గిన్నెలోకి వడబోయాలి. ఈ నీటిని తలకు కండిషనర్‌లా అప్లయ్ చేస్తే శిరోజాలు నల్లగా మెరుస్తాయి.

ఇవి తింటే గుండెజబ్బులు దూరం!

ఈ మధ్యకాలంలో గుండె జబ్బులు బాగా పెరిగిపోతున్నాయి. గుండెకు మేలు చేసే ఆహారం తినటం వల్ల ఈ జబ్బులు రాకుండా నివారించవచ్చని పౌష్టికాహార నిపుణులు పేర్కొంటున్నారు..

బీట్‌రూట్ : బీట్‌రూట్‌లో నైట్రేట్స్ ఎక్కువగా ఉంటాయి. వీటిని మన శరీరం నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుస్తుంది. ఈ నైట్రిక్ ఆక్సైడ్ వల్ల మన రక్తనాళాలు వ్యాకోచిస్తాయి. దీని వల్ల రక్తప్రసరణ బాగా జరుగుతుంది. రక్తనాళాలపై ఒత్తిడి కూడా ఉండదు. అందువల్ల ప్రతి రోజు మనం తినే ఆహారంలో బీట్‌రూట్‌ను ఏదో ఒక విధంగా జత చేరిస్తే మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు.



వాల్‌నట్స్ : వాల్‌నట్స్‌లో ఆల్ఫా లానోలినిక్ యాసిడ్ ఉంటుంది. ఇది మన శరీరంలో చెడు కొలస్ట్రాల్‌ను తగ్గించటంలో ఉపయోగపడుతుంది. చెడు కొలస్ట్రాల్ ఎక్కువగా ఉంటే రక్తనాళాలు పూడుకుపోతాయి. దీని వల్ల రక్తప్రసరణ సరిగ్గా జరగదు. గుండె జబ్బులు వస్తాయి. చెడు కొలస్ట్రాల్‌ను తగ్గించటం ద్వారా వాల్‌నట్స్ మనకు గుండె జబ్బులు రాకుండా పరోక్షంగా ఉపకరిస్తాయి.

మైక్రోగ్రీన్స్ : మైక్రోగ్రీన్స్‌లో సల్ఫోరాఫిన్, ఐసోథిసైనేట్స్ వంటి వంటి కాంపౌండ్స్ ఉంటాయి. ఇవి రక్తకణాలలోని వాపును తగ్గిస్తాయి. దీని వల్ల రక్తప్రసరణ సరిగ్గా జరుగుతుంది. అప్పుడు గుండె జబ్బులు రావు. ప్రతి రోజూ మన ఆహారంలో మైక్రోగ్రీన్స్‌ను ఏదో ఒక రకంగా తీసుకోవటం వల్ల దీర్ఘకాలంలో అనేక ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు.

చేపలు : మన ఆరోగ్యానికి హాని చేసే ట్రైగ్లిజరైట్స్‌ను తగ్గించటంలో చేపలు ఉపకరిస్తాయి. అంతే కాకుండా చేపలను క్రమం తప్పకుండా తింటే కండరాలలో వాపులు కూడా తగ్గుతాయి.

డార్క్ చాక్‌లెట్ : చాక్‌లెట్‌లో ఉండే కోకా వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అనేక పరిశోధనల్లో తేలింది. కోకా వల్ల మన శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తి పెరుగుతుంది. దీని వల్ల రక్తనాళాలు పూడుకుపోవు. ప్రతి రోజు కొద్దిగా డార్క్ చాక్‌లెట్ తినటం వల్ల ఈ ప్రయోజనాలన్నీ కలుగుతాయని పౌష్టికాహార నిపుణులు తెలియజేస్తున్నారు.

సామాజిక భాగస్వామ్యమే ప్రగతి పాఠం

క్షీణించిన భూసారం, పడిపోయిన దిగుబడి, వలస బాటలో జనం... ఇదీ రెండేళ్ల క్రితం మహారాష్ట్రలోని దవ్వా గ్రామ పంచాయతీ ముఖచిత్రం. ఇప్పుడది లక్షకు పైగా మొక్కలతో, సౌర విద్యుత్‌తో, ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అభివృద్ధికి చిరునామాగా మారింది. కిందటి ఏడాది తొలి సీఏఎస్‌పీఏ పురస్కారానికి ఎంపికై, కోటి రూపాయల బహుమతి గెలుచుకుంది. ఈ పురోగతికి బాటలు వేసిన సర్పంచ్ యోగేశ్వరీ చౌధురి... సామాజిక భాగస్వామ్యంతో అద్భుతాలు సాధించవచ్చని నిరూపించారు.

"మాది మహారాష్ట్రలోని గోండియా జిల్లాలో ఒక చిన్న గ్రామం. నా పుట్టింటివారికి గానీ, అత్తింటివారికి గానీ రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదు. మావి వ్యవసాయ కుటుంబాలు. నాకు బాగా చదువుకోవాలని ఉండేది. పదో తరగతి, ఇంటర్మీడియెట్ మంచి మార్కులతో పాసయ్యాను. డిగ్రీలో చేరదామనుకుంటే... మావాళ్ళు నాకు వివాహం చేశారు. అదే జిల్లాలోని దవ్వా గ్రామంలో నవ వధువుగా అడుగు పెట్టాను. చదువంటే నాకున్న ఆసక్తిని నా భర్త అర్థం చేసుకున్నారు. ఆయన ప్రోత్సాహంతో బీఏ, బీఈడీ చేశాను. టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. మాకు ఒక సంతానం. హాయిగా సాగిపోతున్న నా జీవితాన్ని నా భర్త హఠాన్మరణం తల్లకిందులు చేసింది.

ప్రతి ఇంటి అవసరాలు తీరేలా...

టీచర్‌గా, ఒంటరి మహిళగా గ్రామంలోని మహిళలకు నేనంటే గౌరవం, సానుభూతి ఉన్నాయి. తీరిక సమయాల్లో నా దగ్గరకు వచ్చి తోడుగా ఉండేవారు. వారి కుటుంబ పరిస్థితుల గురించి కూడా నాతో చెప్పేవారు. గ్రామంలోని మట్టిలో సారం క్షీణించడం, అడవులు తగ్గిపోవడం, వర్షపాతంలో అనిశ్చితి లాంటి సమస్యలతో వ్యవసాయాన్ని నష్టదాయకంగా మార్చాయి. జిల్లా కేంద్రానికి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న దవ్వా గ్రామంలో వ్యవసాయ దిగుబడులు తగ్గడం, అవకాశాలు పరిమితం కావడంతో పట్టణ ప్రాంతాలకు వలసలు పెరిగాయి.



కనీస సదుపాయాలు, ఆర్థిక స్థిరత్వం లేని దుస్థితిలో గ్రామస్తులు ఉన్నారు. ఈ సమస్యలు తీరాలంటే నిబద్ధత కలిగిన నాయకత్వం అవసరమని అర్థమయింది. అందుకే 2023 చివర్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేశాను. జనం నామీద విశ్వాసం ఉంచి మద్దతు ఇచ్చారు. మంచి మెజారిటీతో సర్పంచ్‌గా ఎన్నికయ్యాను. బాధ్యతలు స్వీకరించిన వెంటనే తీర్మానాలు, నిర్ణయాల జోలికి పోకుండా... గ్రామస్తులతో బహిరంగ సమావేశాలు నిర్వహించాను. అలాగే ప్రతి ఇంటికీ వెళ్ళాను. వారి అవసరాల గురించి తెలుసుకున్నాను. నీటి సంరక్షణ నుంచి చెట్ల పెంపకం వరకూ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అంశాలతో జాబితా తయారు చేశాను. పారిశుధ్యం, విపత్తు నిర్వహణ, నీటి నిర్వహణ లాంటి అంశాలపై కమిటీలు వేశాను. ప్రతి ఇంటినుంచి ఒకరు ఈ కమిటీలో సభ్యులుగా ఉండేలా చూశాను.

వ్యవసాయం లాభసాటిగా...

నాకు రాజకీయంగా పలుకుబడి లేకపోవడంతో మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాను. మెల్లగా పరిపాలనాపరమైన అంశాలను నేర్చుకున్నాను. నిధులు కేటాయించేలా అధికారులను ఒప్పించగలిగాను. చివరకు పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'మాఝీ వసుంధర' కార్యక్రమంలో మా పంచాయతీని చేర్చారు. దీనిలో భాగంగా ఇప్పటివరకూ దాదాపు లక్షా డెబ్బై వేల చెట్లను మా పంచాయతీ పరిధిలో నాటాం. నర్సరీలు ఏర్పాటు చేశాం. భూసారం పెంచి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే చర్యల్లో భాగంగా అయిదు రైతు బృందాలను, 38 స్వయం సహాయక మహిళా బృందాలను ఏర్పాటు చేశాం. వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవడం కోసం సౌరవిద్యుత్ ప్లాంట్ నెలకొల్పాం. మా పంచాయతీలోని పొలాలకు సాగునీరు పూర్తిగా సౌరవిద్యుత్ ద్వారానే అందుతోంది. అలాగే ఆధునిక, సేంద్రియ సాగు విధానాల్లో రైతులకు శిక్షణ కోసం వ్యవసాయ పాఠశాల ప్రారంభించాం. మొదట్లో స్థానిక రైతులు ఈ పద్ధతులను అమలు చేయడానికి సంకోచించారు. నాకున్న ఎనిమిది ఎకరాల్లో టేకు, మూడు ఎకరాల్లో వరి వేశాను. అంతర పంటలను కూడా పండిస్తూ మంచి దిగుబడి సాధించడంతో మిగిలిన రైతులు కూడా ఈ పద్ధతులవైపు మళ్ళారు. ముంబయికి వలస వెళ్ళిన వారు గ్రామానికి తిరిగి వచ్చి, తమ పొలాల్లో వ్యవసాయం చేస్తున్నారు. గ్రామంలోని ఇళ్ళన్నిటికీ సౌరవిద్యుత్ సరఫరా అవుతోంది. సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, మంచి నీటి సదుపాయం ఏర్పాటు చేసుకున్నాం. మంచి నీటి ట్యాంక్ నిర్మాణం మొత్తం గ్రామస్తులే పూర్తి చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాం. ఇళ్ళనుంచి చెత్తను సేకరించి, వేరుచేసి, కంపోస్ట్‌గా ఉపయోగిస్తున్నాం.

తొలి పంచాయతీగా...

ఒకప్పుడు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న మా పంచాయతీ కేవలం రెండేళ్ళలోనే దేశానికి ఆదర్శంగా మారింది. 'సంత్ గాడ్గే బాబా' అవార్డు, 'మాఝీ వసుంధర' అవార్డుతో సహా పలు రాష్ట్ర స్థాయి పురస్కారాలతో పాటు..... కిందటి ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'క్లైమెట్ యాక్షన్ స్పెషల్ పంచాయతీ అవార్డు' (సీఏఎస్‌పీఏ)ను తొలిసారి అందుకున్న పంచాయతీగా ఘనత సాధించింది. సీఏఎస్‌పీఏ కింద కోటి రూపాయలతో సహా మొత్తంగా రూ.1.6 కోట్లకు పైగా నగదు పురస్కారాలు అందుకున్నాం. దీంతో మరింత ప్రగతికి దోహదపడే అవకాశం లభించింది. ఇప్పుడు దవ్వాలో ప్రగతి ప్రతిచోటా కనిపిస్తోంది. వరిసాగు పెరిగింది. నర్సరీలు పూలతో కళకళలాడుతున్నాయి. సామాజిక భాగస్వామ్యం, మహిళా సాధికారత ద్వారా అపారమైన అభివృద్ధి సాధ్యమని మా ప్రజలు నిరూపించారు."

వేలికో ఓ పుడక!

ఫ్యాషన్ ప్రపంచంలో ఎప్పుడు ఏ వింత పుట్టుకొస్తుందో ఊహించడం కష్టం. నిన్నటి వరకు ముక్కుకో, చెవికో పియర్సింగ్ చేయించుకోవడం ఒక ట్రెండ్. అయితే ఇప్పుడు అది ఏకంగా వేలి వరకు పాకింది. హాలీవుడ్ పాప్‌స్టార్ కాన్యే వెస్ట్, సోషల్ మీడియా సంచలనం కిమ్ కర్దాషియన్ల ముద్దుల కుమార్తె నార్త్‌వెస్ట్ తన వేళ్లకు 'పియర్సింగ్' చేయించుకుని డైమండ్ స్టడ్ అమర్చుకుంది.



హద్దులు దాటుతున్న ఫ్యాషన్ పిచ్చి

11 ఏళ్ల నార్త్‌వెస్ట్ వింత ప్రయోగం ఆశ్చర్యంతోపాటు పెద్ద ఎత్తున విమర్శలకు దారితీస్తోంది. వేలిపై ఉండే చర్మం అత్యంత సున్నితమైనది కాబట్టి అక్కడ పియర్సింగ్ వల్ల ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనం నిత్యం చేసే పనుల వల్ల ఆ వజ్రం ఎక్కడైనా తగిలి చర్మం తెగిపోయే అవకాశం కూడా ఉంది. చిన్న వయసు కావడంతో అంతటి నొప్పిని భరించి మరీ ఈ రిస్కీ స్టైల్ అవసరమా అని నెటిజన్లు పెదవి విరుస్తున్నారు. స్టైల్ కోసం ఆరోగ్యాన్ని పణంగా పెట్టడంపై సోషల్ మీడియాలో పెద్ద చర్చే నడుస్తోంది.

వారసత్వంగా గ్లామర్

నిజానికి కర్దాషియన్ కుటుంబానికి ఇలాంటి విలాసవంతమైన ఫ్యాషన్లు కొత్తేమీ కాదు. గ్లామర్ ప్రపంచంలో పెరిగిన నార్త్‌వెస్ట్ తన తల్లి కిమ్ కర్దాషియన్ అడుగుజాడల్లో నడుస్తూ చిన్నతనం నుంచే వార్తల్లో నిలిచేందుకు ఇష్టపడుతోంది. గతంలో ఆమె తన పళ్లకు వజ్రాలు పొదిగిన గ్రిల్స్ ధరించి అందరినీ షాక్‌కు గురిచేసింది. ఇప్పుడు ఈ 'ఫింగర్ పియర్సింగ్'తో తాను కూడా ఒక స్టైల్ ఐకాన్ అని నిరూపించుకోవాలని తాపత్రయపడుతోంది.

అందం వ్యక్తిగతమే అయినా..

అందం అనేది వ్యక్తిగత ఇష్టమే అయినప్పటికీ అది ఆరోగ్యానికి హాని కలిగించనంత వరకు మాత్రమే ముచ్చటగా ఉంటుంది. సెలబ్రిటీల పిల్లలు చేసే ఇలాంటి పనులు ఇతర చిన్నారుల మీద కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అందం కోసం సురక్షితం కాని మార్గాలను ఎంచుకోవడం సరైనది కాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

లవంగాలతో లాభాలెన్నో...

వంటకాలకు రుచిని సువాసనను అందించే మసాల దినుసుల్లో లవంగాలు ప్రధానమైనవి. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు...

- జీర్ణక్రియ వేగవంతమవుతుంది. కడుపులో ఆమ్లత్వం తగ్గుతుంది.
- చలికాలంలో వేధించే దగ్గు, గొంతు నొప్పి, ఇతర శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది.
- లవంగాల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీర ఉష్ణోగ్రతను నియంత్రణలో ఉంచుతాయి. ఇన్సులిన్ పనితీరును పెంచి రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా కాపాడతాయి. కాలేయం ఆరోగ్యంగా పనిచేసేందుకు తోడ్పడతాయి.
- రాత్రి పడుకునే ముందు రెండు లవంగాలు నమిలి తింటే జీర్ణక్రియ వేగవంతమవుతుంది. మలబద్ధకం సమస్య తీరుతుంది.
- లవంగాల్లో ఉండే మాంగనీస్.. ఎముకల నిర్మాణానికి, బలోపేతానికి తోడ్పడుతుంది.
- రెండు లవంగాలను నోటిలో ఉంచుకుని చప్పరించడం వల్ల దంతాల నొప్పి, చిగుళ్ల వాపు తగ్గుతాయి. నోటి దుర్వాసన తొలగిపోతుంది.
- ఒక గ్లాసు గోరువెచ్చటి పాలలో పావు చెంచా లవంగాల పొడి, చిటికెడు పంచదార కలుపుకుని తాగితే తలనొప్పి మాయమవుతుంది.
- ఒక గ్లాసు మంచి నీటిలో నాలుగు లేదా అయిదు లవంగాలు వేసి బాగా మరిగించి తాగితే గుండెలో మంట, కడుపులో వికారం లాంటి సమస్యలు తగ్గుతాయి.



డబ్ల్యూపీఎల్‌లో నేడు

గుజరాత్ X బెంగళూరు (రా. 7.30)

కివీస్ కొత్త చరిత్ర

ఒకటూ.. రెండా.. దాదాపు నాలుగు దశాబ్దాల నిరీక్షణకు న్యూజిలాండ్ జట్టు ముగింపు పలికింది. 1988 నుంచి ద్వైపాక్షిక వన్డే సిరీస్ కోసం భారత పర్యటనకు వచ్చిన ప్రతీసారి పరాజయ భారంతోనే వెనుదిరిగిన కివీ.. ఈమారు చరిత్ర సృష్టించింది. పూర్తిస్థాయి జట్టుతో రాక పోయినా.. అందుబాటులో ఉన్న వనరులనే సద్వినియోగం చేసుకుని టీమిండియాను 2-1తో కంగుతినిపించింది. ఆదివారం జరిగిన ఆఖరిదైన మూడో వన్డేలో కివీస్ తరఫున డారిల్ మిచెల్, ఫిలిప్స్ సెంచరీలతో కదం తొక్కగా.. ఛేదనలో విరాట్ కోహ్లీ శతక పోరాటం సరిపోలేదు. ఫలితంగా భారత్‌ను ఓడించి న్యూజిలాండ్ సిరీస్‌ను సొంతం చేసుకుంది.

2-1తో భారత గడ్డపై తొలి సిరీస్ ● మూడో వన్డేలో విజయం ● మిచెల్, ఫిలిప్స్ శతక మోత ● విరాట్ సెంచరీ వృధా


మిచెల్ (137)



ఇండోర్: భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌ను న్యూజిలాండ్ 2-1తో చేజిక్కించుకుంది. కివీస్‌కు భారతగడ్డపై ఇదే తొలి వన్డే సిరీస్ విజయం కావడం విశేషం. మూడో వన్డేలో కివీస్ గెలుపులో డారిల్ మిచెల్ (131 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 137), గ్లెన్ ఫిలిప్స్ (88 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 106) సెంచరీలతో కీలక పాత్ర పోషించారు. భారత్ భారీ ఛేదనలో విరాట్ కోహ్లీ (108 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 124) శతక పోరాటంతో చివరి వరకు నిలిచినా ఫలితం లేకపోయింది. దీంతో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో కివీస్ 41 రన్స్‌తో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 337 పరుగులు చేసింది. అర్ష్‌దీప్, హర్షిత్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 46 ఓవర్లలో 296 రన్స్‌కు ఆలౌటైంది. హర్షిత్ (52), నితీశ్ (53) అర్ధసెంచరీలతో రాణించారు. క్లార్క్, ఫౌక్స్‌లకు మూడేసి, లెనాక్స్‌కు 2 వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా మిచెల్ నిలిచాడు.

విరాట్ పోరాటం: భారీ ఛేదనలో విరాట్ కోహ్లీ శతక పోరాటంతో ఆకట్టుకున్నాడు. ఓ ఎండ్‌లో వికెట్లు పడుతున్నా క్రీజులో పట్టు వదలకుండా నిలిచాడు. తనకు నితీశ్ నుంచి సహకారం లభించడంతో ఐదో వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యం లభించింది. చివర్లో హర్షిత్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఏడో వికెట్‌కు ఏకంగా 99 రన్స్ సమకూరడంతో విజయంపై ఆశలు చిగురించాయి. కానీ కివీస్ బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీసి మ్యాచ్‌ను వశం చేసుకున్నారు. ఓపెనర్ రోహిత్ (11) ఈసారీ విఫలం కాగా.. కెప్టెన్ గిల్ (23) జోరు కాసేపే అయ్యింది. వీరికి తోడు శ్రేయాస్ (3), రాహుల్ (1) ఇలా వచ్చి అలా వెళ్లడం దెబ్బతీసింది. ఈ స్థితిలో విరాట్-నితీశ్ కివీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. నితీశ్ ఆరంభంలో ఆచితూచి ఆడాడు. ఆ తర్వాత పుంజుకుని వన్డేల్లో తొలి ఫిఫ్టీని కూడా పూర్తి చేసుకున్నాడు. అయితే కాసేపటికే అతడిని క్లార్క్ అవుట్ చేయడం, జడేజా (12) విఫలం కావడంతో కివీస్ పైచేయి సాధించింది. కానీ తొమ్మిదో నెంబర్ బ్యాటర్ హర్షిత్ ఎడాపెడా షాట్లు బాదాడు. అటు కోహ్లీ 91 బంతుల్లోనే కెరీర్‌లో 54వ సెంచరీ పూర్తి చేశాడు. 43వ ఓవర్‌లో హర్షిత్ 4,6 విరాట్ 6తో 21 రన్స్ సమకూరాయి. అయితే వరుస బంతుల్లో హర్షిత్, సిరాజ్ (0)ను ఫౌక్స్ అవుట్ చేయగా.. మరో ఓవర్ వ్యవధిలోనే విరాట్, కుల్దీప్ వెనుదిరిగారు. దీంతో మరో 24 బంతులుండగానే కివీస్ మ్యాచ్‌ను విజయంతో ముగించింది.

శతకాల బాదుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ ఇన్నింగ్స్‌లో మరోసారి డారిల్ మిచెల్ కీలకంగా నిలిచాడు. ఈసారి అతడికి ఫిలిప్స్ నుంచి సహకారం లభించింది. దాదాపు 31 ఓవర్లపాటు క్రీజులో ఆధిపత్యం ప్రదర్శించడమే కాకుండా ఇద్దరూ శతకాలతో చెలరేగారు. వీరి జోరుతో నాలుగో వికెట్‌కు ఏకంగా 219 పరుగుల భారీ భాగస్వామ్యం ఏర్పడడం విశేషం. అంతకుముందు సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడిన పేసర్ అర్ష్‌దీప్ ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే ఓపెనర్ యంగ్‌ను డకౌట్ చేశాడు. మరో ఓపెనర్ కాన్వే (5)ను హర్షిత్ మూడో ఓవర్‌లో అవుట్ చేయగా.. మిచెల్-యంగ్ జోడీ మూడో వికెట్‌కు 53 పరుగులు జోడించారు. ఆ తర్వాత ఫిలిప్స్ ఆరంభంలో కాస్త నెమ్మదిగానే ఆడినా.. కుదురుకున్నాక భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. అటు మిచెల్ అసాధారణ ఫామ్ కొనసాగిస్తూ సిరీస్‌లో వరుసగా రెండో శతకం అందుకున్నాడు. చివరికి 44వ ఓవర్‌లో ఫిలిప్స్‌ను అర్ష్‌దీప్ అవుట్ చేయడంతో భారత్‌కు రిలీఫ్ దక్కింది. తర్వాతి ఓవర్‌లోనే మిచెల్ వెనుదిరగడంతో చివరి వికెట్లు వేగంగా నేలకూలాయి.


ఫిలిప్స్ (106)


కోహ్లీ (124)

స్కోరుబోర్డు

న్యూజిలాండ్: కాన్వే (సి) రోహిత్ (బి) హర్షిత్ 5, నికోల్స్ (బి) అర్ష్‌దీప్ 0, యంగ్ (సి) జడేజా (బి) హర్షిత్ 30, మిచెల్ (సి) కుల్దీప్ (బి) సిరాజ్ 137, ఫిలిప్స్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 106, బ్రేస్‌వెల్ (నాటౌట్) 28, హేయ్ (ఎల్బీ) కుల్దీప్ 2, ఫౌక్స్ (సి) కుల్దీప్ (బి) అర్ష్‌దీప్ 10, క్లార్క్ (బి) హర్షిత్ 11, జేమిసన్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 50 ఓవర్లలో 337/8. వికెట్ల పతనం:** 1-5, 2-5, 3-58, 4-277, 5-283, 6-286, 7-304, 8-327. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 10-1-63-3, హర్షిత్ 10-0-84-3, సిరాజ్ 10-0-43-1, నితీశ్ 8-0-53-0, కుల్దీప్ 6-0-48-1, జడేజా 6-0-41-0.

భారత్: రోహిత్ (సి) క్లార్క్ (బి) ఫౌక్స్ 11, గిల్ (బి) జేమిసన్ 23, విరాట్ (సి) మిచెల్ (బి) క్లార్క్ 124, శ్రేయాస్ (సి) ఫౌక్స్ (బి) క్లార్క్ 3, రాహుల్ (సి) ఫిలిప్స్ (బి) లెనాక్స్ 1, నితీశ్ (సి) యంగ్ (బి) క్లార్క్ 53, జడేజా (సి) యంగ్ (బి) లెనాక్స్ 12, హర్షిత్ (సి) నికోల్స్ (బి) ఫౌక్స్ 52, సిరాజ్ (సి) హేయ్ (బి) ఫౌక్స్ 0, కుల్దీప్ (రనౌట్) 5, అర్ష్‌దీప్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 46 ఓవర్లలో 296 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-28, 2-45, 3-68, 4-71, 5-159, 6-178, 7-277, 8-277, 9-292, 10-296. **బౌలింగ్:** జేమిసన్ 9-0-58-1, ఫౌక్స్ 9-0-77-3, క్లార్క్ 9-0-54-3, లెనాక్స్ 10-0-42-2, మిచెల్ 1-0-10-0, ఫిలిప్స్ 8-0-54-0.

ఒకే వన్డేలో భారత జట్టుపై ఇద్దరు న్యూజిలాండ్ బ్యాటర్లు శతకాలు బాదడం ఇదే తొలిసారి.

1 కివీస్‌పై ఎక్కువ సెంచరీలు (7) చేసిన బ్యాటర్‌గా విరాట్. అలాగే ఈ ఫార్మాట్‌లో వన్‌డౌన్‌లో బరిలోకి దిగి అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్‌గా విరాట్ (12,672). పాంటింగ్ (12,655)ను అధిగమించాడు.

విజేతలు యంగ్, లిన్

ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్





న్యూఢిల్లీ: ప్రపంచ నెంబర్‌వన్ అన్ సే యంగ్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. ఈ దక్షిణ కొరియా సంచలనం ఇండియా ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో టాప్‌సీడ్, డిఫెండింగ్ చాంప్ అన్ సే యంగ్ 21-13, 21-11తో చైనాకు చెందిన ప్రపంచ నెంబర్ టూ షట్లర్ వాంగ్ జియిని ఓడించి సీజన్‌లో వరుసగా రెండో ట్రోఫీని దక్కించుకుంది. గతవారం మలేసియా ఓపెన్‌లోనూ యంగ్ విజేతగా నిలిచింది. ఇండియా ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను లిన్ చున్ యి (చైనీస్ తైపీ) సాధించాడు. తుదిపోరులో లిన్ 21-10, 21-18తో జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై గెలిచాడు.

రెండో రౌండ్‌లో అర్జున్‌కు డ్రా

విజ్క్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా మాస్టర్స్ చెస్‌లో అర్జున్ ఇరిగేసి రెండో రౌండ్‌ను డ్రాగా ముగించాడు. ఆదివారం జరిగిన గేమ్‌లో తాయ్ గుయెన్ (చెక్)తో అర్జున్ పాయింట్ పంచుకున్నాడు. అంతకుముందు తొలి రౌండ్‌లో సహచరుడు ప్రజ్ఞానందపై అర్జున్ గెలిచాడు. రెండో రౌండ్ తర్వాత అర్జున్ 1.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇక జోర్డెన్ (నెదర్లాండ్స్)తో గుకేశ్, యాగిజ్ (టర్కీ)తో అరవింద్ డ్రా చేసుకోగా, నోదిర్బెక్‌తో గేమ్‌ను ప్రజ్ఞానంద ఓడిపోయాడు.

టాప్‌సీడ్ల శుభారంభం

ఆస్ట్రేలియన్ ఓపెన్

- అల్కారజ్, సబలెంక ముందంజ
- తొలి రౌండ్‌లోనే వీనస్ అవుట్


సబలెంక

మెల్‌బోర్న్: టాప్‌సీడ్లు కార్లోస్ అల్కారజ్, అర్యానా సబలెంక ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో శుభారంభం చేశారు. అయితే 45 ఏళ్ల వయస్సులో గ్రాండ్‌స్లామ్‌లో పాల్గొంటున్న క్రీడాకారిణిగా రికార్డు సృష్టించిన వీనస్ విలియమ్స్ తొలి రౌండ్‌ను దాటలేకపోయింది. 11వ సీడ్ అలెగ్జాంద్రోవాకు కూడా షాక్ తగిలింది. నిరుటి రన్నరప్, ప్రపంచ నెంబర్‌వన్ సబలెంక 6-4, 6-1తో ఫ్రాన్స్‌కు చెందిన తియంత్సోవ సారాను ఓడించింది. పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో వరల్డ్ నెంబర్‌వన్ అల్కారజ్ 6-3, 7-6 (2), 6-2తో ఆడమ్ వాల్టన్‌పై, గతేడాది రన్నరప్ జ్వెరెవ్ 6-7 (7), 6-1, 6-4, 6-2తో గాబ్రియెల్ డియాలోపై గెలుపొందాడు. మహిళల తొలి రౌండ్‌లో సోన్మెజ్ (టర్కీ) 7-5, 4-6, 6-4తో 11వ సీడ్ ఎకటరీనా అలెగ్జాండ్రోవా (రష్యా)ను కంగుతినిపించింది. ఏడు గ్రాండ్‌స్లామ్‌ల విజేత వీనస్ విలియమ్స్ (అమెరికా)ను 6-7 (7), 6-3, 6-4తో 24 ఏళ్ల డానిలోవిచ్ (సెర్బియా) కంగుతినిపించింది. ఏడో సీడ్ పోలిని 6-1, 6-2తో సస్నోవిచ్‌పై, స్వితోలినా 6-4, 6-1తో బుక్సాపై, రదుకాను 6-4, 6-1తో సవన్‌కేయెబ్‌పై నెగ్గారు.

బంగ్లాదేశ్‌కు పాక్ క్రికెట్ వత్తాసు

కరాచీ: టీ20 వరల్డ్‌కప్‌నకు ముందు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) వ్యవహారం మరింత ముదురుతోంది. తాజాగా బీసీబీకి పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మద్దతుగా నిలిచింది. భద్రతా కారణాలరీత్యా భారత్ నుంచి తమ వేదికలను శ్రీలంకకు మార్చాలన్న బంగ్లా డిమాండ్‌ను వెంటనే పరిష్కరించాలని పీసీబీ సూచించింది. లేకుంటే ఈ మెగా టోర్నీలో పాల్గొనే విషయమై ఆలోచించాల్సి వస్తుందని ఐసీసీని హెచ్చరించింది. అయితే వరల్డ్‌కప్‌లో పాల్గొనే విషయమై ఈనెల 21లోగా తెల్చుకోవాలని ఐసీసీ.. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డును కోరినట్టు సమాచారం.

విదర్భ విజయ గీతిక

- తొలిసారి హజారే ట్రోఫీ కైవసం
- ఫైనల్లో సౌరాష్ట్ర ఓటమి



బెంగళూరు: గత ఏడాది రంజీ చాంపియన్‌గా నిలిచిన విదర్భ జట్టు ఈసారి విజయ్ హజారే వన్డే టోర్నీని కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో విదర్భ 38 పరుగులతో సౌరాష్ట్రను ఓడించి తొలిసారి హజారే ట్రోఫీ విజేతగా నిలిచింది. మొదట విదర్భ 50 ఓవర్లలో 317/8 స్కోరు సాధించింది. ఓపెనర్ అథర్వ టైడే (128) శతకంతో దుమ్ము రేపాడు. యశ్ రాథోడ్ (54) అర్ధ శతకంతో సత్తా చాటాడు. భారీ ఛేదనలో సౌరాష్ట్ర 48.5 ఓవర్లలో 279 రన్స్‌కు ఆలౌటైంది. ప్రేరక్ మన్కడ్ (88), చిరాగ్ జానీ (64) రాణించారు. విజేతగా నిలిచిన విదర్భకు ఐపీఎల్ పాలకమండలి సభ్యుడు చాముండేశ్వర్ నాథ్ ట్రోఫీ అందజేశాడు.

సంక్షిప్త స్కోర్లు

విదర్భ: 50 ఓవర్లలో 317/8 (అథర్వ 128, అంకుర్ 4/65).
సౌరాష్ట్ర: 48.5 ఓవర్లలో 279 ఆలౌట్ (ప్రేరక్ 88, చిరాగ్ 64, యశ్ ఠాకూర్ 4/50, నచికేత్ 3/46, దర్శన్ నల్కండే 2/52).

ఆటుపోట్లకు అవకాశం..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశం ఉంది. వేగంగా మారుతున్న అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, అమెరికా ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతుందన్న సంకేతాలతో మార్కెట్లలో ఆందోళన నెలకొంది. ఇలాంటి సందిగ్ధ పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు ఎంపిక చేసిన షేర్లలో పెట్టుబడులు పెట్టడం మంచిది. ఆర్థిక ఫలితాల సీజన్ మొదలవటం సూచీల దశదిశను సూచించే వీలుంది. ప్రస్తుతం మెటల్స్ ప్రభుత్వ రంగ బ్యాంకులు, కమోడిటీస్, ఆటో, బ్యాంకింగ్ రంగాల్లో మూమెంటమ్ కనిపిస్తోంది.

స్టాక్ రికమండేషన్స్

టెక్ మహీంద్రా: స్వల్ప పుల్‌బ్యాక్ తర్వాత ఈ కౌంటర్ మంచి మూమెంటమ్‌ను చూపిస్తోంది. సమీప నిరోధాన్ని అధిగమించేందుకు సిద్ధమైంది. పైగా నిఫ్టీతో పోల్చితే జోరు ప్రదర్శిస్తోంది. ఫలితాల అనంతరం గత శుక్రవారం 5.6 శాతం లాభంతో రూ.1,670 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,650 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,800 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.1,630 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పంజాబ్ నేషనల్ బ్యాంక్: నష్టాల మార్కెట్లోనూ ఈ షేరు మంచి రాబడి అందిస్తోంది. గత ఏడాది మార్చి నుంచి 45 శాతం మేర రాణించింది. రిలేటివ్ స్ట్రెంత్, వాల్యూమ్ పెరగటంతో ఇన్వెస్టర్లు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. గత శుక్రవారం రూ.132 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.130 శ్రేణిలో ప్రవేశించి రూ.155 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.125 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బీపీసీఎల్: గత ఏడాది మార్చి నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. ఇన్వెస్టర్లకు 60 శాతం మేర రాబడులు అందించింది. ఆర్థిక ఫలితాలు త్వరలో ప్రకటించనుండటంతో మరింత పైకి వెళ్లే అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.363 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.360 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.410 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.352 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ (జేఎస్ఎల్): ప్రస్తుతం ఈ కౌంటర్ జీవితకాల గరిష్ఠ స్థాయిలో కదలాడుతోంది. మూమెంటమ్ దొరికితే నిరోధాన్ని అధిగమించి మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉంది. ఈ వారంలో వెలువడే ఆర్థిక ఫలితాలపై ఇది ఆధారపడి ఉంటుంది. గత శుక్రవారం రూ.813 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.800 ఎగువన ప్రవేశించి రూ.910 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు.అయితే రూ.785 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హింద్ పెట్రో: జీవితకాల గరిష్ఠ స్థాయిలో కదలాడుతున్న ఈ షేరు దీర్ఘకాలిక అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఏకంగా 75 శాతం రాబడిని అందించింది. రిలేటివ్ స్ట్రెంత్ మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.457 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.450 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.520/570 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.440 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ఐసీఐసీఐ ప్రు నుంచి స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ)... తొలిసారిగా స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఎస్ఐఎఫ్) కింద రెండు కొత్త ఫండ్స్‌ను ప్రారంభించింది. ఐఎస్ఐఎఫ్ ఈక్విటీ ఎక్స్-టాప్ 100 లాంగ్-షార్ట్ ఫండ్, ఐఎస్ఐఎఫ్ హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్ పేరుతో వీటిని తీసుకువచ్చింది. మ్యూచువల్ ఫండ్స్, పీఎంఎస్/ఏఐఎఫ్ ఉత్పత్తుల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు సెబీ ఈ ఎస్ఐఎఫ్‌ను ప్రవేశపెట్టింది. ఐఎస్ఐఎఫ్ ఈక్విటీ ఎక్స్-టాప్ 100.. ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత విభాగాల్లో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ ఇన్వెస్ట్‌మెంట్ పథకం ఇది. ఈ ఫండ్‌కు నిఫ్టీ 500 టీఆర్ఐ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఐఎస్ఐఎఫ్ హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్.. ఈక్విటీ, డెరివేటివ్స్ ద్వారా డెట్ ఫండ్స్‌లో వ్యూహాత్మకంగా పెట్టుబడులు పెడుతుంది. ఈ ఫండ్స్ కనీస పెట్టుబడి రూ.10 లక్షలు. ఫండ్స్ ముగింపు తేదీ ఈ నెల 30.

ఫార్మా ఎగుమతులు రూ.1.84 లక్షల కోట్లు

కీలక మార్కెట్లుగా నైజీరియా, బ్రెజిల్



న్యూఢిల్లీ: సుంకాల పోటు ఉన్నా భారత ఫార్మా ఎగుమతులు జోరందుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి ఎనిమిది నెలల్లోనే ఈ ఎగుమతులు 2,048 కోట్ల డాలర్లకు (సుమారు రూ.1.84 లక్షల కోట్లు) చేరాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది ఆరున్నర శాతం ఎక్కువని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికార వర్గాలు చెప్పాయి. నైజీరియా, బ్రెజిల్ దేశాలకు ఎగుమతులు మరింత వేగం పుంజుకున్నాయి. గత ఏడాది ఏప్రిల్-నవంబరు మధ్య కాలంలో మన దేశం నుంచి నైజీరియా 17.9 కోట్ల డాలర్లు, బ్రెజిల్ 10 కోట్ల డాలర్ల విలువైన ఔషధాలను దిగుమతి చేసుకున్నాయి. ప్రస్తుతం మన దేశ ఫార్మా ఎగుమతుల్లో నైజీరియా వాటా 14 శాతానికి చేరింది.

అమెరికాదే పెద్ద వాటా

ట్రంప్ సుంకాల భయం ఉన్నప్పటికీ ఆ ప్రభావం అమెరికాకు జరిగే మన ఫార్మా ఎగుమతులపై ఏమాత్రం పడలేదు. దీంతో గత ఏడాది ఏప్రిల్-నవంబరు మధ్య కాలంలో మన మొత్తం ఫార్మా ఎగుమతుల్లో 31 శాతం వాటాతో అమెరికా అగ్రస్థానంలో నిలిచింది. ప్రస్తుతం అభివృద్ధి చెందిన ఫ్రాన్స్, నెదర్లాండ్, కెనడా, జర్మనీ, దక్షిణాఫ్రికా వంటి దేశాలూ భారత్ నుంచి పెద్ద మొత్తంలో ఔషధాలు దిగుమతి చేసుకుంటున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల్లో నెదర్లాండ్‌కు భారత ఫార్మా ఎగుమతులు, గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 5.8 కోట్ల డాలర్లు పెరిగినట్టు వాణిజ్య మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ వృద్ధి రేటు ఇలానే కొనసాగితే గత ఆర్థిక సంవత్సరం నమోదైన 3,047 కోట్ల డాలర్లతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మన ఫార్మా ఎగుమతులు 9 నుంచి 10 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాల అంచనా.

షేర్ల లాభాలపై ఎల్‌టీసీజీ తగ్గించాలి

- రూ.2 లక్షల వరకు పన్ను వద్దు
- బడ్జెట్‌పై క్యాపిటల్ మార్కెట్ ఆశలు



న్యూఢిల్లీ: వచ్చే కేంద్ర బడ్జెట్‌లో తమ విన్నపాలను పట్టించుకోవాలని క్యాపిటల్ మార్కెట్ వర్గాలు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరాయి. రిటైల్ మదుపరులు, దీర్ఘకాలిక మదుపరులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఇందుకోసం ప్రస్తుతం 12.5 శాతంగా ఉన్న దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ)ని, 20 శాతంగా ఉన్న స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను (ఎస్‌టీసీజీటీ)ని 10 శాతానికి కుదించాలని కోరింది. అలాగే ప్రస్తుతం ఏటా రూ.1.25 లక్షల వరకు ఉన్న ఎల్‌టీసీజీటీ మినహాయింపు పరిమితిని రూ.2 లక్షలకు పెంచాలని జేఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచించింది.

ఇతర ముఖ్య కోరికలు

- షేర్ల లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) మరింత పెంచొద్దు
- బంగారం, వెండిపై మరింత పన్నుల భారం వద్దు
- ఈక్విటీ, రియల్టీ, డెట్, పసిడి దీర్ఘకాలిక లాభాలకూ 12 నెలల కాల పరిమితి వర్తింప చేయాలి
- ఒక ఆస్తి లావాదేవీలపై వచ్చే నష్టాలను, మిగతా ఏ ఆస్తి అమ్మకాల లాభాల నుంచైనా భర్తీ చేసుకునే సదుపాయం కల్పించాలి
- నగదు ఈక్విటీ లావాదేవీలపై ఎస్‌టీటీ డెరివేటివ్స్‌పై కంటే తక్కువగా ఉండాలి
- షేర్ల బైబ్యాక్‌పై వచ్చే లాభాలపై మాత్రమే పన్ను పోటు ఉండాలి

ఐసీఐసీఐ ప్రు ఇండియా ఆపర్చునిటీస్ ఫండ్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఇండియా ఆపర్చునిటీస్ ఫండ్.. ఏడేళ్లు పూర్తి చేసుకుంది. 2019 జనవరిలో ప్రారంభమైన ఈ ఫండ్ మదుపరులకు దీర్ఘకాలిక లాభాలను అందించటంలో కీలకంగా ఉంది. మార్కెట్ క్యాపిటలైజేషన్, విభాగం ఆధారిత పనితీరును బట్టి ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ ప్రారంభమైన 2019 జనవరి 15న ఒకేసారి రూ.10 లక్షలు ఇన్వెస్ట్ చేసి ఉంటే గత ఏడాది డిసెంబరు 31 నాటికి దాని విలువ ఏటా 21.02 శాతం వృద్ధితో రూ.37.76 లక్షలకు చేరుకుంది. ఇదే సమయంలో నిఫ్టీ 500 టీఆర్ఐ మాత్రం 15.97 శాతం రిటర్నులు ఇచ్చింది. క్రమానుగత పెట్టుబడుల రూపంలో నెలకు రూ.10,000 ఇన్వెస్ట్ చేసినా ఆ మొత్తం రూ.19.88 లక్షలకు చేరుకుంది. మదుపరులకు దీర్ఘకాలికంగా మెరుగైన రిటర్నులు అందించేందుకు ఈ ఫండ్ ప్రధానంగా ఫైనాన్షియల్స్, ఐటీ, ఫార్మా, కన్‌స్ట్రక్షన్ వంటి విభాగాల్లో ఇన్వెస్ట్ చేస్తోంది.

బిజినెస్

26,000 పైన బుల్లిష్

(జనవరి 19-23 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 26,373-25,683 పాయింట్ల మధ్యన కదలాడి 11 పాయింట్ల నామ మాత్రపు లాభంతో 25,694 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26,000 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,997, 25,959, 25,564, 25,084 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 26,000 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 25,250
నిరోధ స్థాయిలు: 25,900, 26,000, 26,100 (25,800 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 25,450, 25,350, 25,250 (25,550 దిగువన బేరిష్)

అమర్‌నాథ్ శాస్త్రి

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




19వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	510
వరంగల్	502	గోదావరి	515
చిత్తూరు	563	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ.	75

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	156	విజయవాడ	157
వరంగల్	156	గుంటూరు	164
కరీంనగర్	156	ఒంగోలు	164
మహబూబ్‌నగర్	156	చిత్తూరు	164
కర్నూలు	156	నెల్లూరు	169
విశాఖపట్నం	145	అనంతపురం	169
గోదావరి	157		

నిరోధ స్థాయి 26,000


వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ కీలక స్థాయి 24,500 నుంచి బలమైన పునరుజ్జీవం సాధించినప్పటికీ చివరి మూడు రోజుల్లో 25,900-25,600 పాయింట్ల మధ్యన పరిమిత పరిధిలోనే కదలాడింది. చివరికి చెప్పుకోదగినంత కదలికలేవీ లేకుండా 11 పాయింట్ల నామ మాత్రపు లాభంతో 25,700 సమీపంలో ముగిసింది. ముందు వారంలో ఏర్పడిన 650 పాయింట్ల బ్రేక్‌డౌన్ అనంతరం ఏర్పడిన పుల్‌బ్యాక్ ఇది. ఇప్పుడు సూచీ మరింత రికవరీలో పయనించే ఆస్కారం ఉంది.

స్వల్పకాలిక అప్‌ట్రెండ్ సాధించాలంటే మాత్రం మార్కెట్ బలాన్ని ప్రదర్శించక తప్పదు. గత వారం అనిశ్చితంగా ముగిసినప్పటికీ ఈ వారంలో ఎగువకు మొగ్గతో కన్సాలిడేట్ అయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 25,850 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం, మానసిక అవధి 26,000. స్వల్పకాలిక సానుకూల ధోరణి కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినట్టయితే దిగువన 25,600 వద్ద గట్టి మద్దతు లభిస్తోంది. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనపడే ఆస్కారం ఉంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 25,450. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక అప్రమత్తత మరింతగా కొనసాగుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 840 పాయింట్ల మేరకు ర్యాలీ సాధించి వారం గరిష్ఠ స్థాయి 60,000 సమీపంలో ముగిసింది. మరోసారి గరిష్ఠ స్థాయిల వద్ద పరీక్షకు సమాయత్తం అవుతోంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం నిరోధ స్థాయి 60,500 వద్ద నిలదొక్కుకుని తీరాలి. ప్రస్తుత మద్దతు స్థాయి 60,000 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం 50, 100 డీఎంఏల కన్నా దిగువన ఉంది. ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ దిగువకే ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం 26,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్ లైన్" వద్ద నిలదొక్కుకుని తీరాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్స్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,850, 25,920
మద్దతు	25,600, 25,530

టెక్ వ్యూ



మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రబాబు, పల్లా శ్రీనివాస్, అనగాని, అచ్చెన్న, కేశవ్



దివంగత సీఎం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి లోకేశ్, నివాళులర్పిస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి, భువనేశ్వరి, బాలకృష్ణ, ఇతర ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు

ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న చంద్రబాబు: పల్లా



ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాస్, వేదికపై చంద్రబాబు, అచ్చెన్నాయుడు, తదితరులు

తెలుగుజాతికి ఆత్మవిశ్వాసం, రాజకీయ చైతన్యం ఇచ్చిన నాయకుడు ఎన్టీఆర్ అని, ఆయన ఆశయాలను భుజాలపై మోస్తూ ముందుకు తీసుకెళ్తున్న నాయకుడు చంద్రబాబు అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చెప్పారు. ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే మార్గదర్శకంగా నిలిపిన చంద్రబాబు నేడు నవ్యాంధ్ర రాజధాని అమరావతితో మరోమారు ప్రపంచ పటంలో నిలిపేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఓవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారని వివరించారు.

వైసీపీవి శవ రాజకీయాలు: గొట్టిపాటి



పోతినవారిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి, పోతినవారిపాలెం(పర్చూరు), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీని ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినా జగన్‌కు బుద్ధి రాలేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. ఆదివారం బాపట్ల జిల్లా కారంచేడు మండలం పోతినవారిపాలెంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ తెలుగు జాతి సత్తాను ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. దేశంలోనే కోటి సభ్యత్వం కలిగిన ఏకైక పార్టీ టీడీపీ అని, టీడీపీ కార్యకర్తలు గర్వంగా తలెత్తితే వైసీపీ భూస్థాపితం అవుతుందని హెచ్చరించారు. అనంతరం టీడీపీ కేంద్ర కార్యాలయంలోనూ విలేకరులతో మంత్రి రవికుమార్ మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో వైసీపీ హయాంలో రక్తాలు పారితే, టీడీపీ హయాంలో పంట భూములకు నీళ్లు పారుతున్నాయన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘటనకు రాజకీయ రంగు పులిమి వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శించారు. వ్యక్తిగత కక్షలతో జరిగే హత్యల్ని రాజకీయ హత్యలుగా మార్చి కుట్రలు చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

వైసీపీ సైకోతత్వాన్ని సహించేది లేదు: అనగాని



అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): బలులు, రక్తాభిషేకాలు, రప్పారప్పాలు వైసీపీ తత్వమని, ఇలాంటి సైకోతత్వాన్ని సహించేది లేదని మంత్రి అనగాని సత్యప్రసాద్ హెచ్చరించారు. సంక్రాంతి పండుగను అందరూ ప్రశాంతంగా జరుపుకొంటుంటే, ఆ ప్రశాంతతను భగ్నం చేయడానికి వైసీపీ నాయకులు సిద్ధమయ్యారని విమర్శించారు. ప్రజలు గాలిపటాలు ఎగరేసుకుంటుంటే, వైసీపీ వారు బీసీ నాయకుల తలలు ఎగరేసే కార్యక్రమంలో ఉన్నారని మండిపడ్డారు. తుని నియోజకవర్గంలో లాలం బంగారయ్యని ఘోరంగా హత్య చేశారని, పల్నాడులో రెండు వర్గాల నడుమ గొడవను శవ రాజకీయం చేస్తున్నారని విమర్శించారు.

రెండు సమావేశాలకు రాకుంటే అనర్హత వేటే!

- ఎథిక్స్ కమిటీ పరిశీలనలో వైసీపీ ఎమ్మెల్యేల తీరు: రఘురామ

డాబాగార్డెన్స్(విశాఖ సిటీ), జనవరి 18(ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో జరిగే శాసనసభ బడ్జెట్ సమావేశాలకైనా జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేలు హాజరవుతారని అసెంబ్లీ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం విశాఖలో ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా, జీతభత్యాలు తీసుకుంటున్న అంశాన్ని ఎథిక్స్ కమిటీ పరిశీలిస్తోందన్నారు. ఎమ్మెల్యేలు వరుసగా రెండు శాసనసభ సమావేశాలకు హాజరుకాకపోతే అనర్హత వేటు పడుతుందని చెప్పారు. శాసన మండలి, శాసనసభల్లో వేర్వేరు వాతావరణం నెలకొందన్న వైసీపీ నాయకుల వ్యాఖ్యలను ఖండిస్తున్నానన్నారు.

పల్నాడు గొడవల్ని రాజకీయం చేయడం దారుణం

- అభివృద్ధిని సహించలేకే వైసీపీ బురద చల్లే ప్రయత్నం: మంత్రి కొల్లు

మచిలీపట్నం టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పల్నాడులో వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యలను రాజకీయం చేయడం దారుణమని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆదివారం మచిలీపట్నం బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హత్యారాజకీయాలకు, కక్షసాధింపు చర్యలకు కూటమి ప్రభుత్వం దూరమన్నారు. అభివృద్ధిని చూసి సహించలేక వైసీపీ నాయకులు బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రౌడీషీటర్ల మధ్య వ్యక్తిగత తగాదాలను వైసీపీ రాజకీయం చేస్తోందన్నారు. జగన్ పాలనలో బీసీ, ఎస్సీ నాయకులను హత్య చేశారని, పిన్నెల్లి గ్రామంలో టీడీపీ కార్యకర్తలపై జగన్ అనుయాయులు దాడులు జరిపించారని చెప్పారు. మద్యం స్కాంలో జోగి రమేశ్ అకృత్యాలు బయటపడుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.99కే లిక్కర్ అందిస్తున్నామని, మళ్లీ నాణ్యత కలిగిన బీర్‌ను ప్రవేశపెట్టామని తెలిపారు.

దాడులు, దౌర్జన్యాలపై ఉక్కుపాదం: మంత్రి సవిత



పెనుకొండ టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): దాడులు, దౌర్జన్యాలకు పాల్పడితే ఉక్కుపాదంతో అణచివేస్తామని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత హెచ్చరించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి సవిత ఆదివారం మీడియాతో మాట్లాడారు. జగన్ పోద్బలంతో వైసీపీ గూండాలు రెచ్చిపోతున్నారని, పండగ పూట పల్నాడులో జరిగిన హత్యలకు ఆయన మాటలే కారణమన్నారు. రప్పా రప్పా అంటూ రాష్ట్రంలో దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పల్నాడులో ఇద్దరి మధ్య జరిగిన ఘటనను కులాలకు ఆపాదిస్తున్నారన్నారు. పల్నాడు జిల్లాలో ఇద్దరు యువకులు కత్తులతో గొడవకు దిగి ఒకరు మృతిచెందడం బాధాకరమని చెప్పారు. ఈ ఘటనపై జగన్ శవ రాజకీయాలకు పాల్పడుతున్నారంటూ మండిపడ్డారు.

క్రెడిట్ చోరీ ఎవరిదో అందరికీ తెలుసు!

పిన్నమ్మ పుస్తెలు తెంచిన నేరస్థులను రాజకీయ ముసుగులో కాపాడుతున్న పార్టీని ఏమనాలి. వారు కూడా మనల్ని విమర్శిస్తున్నారు. వైసీపీ పుట్టుకే ఫేక్. అవినీతి సొమ్ముతో పేపర్ పెట్టుకున్నారు. అలాంటి పార్టీతో పోరాడటం దౌర్భాగ్యం. - సీఎం చంద్రబాబు

భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చాం. ఆ మాట నిలబెట్టుకున్నాం. విద్యుత్తు కొనుగోళ్ల ధరలను తగ్గిస్తున్నాం. తద్వారా ప్రజలపై విద్యుత్తు భారాన్ని తగ్గించేలా కృషి చేస్తున్నాం. ఈ ఏడాది యూనిట్‌కు 29 పైసలు విద్యుత్ కొనుగోలు ధర తగ్గించాం. భవిష్యత్తులో యూనిట్ పై రూ.1.19 పైసలు తగ్గించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం.

గొంతు మీద కత్తి పెట్టి 'జై జగన్' అంటే వదిలేస్తామని చెప్పినా 'జై టీడీపీ.. జై సీబీఎన్' అని నినదించిన కార్యకర్తలు టీడీపీకే సొంతం. ప్రజలు ఓటేయాలన్నా వారిని నడిపించాలన్నా కార్యకర్తలే ముందుండాలి. టీడీపీ కార్యకర్తలు, వారి త్యాగాల కష్టార్జితమే నేను సీఎం కావడానికి కారణం. కార్యకర్తలను గౌరవప్రదంగా చూసుకుంటున్నాం. కార్యకర్తలు ప్రమాదంలో చనిపోతే రూ.5 లక్షల బీమా కల్పిస్తున్నాం. కార్యకర్తలను చూసుకునే బాధ్యత అధినేతగా నాపై ఉంది.

- సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

పాకులాడుతారు." అని దుయ్యబట్టారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ 30వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. వైసీపీ నేతలు చేస్తున్న 'క్రెడిట్ చోరీ' విమర్శలపై ఘాటుగా స్పందించారు. ఆయన ఏమన్నారంటే..

వైసీపీ పుట్టుకే ఫేక్

వైసీపీ వాళ్లు రాజకీయాల్లో కుట్రలు, కుతంత్రాలు చేస్తూనే ఉంటారు. 18నెలల్లో రకరకాల కుట్రలు పన్నారు. వైసీపీ పుట్టుకే ఫేక్. అవినీతి సొమ్ముతో పేపర్ పెట్టుకున్నారు. అలాంటి పార్టీతో పోరాడటం దౌర్భాగ్యం. వాళ్ల పత్రికలో క్రెడిట్ చోరీ అని వార్తలు రాస్తున్నారు. కాకినాడలో ఏఎం గ్రీన్ 10 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. దీనిలో క్రెడిట్ ఎవరిదో.. చోరీ ఎవరిదో అందరికీ తెలుసు. గతంలో కియాతో సంబంధం లేకున్నా ఆ పరిశ్రమను కూడా వైసీపీ తెచ్చిందని చెప్పుకొన్నారు. భోగాపురం విమానాశ్రయానికి టీడీపీ హయాంలో 2,500 ఎకరాల భూసేకరణ చేశాం. ఎప్పుడో అయిపోవాల్సిన ప్రాజెక్టును 5ఏళ్ల పాటు మూలన పడేశారు. 500 ఎకరాలు తిరిగి ఇచ్చారు. మొదటిసారి సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. దీన్ని కూడా తమ ఘనతగా చెప్పుకొంటున్నారు. ఎవరిది క్రెడిట్ చోరీ?. ప్రజల ఆస్తులపై వాళ్ల ఫొటోలు వేసుకోవడం వాళ్ల క్రెడిట్. రూ.700 కోట్లు ఖర్చుచేసి సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకోవడం, ఉద్యోగులను ఇబ్బందిపెట్టడం, టీచర్లను బ్రాందీ షాపుల వద్ద కాపలా పెట్టడం, బకాయిలు అడిగితే తప్పుడు కేసులు పెట్టడం వాళ్ల క్రెడిట్. నేడు ఉద్యోగులను గౌరవించి బకాయిలు, డీఏలు చెల్లిస్తున్నాం. కొన్ని బకాయిలు చెల్లించి వారికి నిజమైన సంక్రాంతి ఆనందాన్ని కల్పించాం.

తోక తిప్పలేరు.. జాగ్రత్త!

పల్నాడు జిల్లాలో మొన్న ఒక గొడవ జరిగితే రెచ్చగొడుతున్నారు. గిల్లికజ్జాలు పెట్టుకోవాలంటే మర్యాదగా ఉండదు. నా దగ్గర తోక తిప్పలేరు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడితే పట్టుకొచ్చి బట్టలూడదీస్తాం. తప్పుచేస్తే వదిలిపెట్టం.. మంచి చేస్తే ఎవరి జోలికీ రాను. రాజకీయాల ముసుగులో ఘోరాలు చేస్తే చూరుకోను. సీమలో ముఠాలను అంతం చేసిన పార్టీ టీడీపీ. పల్నాడులో కూడా పూర్తి ప్రక్షాళన చేసి శాంతియుతంగా మార్చుతాం. పల్నాడు ప్రాంతానికి నేను వెళ్తానంటే.. గతంలో నా ఇంటి గేటుకు తాళ్లు కట్టి గేట్లు మూసివేశారు. ఆ తాళ్లే వారికి ఉరితాళ్లు అవుతాయని చెప్పా. తప్పుడు రాజకీయాలు కాదు ప్రజా రాజకీయాలు చేయాలి.

ట్యాంపర్ చేస్తే జైలుకే

వైసీపీ హయాంలో ప్రజలకు వారసత్వంగా వచ్చిన భూముల పత్రాలపై వారి ఫొటోలు వేసుకున్నారు. కొత్త గ్రామాధికారులను తీసుకొచ్చి ప్రజల ఆస్తులు కొట్టేయాలని చూశారు. అడ్డదిడ్డంగా వ్యవహరించి భూములను 22-ఏలో పెట్టారు. చెప్పిన మాట ప్రకారం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశాం. పట్టాదారు పాస్‌పుస్తకాల్లో గత పాలకుల ఫొటోలు తొలగించి రాజముద్రతో పాస్ పుస్తకాలు అందిస్తున్నాం. రీసర్వేను పక్కాగా చేస్తున్నాం. బ్లాక్ చైన్ విధానం తెస్తున్నాం. క్యూఆర్ కోడ్ విధానం తీసుకొచ్చాం. రికార్డులను ట్యాంపర్ చేస్తే జైలుకు వెళ్తారు. రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలను టీడీపీ అంతం చేసింది. రాష్ట్రాన్ని తీవ్రవాదులు ఇబ్బందులు పెట్టాలని చూస్తే రాజీ లేకుండా పనిచేశాం. నాపై దాడి చేసినా భయపడకుండా పోరాడాను. మత విద్వేషాలు లేకుండా చేశాం. నేడు రాష్ట్రంలో కొంతమంది పొలిటికల్ రౌడీలు తయారయ్యారు. నేరస్థులు రాజకీయ పార్టీలు నడుపుతున్నారు. బాబాయిని చంపి రాజకీయం చేసినట్టు.. నేరాలు చేయాలని చూస్తున్నారు. ప్రజలు ఒక్కసారే మోసపోతారు. ఇక్కడున్నది ఎన్డీయే ప్రభుత్వం.. నడిపించేది సీబీఎన్. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉండాలి అప్పుడే పెట్టుబడులు వస్తాయి. కక్ష తీర్చుకోవడానికి నేను రాజకీయాల్లోకి రాలేదు. తెలుగు జాతిని బాగు చేయడానికి వచ్చాను. నాడు ఎన్టీఆర్.. నేడు నాది ఒకే లక్ష్యం. రాష్ట్రం ఏమవుతుందోననే ఆందోళనతో ఉన్న వారికి 18 నెలల్లో భరోసా కల్పించాం. తెలుగు జాతిలో ఆత్మవిశ్వాసం నింపాం. రాబోయే రోజుల్లో మరింత ముందుకు తీసుకెళ్తాం.

మొత్తం పెట్టుబడుల్లో 25% మనకే

దేశంలో వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికే వచ్చాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా కాకినాడలో ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసుకున్నాం. ఇదీ తెలుగువారి సత్తా. సమైక్య రాష్ట్రం, నవ్యాంధ్రలో సాగునీటి ప్రాజెక్టులకు టీడీపీ ప్రాణం పోసింది. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. శ్రీకాకుళంలోని వంశధార నుంచి నెల్లూరులోని పెన్నా వరకు నదుల అనుసంధానం చేస్తాం. గత ప్రభుత్వంలో రూ.32 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపారు. రూ.1.20 లక్షల కోట్ల మేరకు అప్పులు పెట్టారు. మా ప్రభుత్వం వచ్చాక.. రూ.4,600 కోట్ల ట్రూఅప్ చార్జీలు వేస్తే వాటిని ప్రభుత్వమే భరిస్తోంది.

యుగపురుషుడు ఎన్టీఆర్

ఎన్టీఆర్ భౌతికంగా మనకు దూరమైనా.. తెలుగు జాతి గుండెల్లో శాశ్వతంగా ఉన్న ఏకైక నాయకుడు. తెలుగుజాతి ఖ్యాతిని ఎవరెస్ట్ అంత ఎత్తుకు తీసుకెళ్లిన యుగపురుషుడు. పార్టీ పెట్టిన 9 నెలల్లో అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించారు. సుపరిపాలనకు అర్థం చెప్పారు. మహిళలకు ఆస్తిలో హక్కు తీసుకొచ్చారు. తర్వాత అది చట్టం అయింది. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించారు. మహిళలకు స్థానిక సంస్థల్లో 9శాతం రిజర్వేషన్లు కల్పించారు. దాన్ని నేను 33 శాతం చేశాను. రాబోయే ఎన్నికల్లో పార్లమెంటు, శాసనసభల్లో 33 శాతం సీట్లు మహిళలకు రాబోతున్నాయి. మార్పునకు ఇది నాంది. ఎన్టీఆర్ రూ.2కే కిలో బియ్యం ఇచ్చి ఆహార భద్రతకు నాంది పలికారు. తిరుమలలో అన్నదానం ప్రవేశపెట్టారు. నేడు మనం అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే అన్నం పెడుతున్నాం. ఎన్టీఆర్ వృద్ధులకు రూ.35తో పింఛను ప్రారంభించారు. దాన్ని రూ.70 చేశాను. ఆ తర్వాత మళ్లీ రూ.2వేలకు పెంచాను. ఇప్పుడు రూ.4వేలు ఇస్తున్నాం. పేదలకు ఎన్టీఆర్ పక్కా ఇళ్లను ఇచ్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో 3సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు స్థలం ఇవ్వడంతోపాటు ఇళ్లను కూడా నిర్మించి ఇస్తున్నాం. ఇటీవల 3 లక్షల గృహప్రవేశాలు చేశాం. ఉగాది రోజు 5 లక్షల గృహ ప్రవేశాలు ఉంటాయి. 'సూపర్ సిక్స్'ను సూపర్ హిట్ చేశాం. త్వరలో మరిన్ని ఉద్యోగ నియామకాలు చేపడతాం.

పార్టీని అశ్రద్ధ చేయను..

నాకు ఎన్ని పనులున్నా పార్టీ విషయంలో అశ్రద్ధ చేయను. కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ పనిచేస్తోంది. చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటున్నాం. ప్రత్యేకంగా స్కూలు పెట్టి చదివిస్తున్నాం. దేశంలో ఏ పార్టీకి లేనంతగా కోటి మంది కార్యకర్తలు టీడీపీకి ఉన్నారు. కోటి కుటుంబాలు మన పార్టీకి ఉన్నాయి. ఇది నా అదృష్టం. టీడీపీ జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించింది. జాతీయ రాజకీయాల్లో కీలకంగా ఉన్నా రాష్ట్రాభివృద్ధికే అధిక ప్రాధాన్యత ఇచ్చాం. ప్రధాని మోదీ రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తున్నారు. మన వైపు నుంచి మోదీకి అదే సహకారం అందిస్తున్నాం. ప్రభుత్వం కొనసాగుతూ ఉంటేనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంది. కేంద్రంలో 3వ సారి మోదీ ప్రధాని అయి దేశం సత్తా చాటారు. గుజరాత్‌లో 5 సార్లు బీజేపీ గెలిచింది. దీన్ని మనం ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలి. కాగా.. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎన్టీఆర్ 30వ వర్ధంతిని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన అభిమానులు, కార్యకర్తలకు సీఎం చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.

మూడు ప్రాంతాల్లో సమాన అభివృద్ధి

అమరావతిని స్మశానం.. ఎడారి అని మాట్లాడారు. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారు. సీఎం ఎక్కడుంటే అదే రాజధాని అంట.. ఈయన(జగన్) బెంగళూరులో ఉంటే బెంగళూరు ఏపీ రాజధాని అయిపోతుందా.. ఇడుపులపాయలో ఉంటే ఇడుపులపాయ రాజధాని అయిపోతుందా?. ఓ పార్టీ నిర్వహించే వ్యక్తి ఇలాగేనా మాట్లాడేది. 5 ఏళ్ల మీ రాజధాని ఏదీ అంటే ఎక్కడా చెప్పుకోలేని పరిస్థితి. మూడు రాజధానులు అని చెప్పిన చోట ప్రజలు ఆ పార్టీని(వైసీపీ) తిప్పికొట్టి.. ఎన్డీయే అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిచారు. ఏపీ రాజధాని అమరావతే అని గర్వంగా కాలర్ ఎగరేసి చెప్పుకొందాం. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం. విశాఖను నంబర్ వన్ సిటీ చేస్తాం. తిరుపతి మెగా సిటీగా అవతరిస్తోంది.

భార్యనే అక్కగా చూపి టోకరా!

మహిళా టెకీకి రూ.1.75 కోట్ల మస్కా

- మ్యాట్రిమొని వెబ్‌సైట్ ద్వారా పరిచయం
- 715 కోట్ల ఆస్తులున్న పారిశ్రామికవేత్తనంటూ ఎర
- నమ్మించేందుకు కుటుంబమంతా రంగంలోకి
- కలిసి వ్యాపారం చేద్దామంటూ బ్యాంకుల్లో అప్పులు
- సోషల్ మీడియా ఖాతాల్లో బయటపడిన అసలు రంగు

బెంగళూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ వివాహ పరిచయ వేదిక ద్వారా పరిచయమైన మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను పెళ్లి కాలేదని నమ్మించేందుకు భార్యనే అక్కగా పరిచయం చేసి రూ.1.75 కోట్లు దోచుకున్నాడు. ఈ మోసంలో కుటుంబ సభ్యులందరినీ భాగస్వాములను చేశాడు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. నగరంలోని వైట్‌ఫీల్డ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ యువతికి గతేడాది మార్చిలో మ్యాట్రిమోని వెబ్‌సైట్ ద్వారా విజయ్‌రాజ్‌గౌడ పరిచయమయ్యాడు. తాను పారిశ్రామికవేత్తనని, రూ.715 కోట్ల ఆస్తులున్నాయని నమ్మించాడు. విజయరాజ్‌గౌడకు అప్పటికే సౌమ్యతో పెళ్లి కాగా.. వీరికి ఓ బిడ్డ ఉంది. అయితే, సౌమ్యను తన అక్కగా యువతికి పరిచయం చేశాడు. యువతిని కెంగేరికి పిలిపించుకుని కుటుంబసభ్యులను పరిచయం చేశాడు. వారంతా కలిసి పెళ్లికి సంబంధించిన అంశాలు చర్చించారు. తన తండ్రి రిటైర్డ్ తహసీల్దార్ అని నమ్మించాడు. కోడలిని బాగా చూసుకుంటామని, కట్నంగా ఇచ్చే సొమ్ముకు తాను గ్యారెంటీ అంటూ విజయ్ తండ్రి బోరేగౌడ భరోసా ఇచ్చాడు. ఆ తర్వాత కొన్నిరోజులకు విజయ్ తన అసలు రూపాన్ని బయటపెట్టాడు. తన ఆస్తులపై ఈడీ కేసు నమోదు చేసిందని, బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేశారంటూ నకిలీ కోర్టు కాపీలు చూపించాడు. తొలుత అవసరమని యువతి నుంచి రూ.15వేలు తీసుకున్నాడు. తర్వాత కలిసి వ్యాపారం చేద్దామని నమ్మించి యువతి పేరిట పలు బ్యాంకుల్లో అప్పులు తీసుకున్నాడు. బిజినెస్‌లో లాభం వస్తుందంటూ యువతి స్నేహితుల నుంచీ లక్షలాది రూపాయలు తీసుకున్నాడు. ఇలా విడతలవారీగా రూ.1.75 కోట్లు స్వాహా చేశాడు. డబ్బు తిరిగివ్వాలని అడిగితే ఓసారి హైకోర్టులో, మరోసారి సుప్రీంకోర్టులో కేసులున్నాయంటూ వాయిదాలు వేస్తూ వచ్చాడు. తీవ్రంగా ఒత్తిడి చేయడంతో మళ్లీ డబ్బు అడిగితే హతమారుస్తానని యువతిని బెదిరించాడు. అతడి సోషల్ మీడియా ఖాతాలను యువతి పరిశీలించగా.. అతడికి అప్పటికే పెళ్లి అయిన విషయం వెలుగులోకి వచ్చింది. అక్కగా పరిచయం చేసిన సౌమ్యనే అతని భార్య అని తెలిసింది. దీంతో మోసపోయానంటూ యువతి ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన వైట్‌ఫీల్డ్ పోలీసులు కెంగేరి పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు.

దావోస్‌కు సీఎం చంద్రబాబు బృందం

అమరావతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు బయలుదేరి వెళ్లారు. ఆదివారం రాత్రి 8.30కు విజయవాడ నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లిన చంద్రబాబు అక్కడినుంచి సోమవారం జ్యూరిక్‌కు చేరుకుంటారు. ఆయనతోపాటు మంత్రులు లోకేశ్, టీజీ భరత్, పలువురు అధికారులు కూడా బయల్దేరి వెళ్లారు. సోమవారం జ్యూరిక్‌లో జరిగే తెలుగు డయాస్పోరా సమావేశంలో సీఎంతో పాటు లోకేశ్ తదితరులు పాల్గొంటారు. అనంతరం జ్యూరిక్ నుంచి రోడ్డు మార్గంలో దావోస్‌కు వెళ్తారు.

24న వెలిగొండకు చంద్రబాబు

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఈ నెల 24న మార్కాపురం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు క్షేత్ర పర్యటనకు వెళ్లనున్నారు. దావోస్ నుంచి వచ్చిన వెంటనే వెలిగొండకు వెళ్తానని ఆయన జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వెల్లడించారు. వెలిగొండ ప్రాజెక్టును ఈ ఏడాదిలో వేగంగా పూర్తి చేయాలన్న ఆకాంక్షతో పాటు ఎన్నికలకు ముందు పనులు పూర్తికాకున్నా ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేసిన నాటి సీఎం జగన్ చేసిన మోసాన్ని రాష్ట్ర ప్రజల ముందుంచే ద్విముఖ వ్యూహంతో ప్రభుత్వం ఉంది. వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్‌తో సహా ప్రధాన పనులు పూర్తికాకుండానే దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రకాశం జిల్లా వాసులను మోసగించేలా.. జగన్ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో ప్రాజెక్టును అట్టహాసంగా ప్రారంభించారు. ప్రాజెక్టుకు సమీపంలోనే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చేపడితే.. జగన్ నిర్వాకం బయటపడుతుందని, దూరంగా బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ నెల 24 నాటి పర్యటనలో ఇంకా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు పనులను ప్రజలకు ప్రత్యక్షంగా చూపించడం ద్వారా జగన్ మోసాన్ని బట్టబయలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పెండింగ్ పనులన్నీ ఈ ఏడాదిలోనే పూర్తి చేయడం ద్వారా ప్రాజెక్టులపై ఉన్న చిత్తశుద్ధిని ప్రజలకు చెప్పాలని భావిస్తోంది.

ప్రాజెక్టు పూర్తికి రూ.2,041 కోట్లు అవసరం

వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలంటే రూ.2,041.98 కోట్లు వ్యయం చేయాల్సి ఉంది. టన్నెళ్లు, ప్రధాన కాలువ పనులకు రూ.637.43 కోట్లు అవసరం. కాలువలు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ కోసం రూ.341.68 కోట్లు అవసరమవుతాయి. సహాయ, పునరావాసం పనుల కింద ఏడు కాలనీల నిర్మాణం కోసం రూ.37 కోట్లు కావాలి. 7,321 నిర్వాసిత కుటుంబాల కోసం రూ.886.55 కోట్లు అవసరమవుతాయి. భూసేకరణ (1233.41 ఎకరాలు) కోసం రూ.139.32 కోట్లు కావాలి. ఈ పనులన్నింటినీ ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థ హామీ ఇస్తోంది.

తమిళనాడు సీఎం స్టాలిన్‌కు కేంద్రం ఝలక్

- హోసూరులో గ్రీన్ ఎయిర్‌పోర్ట్‌కు అనుమతి నిరాకరణ
- రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా స్పష్టం చేసిన రక్షణ శాఖ

చెన్నై, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు కేంద్ర ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. కృష్ణగిరి జిల్లాలోని పరిశ్రమల నగరం హోసూరు వద్ద గ్రీన్ ఎయిర్‌పోర్టు నిర్మించేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరించింది. విమానాశ్రయం కోసం ఇప్పటికే 12 గ్రామాల పరిధిలో 2,980 ఎకరాల భూసేకరణ కోసం ముమ్మరంగా పని చేస్తున్న ఉన్నతాధికారులు ఈ ప్రకటనతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. హోసూరులో గ్రీన్ ఎయిర్‌పోర్టును నిర్మించనున్నట్లు సీఎం స్టాలిన్ గతేడాది ప్రకటించారు. హోసూరు, దాని పరిసరాల్లో ఎన్నో స్వదేశీ, విదేశీ కర్మాగారాలు ఉన్నాయి. దగ్గరలో విమానాశ్రయం లేక ఆ పరిశ్రమలన్నీ బెంగళూరు విమానాశ్రయం నుంచే తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. హోసూరులో విమానాశ్రయం ఏర్పాటుతో ఖర్చులు బాగా తగ్గిపోతాయని పరిశ్రమల యజమానులు భావించారు. ఈ నేపథ్యంలోనే హోసూరులో విమానాశ్రయ నిర్మాణానికి అనుమతి ఇవ్వలేమంటూ కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. హోసూరు పరిసర ప్రాంతాల్లోని ఆకాశ మార్గాలన్నీ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) కట్టుబాట్లలో ఉన్నాయని, అక్కడి నుంచి సైనిక, పరిశోధనాత్మక విమానాలు ఎగరటానికే ప్రాధాన్యం కల్పిస్తున్నట్టు లేఖలో పేర్కొంది. ఈ పరిస్థితుల్లో అక్కడ ప్రయాణికుల విమానాల రాకపోకలకు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేసింది.

'చార్‌ధామ్ ఆలయాల్లో' సెల్‌ఫోన్లు, కెమెరాలపై నిషేధం!

డెహ్రాడూన్, జనవరి 18: చార్‌ధామ్ యాత్రలో ఆలయాల్లోకి సెల్‌ఫోన్లు, కెమెరాలను అనుమతించరాదని నిర్ణయించారు. ఆలయాల్లోకి వీటిని అనుమతించడం వల్ల దర్శన సమయాల్లో అనేక సమస్యలు ఎదురవుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా మేజిస్ట్రేట్‌లు, సీనియర్ ఎస్పీల సమావేశంలో దీనిపై సమీక్షించారు. దర్శనానికి వెళ్లే సమయంలో భక్తులు మొబైల్ ఫోన్లు, కెమెరాలను వెలుపల సిబ్బందికి అప్పగించాలని అధికారులు తెలిపారు. ఇకపై ఆలయం బ్యాక్‌గ్రౌండ్‌లో ఫొటోలు, వీడియోలు తీసుకోవడానికి మాత్రమే అనుమతిస్తారని, ఆలయం లోపలికి మాత్రం ఫోన్లు, కెమెరాలను అనుమతించబోరని స్పష్టం చేశారు. గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లను గత ఏడాది 50 లక్షలకు పైగా భక్తులు సందర్శించారని, ఈ ఏడాది కూడా యాత్ర సజావుగా సాగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఏపీ జెన్కో ఇన్‌చార్జి ఎండీగా పుల్లారెడ్డి

అమరావతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్కో ఇన్‌చార్జి ఎండీగా ఏపీసీపీడీసీఎల్ సీఎండీగా ఉన్న పొగాకు పుల్లారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఎండీగా ఉన్న ఎస్.నాగలక్ష్మి జూలై 17 వరకు ప్రసూతి సెలవుపై వెళుతున్నారు. ఈ నేపథ్యంలో అప్పటి వరకు పుల్లారెడ్డిని ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జెన్కోతోపాటు ఏపీ స్టేట్ ఎనర్జీ ఎఫిషియన్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కి, ఏపీస్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్‌కు కూడా పుల్లారెడ్డి ఇన్‌చార్జి సీఈవోగా వ్యవహరిస్తారు.

రేపు ఆత్మార్పణ దినం

- ప్రభుత్వం తరఫున కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మాఘ శుద్ధ విదియ నాడు రాష్ట్ర పండుగగా నిర్వహించే 'ఆత్మార్పణ దినం' సందర్భంగా ప్రభుత్వం తరఫున మంత్రి నిమ్మల రామానాయుడు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ ఎక్స్‌అఫిషియో సెక్రటరీ డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ గ్రామంలో ఉన్న శ్రీ నాగేశ్వర స్వామి, మహిశాసురమర్దిని, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ నెల 20వ తేదీన ఆత్మార్పణ దినంగా ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం చంద్రబాబు దావోస్‌కు వెళ్లిన నేపథ్యంలో ఆయన స్థానంలో మంత్రి నిమ్మల ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

అమ్ముడుపోయిన కోటరీల మధ్య బందీలు!

- భవిష్యత్తులో మీ గతేంటో ఇప్పటికైనా గుర్తించండి
- 'ఎక్స్'లో చేసిన పోస్టులో విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు
- వెనిజువెలా అంశాన్ని ముడిపెడుతూ హెచ్చరికలు
- ఆ బందీ జగనేనా?.. రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ



అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ నాయకుడు వి.విజయసాయిరెడ్డి ఆదివారం 'ఎక్స్'లో చేసిన ఓ పోస్టు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 'అమ్ముడుపోయిన కోటరీల మధ్య బందీలుగా ఉన్న ఓ ప్రజానాయకులారా ఆలోచించుకోండి. భవిష్యత్తులో ఇక్కడ మీకూ ఏం జరగబోతోందో ఇప్పటికైనా గుర్తించండి. వెనిజువెలాలో భారీ ప్రజాదరణతో ఎన్నికైన తర్వాత.. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, ఇంటెలిజెన్స్ అధిపతులు ఇంతమంది చుట్టూ ఉన్నా.. మిస్సైళ్లు, యుద్ధ విమానాలు, భారీ సైన్యం ఎంతగా ఉన్నా.. ఆ దేశాధ్యక్షుడిని, అతడి భార్యని ప్రెసిడెన్షియల్ ప్యాలెస్ నుంచి అమెరికా ఎలాంటి ప్రతిఘటనా లేకుండా తీసుకెళ్లిందంటే కారణం ఏమిటి? వారంతా అమ్ముడుపోవడమే కదా!' అని ఆ పోస్టులో విజయసాయి వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు పరోక్షంగా వైసీపీ అధ్యక్షుడు జగన్‌ను ఉద్దేశించినవేనని చర్చ సాగుతోంది. ఈమధ్య కాలంలో విజయసాయి రాజకీయాలపై మాట్లాడటం లేదు. కానీ, జగన్‌పై తన మనసు విరిగిపోయిందని, ఆయన పిలిచినా వైసీపీలోకి వెళ్లబోనంటూ ఇటీవల ఒక ప్రైవేట్ ఇంటర్వ్యూలో మాజీ ఎంపీ వెల్లడించారు. జగన్ ప్రస్తావన వచ్చిన ప్రతిసారీ 'కోటరీ' అని మాట్లాడుతున్నారు. తాజా ట్వీట్‌లోనూ ఈ ప్రస్తావన తీసుకువచ్చారు. ఎంతటి బలమైన ప్రజా నాయకుడైనా అమ్ముడుపోయిన కోటరీతో జరిగే నష్టమేమిటో ఇప్పటికైనా గుర్తించాలని వెనిజువెలా అధ్యక్షుడి అంశాన్ని ముడిపెడుతూ హెచ్చరించారు. 2019 ఎన్నికల్లో 151 అసెంబ్లీ స్థానాలతో గెలిచిన బలమైన పార్టీగా గుర్తింపు పొందిన వైసీపీ... ఐదేళ్ల తిరిగేలోగా 11 స్థానాలకే పరిమితం కావడాన్ని విజయసాయి పరోక్షంగా ప్రస్తావించారని చెబుతున్నారు. ప్రజాబలం ఉందని నిరంకుశంగా వ్యవహరిస్తూ కోటరీ ఉచ్చులో పడితే.. జనం నిర్మొహమాటంగా తిరస్కరిస్తారని స్పష్టం చేశారు. బలమైన వ్యవస్థలు ఉన్నా కోటరీ దెబ్బకు అశక్తులుగా మారడం ఖాయమని తేల్చిచెప్పారు. పదేపదే కోటరీ అంశాన్ని ప్రస్తావించడం ద్వారా జగన్‌కు విజయసాయి తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే విజయసాయిపై ఆగ్రహంతో ఉన్న జగన్... ఈ హెచ్చరికలను పట్టించుకుంటారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కోటరీపై విజయసాయి ఎన్ని హెచ్చరికలు చేసినా జగన్ వైఖరిలో మార్పు రాదని వైసీపీ వర్గాలు తేల్చి చెబుతున్నాయి.

వెళ్లాలని లేకున్నా.. వెళ్తున్నా..!



ఏలూరు జిల్లా కలపర్రు టోల్‌గేట్ వద్ద బారులుదీరిన వాహనాలు

తెలుగు వారికి పెద్ద పండుగైన సంక్రాంతికి సుదూర ప్రాంతాల నుంచి స్వస్థలాలకు వచ్చిన వారంతా.. తమ కుటుంబాలతో సరదాగా, ఆనందంగా గడిపారు. మరచిపోలేని ఆ తియ్యని జ్ఞాపకాలను మూటకట్టుకున్నారు! ఇప్పుడు పండుగ అయిపోయింది!! ఊరిని విడిచి తిరిగి వెళ్లాలని లేకున్నా.. ఉద్యోగం, విద్య, వ్యాపార రీత్యా వచ్చిన వారంతా తిరుగుముఖం పట్టారు. దీంతో ఆదివారం ఏలూరు జిల్లాలోని రోడ్లపై వాహనాల రద్దీ నెలకొంది. ఏలూరు రైల్వేస్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసింది. బస్టాండ్ల వద్ద కూడా ఇదే రద్దీ కన్పించింది. కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహనాలు బారులు దీరాయి. రాత్రి ఎనిమిది గంటల వరకు 20,764 వాహనాలు టోల్‌గేట్ దాటి విజయవాడ వైపు పయనించాయి.

- ఏలూరు/ఏలూరు క్రైం-ఆంధ్రజ్యోతి



ఏలూరు రైల్వేస్టేషన్ వద్ద ప్రయాణికుల రద్దీ

రైతు ఓకే అంటేనే ఫైనల్!

(మొదటి పేజీ తరువాయి)

తొలుత రైతుల భూములు కొలవాలంటే వారికి ఈ-కేవైసీ ఆధారంగా నోటీసులు ఇస్తారు. దీనికి వాట్సాప్, రెగ్యులర్ మెసేజింగ్ సర్వీసెస్(ఆర్ఎంఎ్‌స)ను ఉపయోగించుకుంటారు. దీంతో ఇప్పుడు ఉన్న వెబ్‌ల్యాండ్‌లో పేర్కొన్న డేటా ఆధారంగా రైతుల ఫోన్ నెంబర్లకు రీ-సర్వే మెసేజ్‌లు పంపిస్తారు. దీనిలో భూమి కొలతలు వేసే సమయాన్ని స్పష్టంగా పేర్కొంటారు. ఇలా నోటీసుల జారీ నుంచి భూముల కొలతలు వేయడం, రైతుల నుంచి అభ్యంతరాలు వస్తే వాటిని పరిష్కరించడానికి 90 రోజుల కాలవ్యవధిని నిర్దేశించారు. గ్రామస్థాయిలో సర్వేయర్(వీఎస్), రెవెన్యూ అధికారి(వీఆర్వో)లకు బాధ్యత అప్పగించారు. సర్వే అనంతరం భూములకు ల్యాండ్‌పార్సిల్ మ్యాప్‌లు, వాటికి నెంబర్లు కేటాయించడం, మ్యాప్‌ల్లో విస్తీర్ణంపై వచ్చే తప్పులను సరిచేసే బాధ్యతలను గ్రామ సర్వేయర్, రెవెన్యూ అధికారికి అప్పగించారు. భూముల కొలతలు వేసిన తర్వాత సర్వేయర్లు రూపొందించిన డేటా పరిశీలన, నిర్ధారణ, గ్రామ సభ నిర్వహణకు 12 రోజుల కాలవ్యవధిని నిర్దేశించారు. భూముల సర్వే అనంతరం పట్టా భూముల రికార్డును ఆర్డీవో స్థాయిలో ఆమోదించాలని ఆదేశించారు. తదుపరి జాయింట్ కలెక్టర్(జేసీ)



ఆమోదం కోసం ఫైలు పంపించాల్సిన అవసరం లేదని స్పష్టత ఇచ్చారు. అయితే, ప్రభుత్వ భూముల రికార్డును ఆమోదించే బాధ్యతను జేసీకే అప్పగించారు. భూముల సర్వేపూర్తయిన తర్వాత సర్వే-సరిహద్దుల చట్టం ప్రకారం నోటిఫికేషన్ 13 జారీచేసే బాధ్యతను జేసీకి అప్పగించారు. ఆ తర్వాత భూమి హక్కుల(ఆర్వోఆర్) ముసాయిదా రికార్డును గ్రామ సభలో చర్చించి ఆమోదించాలని తాజా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. దీనికి 15 రోజుల వ్యవధిని ఇచ్చారు.

ఆది నుంచి తుది వరకు..

గ్రామంలోని రైతులు, పట్టాదారులను పిలిచి సభ నిర్వహిస్తారు. రీ-సర్వే రికార్డులను ప్రదర్శిస్తారు. అధికారులు రూపొందించిన భూమి హక్కుల ముసాయిదా రికార్డులను రైతుల సమక్షంలో ఉంచుతారు. రైతుల భూమి వివరాలు, వాటి విస్తీర్ణం, పాస్‌పుస్తకాలు, వీటిలోని అంశాలను గ్రామసభలో పేరుపేరునా చదివి వినిపిస్తారు. దీనికిగాను రైతుల నుంచి మరో దఫా ఈ-కేవైసీ కింద ఆమోదం తీసుకుంటారు. రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను వెంటనే పరిష్కరిస్తారు. ఆ తర్వాతే భూమి హక్కుల(ఆర్వోఆర్) తుది రికార్డును జిల్లా గెజిట్‌లోని ఫామ్-4లో ప్రచురిస్తారు.

రెవెన్యూ, సర్వే అధికారులకు లాగిన్‌లు

రీ-సర్వే నూతన విధివిధానాలు, మార్గదర్శకాల అమలుకోసం ఈసారి వెబ్‌ల్యాండ్ 1.0లో ఆన్‌లైన్ లాగిన్‌లు గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్వో), సర్వేయర్‌లకు ఇచ్చారు. గ్రామ సర్వేయర్ ఇచ్చిన లాగిన్‌లో కొత్తగా 'రిమార్క్స్' అనే అంశాన్ని చేర్చారు. దీంతోపాటు మ్యుటేషన్ అవసరం, మ్యుటేషన్ అవసరం లేదు, సాదా బైనమా అవసరం అనే కాలమ్‌లను చేర్చారు. అంటే, ఆయా అంశాలకు సంబంధించి వారు ప్రస్తావించే అవకాశం కల్పించారు. వీఆర్వోకు ఇచ్చిన లాగిన్‌లో మ్యుటేషన్, కరెక్షన్(భూమి రకం, స్వభావం), అక్షరదోషాల అంశాలను వీఆర్వో తన లాగిన్ ద్వారా నివేదించే అవకాశం కల్పించారు.



కాకినాడ జిల్లా జగ్గంపేట ఫ్లైఓవర్ వద్ద హైవేపై ఆగిపోయిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు నుంచి పొగలు

- కిందకు దిగి పరుగులు తీసిన ప్రయాణికులు

జగ్గంపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట హైవేపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులోనుంచి పొగలు రావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురై ఒక్కసారిగా కిందకు దిగి పరుగులు తీశారు. సంక్రాంతి సెలవులు ముగియడంతో దూరప్రాంతాలవారు ఎక్కడికక్కడ తిరుగు ప్రయాణమవుతున్నారు. ఈ నేపథ్యంలో వైజాగ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సులో ఆదివారం రాత్రి 10.30 సమయంలో ఒక్కసారిగా పొగలు వ్యాపించాయి. దీంతో జగ్గంపేట ఫ్లైఓవర్‌పై బస్సును డ్రైవర్ వెంటనే నిలుపుదల చేశాడు. దీంతో ప్రయాణికులు బస్సు నుంచి కిందకు దిగి ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ సమయంలో బస్సులో 35మంది ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇంజన్‌లో సాంకేతిక లోపంతో మంటలు వ్యాపించినట్లుగా తెలుస్తోంది.

భారత్-పాక్ సరిహద్దులో మారణాయుధాలు లభ్యం

పఠాన్‌కోట్, జనవరి 18: పంజాబ్ రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు పాకిస్థాన్ పన్నిన కుట్రను భద్రతా దళాలు భగ్నం చేశాయి. భారత్-పాక్ సరిహద్దుకు సమీపంలోని నరోత్ జైమల్ సింగ్ ప్రాంతంలో పఠాన్‌కోట్ పోలీసులు, కేంద్ర నిఘా సంస్థలు నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో మారణాయుధాలు, మందుగుండు సామగ్రి లభించాయి. ఈ తనిఖీల్లో భాగంగా పోలీసులు మూడు ఏకే-47 రైఫిళ్లు, ఐదు మ్యాగజీన్లు, టర్కీ, చైనా దేశాలలో తయారైన రెండు పిస్టళ్లు, వాటికి సంబంధించిన రెండు మ్యాగజీన్లు, 98 తూటాలను స్వాధీనం చేసుకున్నారు.

హార్వర్డ్ విద్యార్థిగా రేవంత్!

- వారం రోజుల కోర్సులో చేరనున్న టీ సీఎం
- '21వ శతాబ్దం కోసం నాయకత్వం'పై కోర్సు

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మరోమారు విద్యార్థి అయి.. కాలేజీకి వెళ్లనున్నారు. అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీ.. '21వ శతాబ్దం కోసం నాయకత్వం' అనే అంశంపై నిర్వహిస్తున్న వారం రోజుల కోర్సులో ఆయన చేరనున్నారు. మేడారం పర్యటన ముగిసిన వెంటనే పెట్టుబడుల సదస్సులో పాల్గొనేందుకు సీఎం సోమవారం దావోస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లనున్న సంగతి తెలిసిందే. ఆ సదస్సు ముగిసిన తర్వాత.. ఈ నెల 23న అక్కడి నుంచి అమెరికాకు వెళతారు. హార్వర్డ్ కెనెడీ స్కూల్- ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తున్న వారం రోజుల కోర్సుకు సంబంధించి ఈ నెల 25 నుంచి 30 వరకు జరిగే క్లాసులకు విద్యార్థిగా రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. కోర్సు ముగిసిన అనంతరం.. హార్వర్డ్ యూనివర్సిటీ అందజేసే సర్టిఫికెట్‌ను తీసుకొని అమెరికా నుంచి తిరుగు ప్రయాణమవుతారు. ఫిబ్రవరి 2న హైదరాబాద్‌కు చేరుకుంటారు. కాగా, హార్వర్డ్ కెనెడీ స్కూల్ నిర్వహిస్తున్న ఈ వారం రోజుల కోర్సు.. అనుభవజ్ఞులైన నాయకుల కోసం రూపొందించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం. క్లిష్టమైన పరిస్థితుల్లో నాయకత్వం ఎలా ఉండాలి? అనిశ్చిత పరిస్థితులు, మార్పులు, విభేధాలను ఎలా ఎదుర్కోవాలి? అనే అంశాలు ఈ కోర్సులో ఉంటాయి. భారత్ నుంచి ఈ తరహా కోర్సుకు ప్రత్యక్షంగా హాజరై అభ్యసించనున్న తొలి సీఎం రేవంత్‌రెడ్డే కావడం గమనార్హం.

ఒక్క క్లిక్‌తో 'కిసాన్ డ్రోన్' సేవలు



- క్యాబ్ తరహాలో డ్రోన్‌ను బుక్ చేసుకునే విధానం
- రైతులకు అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం
- ప్లే స్టోర్‌లో 'ఉబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్' యాప్

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఒక్క క్లిక్‌తోనే 'కిసాన్ డ్రోన్' సేవలు అందుబాటులోకి వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. క్యాబ్ బుకింగ్ తరహాలో రైతులు కూడా కిసాన్ డ్రోన్లను బుక్ చేసుకునే విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ ద్వారా 'ఉబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దానిద్వారా డ్రోన్లను బుక్ చేసుకోవచ్చు. లేదా రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ ఏర్పాటుచేసిన డ్రోన్ సేవల వాల్‌పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, డ్రోన్ సేవల్ని ఉపయోగించుకోవచ్చు. ఈ యాప్ ద్వారా అనేక రకాల సేవల్ని రైతులు పొందవచ్చని వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. "రాష్ట్రంలో ఎక్కడైనా పొలాలకు పురుగుమందులు, ఎరువులు, విత్తనాలు చల్లడానికి డ్రోన్‌ను అద్దెకు తీసుకోవచ్చు. ఎక్కువ విస్తీర్ణం ఉన్నా.. డ్రోన్‌తో సులభంగా పని అయిపోతుంది. సమయం, కూలీల ఖర్చు ఆదా అవుతుంది. దాదాపు సమీప డ్రోన్ నిర్వాహకుల నుంచే సేవలు పొందే అవకాశం ఉంటుంది. దూరం, విస్తీర్ణాన్ని బట్టి డ్రోన్ నిర్వాహకులు చార్జీవసూలు చేస్తారు" అని తెలిపారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవేర్ సేవలు..!

- సచివాలయాల వారీగా డేటా సేకరణ: ఆరోగ్యశాఖ

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీజనల్ వ్యాధులను రియల్ టైమ్‌లో పర్యవేక్షించి, వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవడానికి రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)లోని అవేర్ విభాగం సేవలను వినియోగించుకుంటామని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీజీఎస్ 'అవేర్' (అడ్వాన్స్ వార్నింగ్ అడ్వైజరీ ఫర్ రిసిలియెంట్ ఎకోసిస్టమ్) ద్వారా రాష్ట్రంలో వ్యాధుల తీవ్రత, వ్యాప్తికి ఉన్న అవకాశాలను ప్రాథమిక దశలోనే గుర్తించి వాటిని వెంటనే నివారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత ఐదారు సంవత్సరాల్లో గ్రామాలు, సచివాలయాల వారీగా అంటువ్యాధులు, సీజనల్ వ్యాధుల కేసుల డేటాను విశ్లేషిస్తామని మంత్రి సత్యకుమార్ వివరించారు.

జాబ్ క్యాలెండర్ ఎప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)

దాని ఊసెత్తలేదు. ప్రతి సంవత్సరం జనవరి 1న జాబ్ క్యాలెండర్ ఇస్తామని హామీలు ఇచ్చి ఐదేళ్లలో ఒకే ఒక్కసారి జాబ్ క్యాలెండర్ ప్రకటించారు. అయితే ఆ ఒక్కటి కూడా అమలుకాలేదు. మొత్తం వైసీపీ హయాంలో సుమారు 5 వేల ప్రభుత్వ ఉద్యోగాలే భర్తీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో లక్షకు పైగా ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకొన్నప్పటికీ అవి కొత్తగా సృష్టించినవే తప్ప అప్పటికే ఉన్న ఖాళీలు కాదు. 2019 ఎన్నికలకు ముందు ఆ సమయంలో ఖాళీగా ఉన్న 2.3 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని జగన్ అనేక సార్లు హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక సచివాలయాలు మినహా ఉపాధ్యాయ సహా ఇతర ఉద్యోగాల భర్తీ జోలికి వెళ్లలేదు. దీంతో ఐదేళ్లపాటు ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసిన నిరుద్యోగులు కూటమి ప్రభుత్వం అయినా తమ ఆశలు నెరవేరుస్తుందనే భావిస్తున్నారు. గత ప్రభుత్వం సక్రమంగా నోటిఫికేషన్లు ఇవ్వకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వం రాగానే జాబ్ క్యాలెండర్ ఇవ్వాలనే డిమాండ్లు మొదలయ్యాయి. ఏడాదిన్నర గడిచిపోవడంతో ఆ డిమాండ్లు ఇప్పుడు మరింతగా పెరుగుతున్నాయి.

డీఎస్సీపై ఉన్న శ్రద్ధ లేదు

సాధారణంగా టీడీపీ ప్రభుత్వం అంటే 'డీఎస్సీ' కచ్చితంగా ఇస్తారనే ముద్ర ఉంది. దీనికి అనుగుణంగానే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేనివిధంగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలచేసి ఒకేసారి 16 వేల టీచర్ పోస్టుల ఖాళీలను భర్తీ చేసింది. ఇది కూటమి ప్రభుత్వానికి పెద్ద మైలేజీ తెచ్చిపెట్టింది. మెగా డీఎస్సీ ఇస్తామన్న జగన్.. ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. మరోవైపు వచ్చే ఫిబ్రవరిలో మరో డీఎస్సీ ఇచ్చేందుకు కూడా ప్రస్తుత సర్కారు సిద్ధమైంది. అలాగే ఇకపై ఏటా డీఎస్సీ ఇస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. అయితే, డీఎస్సీలపై ఉన్న శ్రద్ధ ఇతర ఉద్యోగ నోటిఫికేషన్లపై పెద్దగా కనిపించడం లేదనే వాదన వినిపిస్తోంది. దీంతో తమకూ డీఎస్సీ తరహాలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీచేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

మిగిలిపోయిన పోస్టులకే

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం వచ్చాక గత ఏడాది ఏపీపీఎస్సీ సుమారు 80 పోస్టుల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్లు జారీచేసింది. అవి కూడా అంతకముందు ఇచ్చిన నోటిఫికేషన్లలో భర్తీకాకుండా మిగిలిపోయిన 'క్యారీ ఫార్వర్డ్' పోస్టులే. మరోవైపు, అంతకుముందు విడుదల చేసిన నోటిఫికేషన్ల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. 905 పోస్టులతో గ్రూప్-2, 89 పోస్టులతో గ్రూప్-1 నోటిఫికేషన్లు 2023 చివర్లో విడుదల కాగా ఇప్పటివరకు వాటి తుది ఫలితాలు రాలేదు. న్యాయ వివాదాలతో ఎప్పటికప్పుడు ఫలితాలు వాయిదాలు పడుతున్నాయి. మరోవైపు యూనివర్సిటీల్లో బోధనా సిబ్బంది పోస్టులు 3 వేలకు పైగా ఖాళీగా ఉన్నాయి. పలు న్యాయ వివాదాలతో వాటికీ ముందడుగు పడటం లేదు. యూనివర్సిటీ బోధనా సిబ్బంది పోస్టులకు గ్రీన్ సిగ్నల్ లభిస్తే జాబ్ క్యాలెండర్‌లో ఎక్కువ పోస్టులు వచ్చే అవకాశం ఉంటుంది. ఇదిలా వుంటే, 25 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇవ్వాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెలలో క్యాలెండర్ ఇస్తారా? లేదా? అనేది చూడాలి.



నైనీ టెండర్లు రద్దు

- సింగరేణి అధికారులకు ఆదేశాలిచ్చాను
- టీ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ టెండర్లను రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రకటించారు. ఈ మేరకు సింగరేణి అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అయితే బొగ్గు గని కోసం టెండర్లు పిలిచిందీ, టెండర్ నిబంధనలు విధించిందీ.. సింగరేణి పాలక మండలి మాత్రమేనని, ఇందులో ప్రభుత్వానికి సంబంధం లేదని అన్నారు. దేశంలోని ఇతర ప్రభుత్వరంగ సంస్థలు బొగ్గు బ్లాకుల కోసం ఏ నిబంధనలు విధించాయో అధ్యయనం చేసి.. తిరిగి టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆదివారం 'బొగ్గు కోసం నీచ కథనం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ రాసిన వ్యాసంపై భట్టివిక్రమార్క స్పందించారు. ఈ మేరకు ప్రజాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. "నైనీ కోల్ బ్లాక్ టెండర్లు పిలిచింది సింగరేణి సంస్థ, బోర్డు మాత్రమే. ఈ మాత్రం జ్ఞానం లేకుండా తోచింది రాయడం సరికాదు. టెండర్‌లో సైట్ విజిట్ నిబంధన పెట్టారని రాశారు. ఆ ప్రాంతం క్లిష్టతరమైన పరిస్థితుల్లో ఉన్నందున.. స్థలాన్ని పరిశీలించి టెండర్లు వేయాలనేది నిబంధన. చాలా సంస్థల్లో ఈ నిబంధనలున్నాయి" అని భట్టి అన్నారు. కట్టు కథ, పిట్టకథను అల్లి తెలంగాణ ప్రజలను మభ్యపెట్టడానికి కథనం రాశారని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆరోపించారు. ఎవరైనా నిజాయితీగా ఉండటమే కాదని, నిజాయితీగా కనిపించాలని వ్యాఖ్యానించారు. "రాష్ట్రంలో బొగ్గు గనుల కోసమే కొన్ని వార్తా కథనాలు వడ్డిస్తున్నారంటూ ఆంధ్రజ్యోతిలో కథనం రాశారు. అందులో నా పేరు కూడా పెట్టారు. సింగరేణి కాలరీస్ ఆస్తులు, బొగ్గు గనులు తెలంగాణ ప్రజల ఆత్మ. ఆ ఆస్తులను, ఆత్మను కాపాడి.. భవిష్యత్తు తరాలకు అందించడమే నా లక్ష్యం. రాధాకృష్ణ లాగా ఏదిపడితే అది రాయను.. మాట్లాడను" అని అన్నారు.


కథనాలు అల్లి ప్రసారం చేస్తే ఊరుకోం..

రాధాకృష్ణ రాసిన కథనం ఉద్దేశం ఏదైనా.. బెనిఫిట్ ఆఫ్ డౌట్ కింద నైనీ టెండర్లను రద్దు చేయాలని సింగరేణి సంస్థను ఆదేశించానని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇతర విషయాలను తాను, ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ తేల్చుకుంటామని, ఆయన ఏ ఉద్దేశంతో కథనం రాశారో తెలుసుకొని తరువాత చెబుతానని అన్నారు. "మీ మధ్య వైరాన్ని మీరిద్దరే తేల్చుకోవాలి. మీ ప్రయోజనం కోసం రాష్ట్రాన్ని, పాలనను, మంత్రులను, అధికారులను లాగుతామంటే చూస్తూ ఊరుకోం. ఏ చానల్ కూడా కథనాలు అల్లి.. ప్రసారం చేస్తామంటే (మంత్రి, ఐఏఎ్‌సపై ఎన్‌టీవీ ప్రసారం చేసిన కథనాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ) ఊరుకోం. ముఖ్యమంత్రి, మంత్రులం రాష్ట్ర ప్రయోజనాల కోసం విస్తృతంగా పనిచేస్తున్నాం. చిల్లర కథనాలకు భయపడే వారెవరూ లేరు" అని అన్నారు.

కండలున్నా.. సత్తువ సున్నా!

- 60 ఏళ్లు దాటినవారిలో సగం మందికి 'డైనపీనియా' సమస్య
- మహిళల్లో 7 రెట్లు ఎక్కువగా సమస్య
- మైసూర్ మెడికల్ కాలేజీ అధ్యయనం

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కొందరు పెద్ద వయసువారు చూడటానికి కండపుష్టితో కనిపిస్తారు. పెద్దగా అనారోగ్య సమస్యలేమీ ఉండవు.. కానీ అడుగు తీసి అడుగు వేయడానికి ఇబ్బందిపడతారు. కనీసం గ్లాసుడు నీళ్లను కాసేపు పట్టుకోవడానికీ అల్లాడుతారు.. దీనికి కారణం 'డైనపీనియా'. అంటే శరీరంలో కండరాల పరిమాణం బాగానే ఉన్నా.. వాటిలో ఏ మాత్రం సత్తువ లేకుండా పోవడమే. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రతి ఇద్దరు వృద్ధుల్లో ఒకరు ఈ సమస్యతో బాధపడుతున్నారు. అందులోనూ మహిళల్లో ఈ సమస్య మరింత ఎక్కువ. కర్ణాటకలోని మైసూర్‌కు చెందిన జేఎస్ఎస్ వైద్య కళాశాల జెరియాట్రిక్ విభాగం వైద్యుల అధ్యయనంలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 2022 అక్టోబరు నుంచి 2024 ఏప్రిల్ మధ్య ఏడాదిన్నర పాటు 60ఏళ్లు దాటిన వృద్ధులపై



చేసిన ఈ అధ్యయనం వివరాలు తాజాగా ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌లో ప్రచురితమయ్యాయి.

ఏమిటీ డైనపీనియా.. సమస్య ఎంత?

సాధారణంగా వృద్ధుల్లో వయసు పెరిగిన కొద్దీ కండరాల పరిమాణం తగ్గిపోయి, బలహీనం అవడాన్ని 'సార్కోపీనియా' అంటారు. అయితే కండరాల పరిమాణం బాగానే ఉన్నా వాటి పనితీరు పూర్తిగా తగ్గిపోవడాన్ని 'డైనపీనియా'గా పిలుస్తారు. దక్షిణాది రాష్ట్రాల్లో 60 ఏళ్లు దాటిన వృద్ధుల్లో 51.6 శాతం మంది డైనపీనియా సమస్యతో బాధపడుతున్నారని తాజా అధ్యయనం వెల్లడించింది. అంటే ప్రతి ఇద్దరిలో ఒకరు ఈ సమస్యతో సతమతం అవుతున్నారని పేర్కొంది. పురుషులతో పోలిస్తే మహిళల్లో 7.6 రెట్లు ఎక్కువగా ఈ సమస్య ఉందని.. వారు చిన్నప్పటి నుంచీ సరైన పోషకాహారం లేకపోవడం, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం, హార్మోన్ల మార్పులు వంటివి దీనికి కారణమని తేల్చింది.

బరువు కాదు.. బలం ముఖ్యం

శరీరంలో కండరాల పరిమాణం కంటే వాటిలో సత్తువ ఎంత ఉందనేది ముఖ్యమని అధ్యయనం స్పష్టం చేసింది. వయసు మీద పడిన తర్వాత శారీరక శ్రమ లేకపోవడం, నడక, వ్యాయామం వంటివి చేయకపోవడంతో కండరాలు బలహీనంగా మారుతాయని పేర్కొంది. కీళ్లు, ఎముకల సమస్యలు, తీవ్ర అనారోగ్యాలు లేని వృద్ధులు.. కనీసం పది సెకన్లలో 8 మీటర్ల దూరం నడవాలని, అంతకన్నా తగ్గితే 'డైనపీనియా' బారినపడే అవకాశం 22 రెట్లు ఎక్కువగా ఉంటుందని తెలిపింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.